thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 332 కరీంనగర్ శనివారం, 7 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రోడ్డు ప్రమాదాలకు ఇకపై కాంట్రాక్టర్‌కు జరిమానా

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బీవోటీ (నిర్మాణం-నిర్వహణ-బదిలీ) పద్ధతిలో నిర్మించిన జాతీయ రహదారుల నిర్దిష్ట పరిధిలో (500 మీటర్లు) ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్లపై రూ.25 లక్షల జరిమానా విధించను న్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బీవోటీ డాక్యుమెంట్‌ను సవరించిందని రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ తెలిపారు. కాంట్రాక్టర్లు రోడ్డు ప్రమాదాలకు బాధ్య త వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఒక ఏడాదిలో హైవేలోని నిర్దిష్ట పరిధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగితే సదరు కాంట్రాక్టర్ రూ.25 లక్షలు జరిమానాగా చెల్లించాలని, తర్వాతి ఏడాది కూడా ప్రమాదా లు పునరావృతమైతే ఫైన్ రూ.50 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. హైవేల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 3,500 రోడ్డు ప్రమాదాల స్ట్రెచ్‌లను గుర్తించిందన్నారు.




# త్వరలోనే రెండవ విడత ఇళ్ళు!

## ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసేవారికి గుడ్‌న్యూస్..

## కొత్త ఇళ్ల మంజూరు ఎప్పుడంటే..? ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్ : తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసేవారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ప్రభుత్వం విడతల వారీగా కొత్త ఇళ్లను మంజూరు చేస్తోంది. కేటగిరీలుగా లబ్ధిదారులను విభజించి దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తోంది. ఇప్పటివరకు గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. వీటిల్లో కొన్ని ఇళ్లు ఇప్పటికే గృహప్రవేశాలు పూర్తవ్వగా.. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వేగంగా ఇళ్లు పూర్తయ్యేందుకు ప్రభుత్వం ప్రతీవారం లబ్ధిదారులకు నిధులను జమ చేస్తోంది. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యే కొద్ది లబ్ధిదారుల అకౌంట్లోకి జాప్యం జరగకుండా నిధులు రిలీజ్ చేస్తోంది. అలాగే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారికి ఇసుక, ఇటుకలు లాంటి సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

**త్వరలోనే రెండో జాబితా...** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తు చేసుకున్నవారి ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి ముందుగా అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోంది. తొలి జాబితాలో ఎంతోమంది పేదలకు ఇళ్లను మంజూరు చేయగా.. రెండో జాబితా త్వరలోనే విడుదల చేయనున్నట్లు తాజాగా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో పలు వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసేవారికి శుభవార్త అందుతుందని, రెండో విడత లబ్ధిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు.

**అర్హులైన ప్రతీఒక్కరికీ ఇళ్లు...** అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వంలో రాజకీయాలను పక్కనపెట్టి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నామన్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే కొద్ది 4 విడతలుగా వీటిని లబ్ధిదారుల అకౌంట్లో నేరుగా జమ చేస్తోంది.

పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్‌కు పేదలకు ఇల్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన రాలేదని విమర్శించారు. ఇక డ్వాక్రా మహిళలకు రూ.23 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేశామని, కొత్త రేషన్ కార్డులను ఇచ్చామన్నారు.

అలాగే రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. అలాగే సన్నబియ్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇటీవల విడుదల చేశామని పొంగులేటి పేర్కొన్నారు.




## హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారం

## నాయకుల సందడే..సందడి

మునిసిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రచారం హోరెత్తుతోంది. అభ్యర్థులు గెలుపు కోసం ఓటర్లను ఆకర్శించడానికి రకరకాల ఎత్తులు ప్రదర్శిస్తున్నారు. మైకులు, కళాకారుల ఆట పాటలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి ముఖ్య నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి స్థానికంగా ఉంటూ ప్రచారం చేస్తున్నారు. కొందరు స్వతంత్ర్య అభ్యర్థులు కూడా ప్రధాన పార్టీలకు ధీటుగా ప్రచారం చేస్తూ దూసుకుపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీ మునిసిపాలిటీ గెలుచుకోవాల్సిందే అని ఎమ్మెల్యేలకు, నాయకులకు దిశానిర్దేశం చేయడంతో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పట్టణంలో పట్టు నిలుపుకుంటే కేడర్‌లో జోష్ పెరుగడం వల్ల కేడర్‌ను కాపాడుకుని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సులభం అవు తుందని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు భావిస్తున్నాయి. దీంతో ప్రధాన పార్టీల నాయకులు ప్రచారానికి పదును పెంచుతున్నారు. కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులు బల నిరూపణకు పోటీ పడి ప్రజలను ప్రచారానికి తీసుకెళ్తున్నారు. ప్రచారానికి వెళ్తే ఒక్కొక్కరు రూ. 200 నుంచి 500 వరకు ముట్టచెబుతున్నారు. మరికొన్నిచోట్ల రూ. 200 ఇవ్వడంతో పాటు చికెన్, బిర్యాని కూడా పంపిణీ చేస్తున్నారు. కార్నర్ మీటింగులకు ఓటర్లను తరలించే కొందరు నాయకులకు వారి గ్రూప్ సంఖ్యను బట్టి రూ5000 నుంచి రూ20000వరకు ముట్టచెబుతున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతున్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది.

ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉండ దంతో పార్టీలు ఎన్ని ఎత్తులు వేస్తాయో, ఎవరు ఎటు జంప్ అవు తారో ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

జనసేన పార్టీ
JANASENA PARTY

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు..

## 336 వార్డుల్లో జనసేన పోటీ

హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 336 వార్డుల్లో పోటీ చేస్తున్నట్లు జనసేన ప్రకటించింది. నిజామాబాద్‌లో 48, మహబూబ్‌నగర్‌లో 44, కొత్తగూడెంలో 22, మహబూబాబాద్‌లో 5, రంగారెడ్డిలో 21, మెదక్‌లో 18, ఖమ్మంలో 17, కరీంనగర్‌లో 56, వరంగల్‌లో 20, ఆదిలాబాద్‌లో 39, నల్గొండలో 46 వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నట్టు వెల్లడించింది. జనసేన అభ్యర్థులు గాజు గ్లాస్ గుర్తుపై పోటీ చేస్తున్నట్లు వెల్లడించింది. నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు ఆమోదించినట్టు పేర్కొంది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో సమావేశమై తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని కోరారు. అయితే, పవన్ పర్యటనపై ఇంకా స్పష్టత రాలేదు.

# మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

## నిజామాబాద్ 'ప్రజా పాలన - ప్రగతి బాట' సభలో సీఎం రేవంత్‌రెడ్డి




నిజామాబాద్ : 'ప్రజా పాలన – ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శం అని కొనియాడారు. నిజామాబాద్ రైతుల పోరాట స్ఫూర్తితో 2028లో ఫైట్ చేస్తాం.. మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు.

మహేశ్ కుమార్ గౌడ్ సూచనలతో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. రేపు జరుగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయబోతున్నామని జోస్యం చెప్పారు. రాష్ట్రానికి నిజామాబాద్ గొప్ప నాయకులను అందించిందని గుర్తుచేశారు.

**ధర్మపురి అర్వింద్ చేసిందేంటి?...** నిజామాబాద్ ఎంపీగా రెండుసార్లు ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్.. ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ చేయలేకపోయిన బీజేపీకి ఎందుకు ఓట్లు వేయాలని అడిగారు. ధర్మపురి అర్వింద్‌తో పాటు మొత్తం బీజేపీ ఎంపీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. నిజామాబాద్ ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే.. కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా అర్వింద్ తీసుకురాలేకపోయాడని విమర్శించారు. ధర్మపురి అర్వింద్‌తో సహా ఏ ఒక్క బీజేపీ ఎంపీకి కూడా కేంద్ర నేతల దగ్గర బలంగా మాట్లాడే దమ్ము లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, హరీష్ రావును జైల్లో పెట్టాలని పదే పదే అర్వింద్ డిమాడ్ చేస్తున్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలని అడిగారు. సీబీఐ ఎంక్వైరీకి తీర్మానం జరిగి ఆరు నెలలైనా ఎందుకు అరెస్ట్ చేయలేదని ధర్మపురి అర్వింద్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సీబీఐకి ఇస్తే.. కేసీఆర్‌ను 48 గంటల్లో అరెస్ట్ చేస్తామన్న కిషన్ రెడ్డి ఎక్కడ దాక్కున్నాడని మండిపడ్డారు. ధర్మపురి అర్వింద్‌కు ప్రధాని మోడీ దగ్గర పరపతి లేదు. ఆయన వల్ల జిల్లాకు కూడా ఏం ఉపయోగం లేదు.

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే.. అది తప్పకుండా వృథా అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. గాడిదకు గడ్డి వేసి.. ఆవుకు పాలు పిండితే ఎలా వస్తాయని అడిగారు. మన బస్తీ, మన కాలనీ అభివృద్ధి జరుగాలంటే మనోడే గెలవాలని అన్నారు.

**కల్వకుంట్ల కిషన్‌రావుగా కిషన్‌రెడ్డి రూపాంతరం :** కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ప్రజా పాలన – ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి.. బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవీకాల్ బంధమని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటు వేస్తే మూసీలో వేసినట్లేనని చెప్పారు. కేసీఆర్‌ను కిషన్ రెడ్డే కాపాడుతున్నాడని కీలక వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల కిషన్ రావుగా కిషన్ రెడ్డి మారాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ దత్తపుత్రుడు కిషన్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధికి నిధులు ఇవ్వని బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం. మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుంది. నేను అందరివాడిని. నాకు కులం, మతం లేదు. నిజామాబాద్ జిల్లా గొప్ప నాయకులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారింది. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండు సార్లు గెలిపించినా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోడీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఈ ఎన్నికల్లో ఓటు వేస్తే ఒరిగేది ఏమీ లేదని అన్నారు.




హైదరాబాద్: మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నానన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.




సంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. సంగారెడ్డి జిల్లాలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది మృతి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఆ బాధిత కుటుంబాలకు రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. 'సిగాచి ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని ఛాలెంజ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తాను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, మరుసటి రోజు మాత్రమే సీఎం వచ్చారన్నారు. కంపెనీ రూ.25 లక్షలు ఇచ్చినా.. రేవంత్ ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను గుర్తుచేస్తూ మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పెన్షన్‌ను 4 వేల రూపాయలకు పెంచుతామని బాండ్ పేపర్‌పై రాసిచ్చినా అమలు కాలేదన్నారు. కళ్యాణ లక్ష్మి కోసం కేసీఆర్ ఇచ్చిన లక్షా 116 రూపాయల కంటే రేవంత్ తులం బంగారం అదనంగా ఇస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఫ్రీ బస్సు పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని.. పురుషుల బస్సు ఛార్జీలను డబుల్ చేశారని విమర్శించారు. ఇస్నాపూర్‌లో గత రెండేళ్లలో గజం రోడ్డు కూడా వేయలేదని, చిన్న డ్రైనేజీ కూడా కట్టలేదన్నారు. కరోనా సమయంలో కేసీఆర్ ప్రజలను కాపాడారని హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ లేని లోటు ఇప్పుడు అందరికీ తెలుస్తోందన్నారు. పనులు ఎవరు చేస్తారో గమనించి ఓటు వేయాలని హరీశ్ సూచించారు. బీజేపీని కార్మికులు, పేదల వ్యతిరేక పార్టీ అని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ సీఎం అన్న విషయాన్ని మర్చిపోయి ఏదేదో మాట్లాడుతున్నారని.. సీఎం మాట్లాడే భాష తగినది కాదన్నారు. కేసీఆర్‌ను బూతులు తిడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను జైలుకు పంపాలని చెబుతున్నారని విమర్శించారు. రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ సీఎంగా, తాను మంత్రిగా వస్తానన్నారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో డబ్బులు పంచితే తీసుకోవాలని.. ఓటు మాత్రం కారు గుర్తుకే వేయాలని ప్రజలను మాజీ మంత్రి హరీశ్ రావు కోరారు. కాగా.. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పర్యటించిన హరీశ్ రావు.. అక్కడి మహిళలతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. మహిళలతో ముచ్చటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## కేసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు: సీ ఎం రేవంత్



బర్దిపూర్: నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. "పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం. మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుంది. నేను అందరివాడిని. నాకు కులం, మతం లేదు.

ఈ జిల్లా గొప్ప నాయకులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారింది. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండు సార్లు గెలిపించినా.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. మోదీ దగ్గర ఎంపీ అర్వింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదు. కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నా? కేసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారు" అని సీఎం విమర్శించారు.

## సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికలు, ఇతర అంశాలపై వారిద్దరూ చర్చిస్తున్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, నేతల మధ్య సమన్వయం తదితర విషయాలపై రేవంత్, భట్టి చర్చలు జరుపుతున్నట్లు సమాచా రం. ఇటీవల మంత్రులతో సీఎం నిర్వహించిన భేటీకి డిప్యూటీ సీఎం హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో సీఎంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.



## తెలంగాణలో భాజపా మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల



హైదరాబాద్: తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖా శర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడుతున్నాయని అని రామచందర్ రావు అన్నారు. కేంద్రం.. తెలంగాణకు ఏం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇచ్చిందో.. జిల్లాల వారీగా చెబుతామని, రేవంత్ రెడ్డి జిల్లాలకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. పోలీసులు భాజపా కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం, మంచిర్యాలలో పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను కార్యకర్తల్లా ఉపయోగించుకుంటుందని దుయ్యబట్టారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాజపా సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.




## తెలంగాణలో పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం: మంత్రి సీతక్క

ములుగు : తెలంగాణలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర మంత్రి సీతక్క ప్రకటించారు. కేరళ రాష్ట్రంలో అమలు చేసిన 'కుటుంబశ్రీ' మోడల్‌ను అనుసరించి ఈ పథకాన్ని రూపొందిస్తున్నామని ఆమె తెలిపారు. కేరళలో సర్వే ద్వారా 65 వేల మంది అత్యంత పేదలను గుర్తించి.. వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చినట్లు చెప్పారు. తెలంగాణలోనూ అదే తరహాలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సర్వే చేయించి.. అత్యంత పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తామని వివరించారు. సర్వే తర్వాత ప్రతి కుటుంబానికి వారి అవసరాలకు తగినట్లు సహాయం అందిస్తామని సీతక్క చెప్పారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినా చొరవ తీసుకుంటామన్నారు. అంతేకాకుండా.. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలు, శ్రీమంతుల సహకారం తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే మార్గదర్శకాలు రూపొందించి కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ కొత్త పథకం ద్వారా తెలంగాణను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు.. మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోండి.. అసెంబ్లీ స్పీకర్‌కి సుప్రీంకోర్టు ఆదేశం

ఢిల్లీ, ఫిబ్రవరి 6 : తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో ఈరోజు జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని ఆయన కోరారు.

**సుప్రీంకోర్టు స్పందన..** అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా (సానుకూలంగా) ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**పిటిషన్ దాఖలు చేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి ..** బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.



సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## భాగ్యనగరంలో రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్..!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఆ ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**వాచ్‌మన్‌కు మత్తు మందు..** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. రూ.20 లక్షలు విలువ చేసే బంగారం, డైమండ్స్ దోచుకెళ్లారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను పోలీసులు ఏర్పాటు చేశారు. నందగిరి హిల్స్ నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ వరకు సీసీ టీవీలను పరిశీలించారు. మొదటగా.. ఆ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉన్న వాచ్‌మన్‌కు మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆ తర్వాత ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేశారు. వాచ్‌మన్ మత్తులోకి జారుకోగానే దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి లాకర్‌లోని బంగారు ఆభరణాలు మొత్తం ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసులో నలుగురు నేపాలీలను ప్రధాన అనుమానితులుగా భావిస్తున్నారు పోలీసులు.

**దొంగల కోసం గాలింపు..** బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దొంగల కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దొంగలు నగరం విడిచి వెళ్లకుండా విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఈ తరహా నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల జాబితాను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నగరంలో నేపాలీ గ్యాంగ్‌ల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పని మనుషులు, వాచ్‌మెన్‌లను నియమించే సమయంలో వారి ఆధార్ కార్డులు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని పోలీసులు సూచిస్తున్నారు.




మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజయ్‌కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజయ్ పిటిషన్ ను కొట్టేసింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

**అందుకే జరిమానా..** 2015-16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్ను దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజయ్ రూ.35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజయ్ ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ.15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని దాచినందుకు రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

దీనిని సవాలు చేస్తూ విజయ్.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. విజయ్ నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు.




## పెద్దపులి గాండ్రింపులు.. ఇళ్లపైకి ఎక్కిన గ్రామస్థులు..

తూర్పు గోదావరి జిల్లా, ఫిబ్రవరి 6: వారం రోజులుగా తూర్పు గోదావరి జిల్లాలో పెద్దపులి (అస్త్రవతీ) సంచారం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. రోజుకో ప్రాంతంలో కనిపిస్తూ అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్న పులి తాజాగా రాయవరం మండలం కూర్మాపురంలోకి ప్రవేశించింది. పొలాల నుంచి ఇళ్ల వైపు వచ్చిన పెద్దపులి.. గ్రామంలోని ఒక పాడుబడిన ఇంట్లోకి దూరినట్లు స్థానికులు అటవీశాఖకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం నుంచీ పులి గాండ్రింపులు వినిపిస్తున్నట్లు అధికారులకు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. సమాచారం అందిన వెంటనే అటవీశాఖ అధికారులు స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పుణే నుంచి వచ్చిన రెస్క్యూ టీమ్‌తో కలిసి పులిని సురక్షితంగా బంధించేందుకు ఆపరేషన్ చేపట్టారు. మత్తు ఇంజెక్షన్ గన్‌లను సిద్ధం చేసి, బోనులు ఏర్పాటు చేసి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పులి భయంతో గ్రామస్తులు చాలామంది ఇళ్లపైకి ఎక్కి పరిస్థితిని గమనిస్తున్నారు. పులిని బంధించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేసుకున్నారు. అంతకుముందు, కూర్మాపురంలో వరి పొలంలో పులిని చూసిన సత్తిబాబు అనే వ్యక్తి భయంతో పరుగులు తీశాడు. పులి భయంతో కింద పడిపోవడంతో సత్తిబాబుకు గాయాలు అయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## పాస్‌బుక్‌లు ట్యాంపర్ చేస్తే జైలుకే: సీఎం చంద్రబాబు




కలుగొట్ల: భూమిపై ఇతరులెవరూ కన్నేయకుండా ప్రజలకు సర్వహక్కులు కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. "గతంలో భూ సమస్యల ఫిర్యాదులు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇప్పుడు భూమిని ఇతరుల పేరుపైకి మారిస్తే వెంటనే తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే మీరు చూసుకోవచ్చు. మీ రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రంగా ఉంటాయి. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. రాజముద్రతో పట్టాదారు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. వీటిని ఎవరైనా ట్యాంపర్ చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం. అలాంటి వారిని వదిలిపెట్టేది లేదు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిని కూడా కల్తీ చేశారు. సీబీఐ, సిట్ ఏమీ లేదని చెప్పారని అంటున్నారు. అందులో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించింది. బాత్‌రూమ్ క్లీన్ చేసే రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా చేశారు. శ్రీశైలంలో కూడా రసాయనాలతో ప్రసాదం కల్తీ చేశారు. నేను సీఎం అయ్యాక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించాం. తితిదే ఈవోను మార్చి మంచి ఆఫీసర్‌ను తీసుకొచ్చాం. గతంతో పోలిస్తే లడ్డూలో చాలా వ్యత్యాసం ఉంది"అని చంద్రబాబు అన్నారు.


## హిందూ ధర్మంపై దాడి జరిగితే హిందువులంతా గొంతెత్తాలి: పవన్



అమరావతి: మన హిందూ ధర్మాన్ని మనమే రక్షించుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ప్రతి భక్తుడికీ ధర్మాన్ని కాపాడే బాధ్యత ఉందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. "దేవుళ్లను ఎవరైనా అవమానిస్తే హిందువులు వ్యక్తిగతంగానే బాధపడతారు. ఎవరు చేసిన కర్మ వారే అనుభవిస్తారని భావిస్తారు. హిందువుల్లో ఈ ఉదాసీన వైఖరి మారాలి.

కుల, ప్రాంత, భాష విభేదాలున్నా హిందూ ధర్మం ఒక్కటే. హిందూ ధర్మంపై దాడి జరిగితే హిందువులంతా గొంతెత్తాలి. మన ధర్మాన్ని మనమే రక్షించుకోవాలి. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం ఎవరికీ వ్యతిరేకం కాదు" అని పవన్ సంచలన ట్వీట్ చేశారు.

## తిరుమల ప్రసాదంలో కల్తీ జరిగిందని 4 నివేదికలు తేల్చాయి: హోం మంత్రి అనిత



అమరావతి: రాష్ట్రంలో కల్తీ రిక్రూట్‌మెంట్ బోర్డును జగన్ స్థాపించారని హోం మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. కల్తీ పాలనతో మహాపాపం చేసి ఎదురుదాడి చేయడానికి సిగ్గనిపించట్లేదా అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒకటి కాదు రెండు కాదు నాలుగు నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. అందులో సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక 2022లో వైకాపా హయాంలో వచ్చిందే అన్నారు. సీఎఫ్‌టీఆర్ఐతో పాటు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ, సిట్ నివేదికలు అన్నీ కల్తీని ధ్రువీకరించాయని స్పష్టం చేశారు. జంతు కొవ్వు అవశేషాలు నిర్ధారించే సామర్థ్యం తమ వద్ద లేదని మాత్రమే ఎన్‌డీఆర్ఐ చెబితే.. దానిని పట్టుకుని జంతుకొవ్వు లేదని ప్రచారం చేసుకుంటారా అని మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరగలేదనటానికి తాడేపల్లి ప్యాలెస్‌లో ముద్రించే సాక్షి కరపత్రం కాకుండా మరేదైనా నివేదిక వైకాపా వద్ద ఉందా అని ప్రశ్నించారు. టాయిలెట్ క్లీనింగ్‌కు వాడే 'లబ్సా' అనే రసాయనం వాడి మహా అపచారానికి ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయ్ హత్యకు ముందు ఎలాంటి మైండ్ గేమ్ ఆడారో.. కల్తీ నెయ్యి వ్యవహారంలోనూ అలాంటి మైండ్ గేమ్ ఆడుతున్నారని ధ్వజమెత్తారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న ఇలాంటి వారిని రాజకీయాల్లో లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని హోం మంత్రి అన్నారు.



## జగన్ పరామర్శ యాత్రలో అపశ్రుతి.. ఇబ్రహీంపట్నంలో ఇద్దరు మృతి

విజయవాడ: వైకాపా అధినేత జగన్ పర్యటన సందర్భంగా అపశ్రుతి చోటు చేసుంది. మాజీ మంత్రి జోగి రమేష్‌ను పరామర్శించేందుకు తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నం బయల్దేరారు. ఈ క్రమంలో జోగి రమేష్ ఇంటి సమీపంలో వైకాపా నేత ఒకరు మృతి చెందారు. జగన్ పర్యటన దృష్ట్యా జోగి రమేష్ ఇంటికి వెళ్తున్న వైకాపా చిల్లకల్లు గ్రామ అధ్యక్షుడు డి.రాంబాబు పల్స్ పడిపోయి కుప్పకూలారు. సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఇబ్రహీంపట్నంలో బైక్‌పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బార్ గేట్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. మృతుడు ఇబ్రహీంపట్నం కొత్తగేట్‌కు చెందిన భార్గవ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**రెచ్చిపోయిన వైకాపా కార్యకర్తలు..** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వైకాపా కార్యకర్తలు రెచ్చిపోయారు. జన సమీకరణతో గుంపులు గుంపులుగా రోడ్లపైకి చేరుకుని ప్రజలను అవస్థలకు గురిచేశారు. ఇబ్రహీంపట్నం రింగు, తదితర ప్రాంతాల్లో బైక్‌లతో స్టంట్‌లు చేస్తూ అలజడి సృష్టించారు. జోగి రమేశ్ సహా పలువురు వైకాపా నేతలు అక్కడే ఉన్నా వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదు.




## హెచ్-1బీ వీసాదారులు నగరాన్ని ఆక్రమించారు.. టెక్సాస్‌లో భారతీయులపై వివక్ష..!

అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలో జరిగిన ఓ సమావేశంలో అక్కడి భారతీయులు వివక్షకు గురయినట్లు తెలుస్తోంది. హెచ్-1బీ వీసా దారులు తమ నగరాన్ని ఆక్రమించారంటూ ఫ్రిస్కో నగరంలోని కౌన్సిల్ సమావేశంలో అక్కడి సంప్రదాయ నేతలు జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. అయితే, దీనికి హాజరైన భారతీయులు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 3న జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. వాటి ప్రకారం.. ఫ్రిస్కో నగరంలో భారతీయుల సంఖ్య పెరిగిపోవడంపై కౌన్సిల్ సమావేశంలో మాట్లాడేందుకు రావాలని సోషల్ మీడియా కన్జర్వేటివ్ ఇన్‌ఫ్లూయెన్సర్లు కైలీ కాంబెల్, మార్క్ పలాసియానోలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొందరు వ్యక్తులు యూఎస్‌కు మద్దతుగా ఉండే టోపీలు, మాస్క్‌లతో పాల్గొన్నారు.

వారు హెచ్-1బీ వీసాకు, ఇక్కడి భారతీయులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మార్క్ పలాసియానో మాట్లాడుతూ.. ఇక్కడ భారతీయుల జనాభా పెరగడం యాదృచ్ఛికం కాదన్నారు. ఇక్కడ వీసాల జారీలో మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. త్వరలో ఈ ప్రాంతం మొత్తం భారతీయులతో నిండిపోతుందని.. ఇప్పటికైనా అమెరికన్లు మేలుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన అమెరికన్ల ఉద్యోగాలను లాక్కొనే వీసా విధానానికి తాను, తన మద్దతుదారులు ఎప్పటికీ వ్యతిరేకమేనని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ వివక్షపూరిత వ్యాఖ్యలను సమావేశంలో పాల్గొన్న అనేకమంది ఇండో- అమెరికన్లు తీవ్రంగా ఖండించారు. హెచ్-1బీ వీసాల జారీలో జరుగుతున్న మోసాలను తాము వ్యతిరేకిస్తామని.. అయితే, ఇందుకు ఇక్కడి భారతీయులపై ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. తాము ఇక్కడ జీవించడం వల్ల ఈ ప్రాంతానికి కూడా ప్రయోజనకరమని స్పష్టంచేశారు.

నగరంలో నివసించే భారతీయులకు ఫ్రిస్కో మేయర్ జెఫ్ చెనీ మద్దతుగా నిలిచారు. కాగా, ఫ్రిస్కోలో భారతీయ మూలాలున్న జనాభా అధికం. ప్రభుత్వం నిర్వహించిన సర్వే ప్రకారం.. 2010లో 10 శాతంగా ఉన్న వీరి సంఖ్య ఇప్పుడు 33 శాతానికి పెరిగింది.




## వెంటనే ఇరాన్ వీడండి : తన పౌరులకు అమెరికా అడ్వైజరీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగశాఖ జారీ చేసిన అడ్వైజరీ ఆందోళన కలిగిస్తోంది. 'వెంటనే ఇరాన్‌ను వీడండి' అంటూ యూఎస్ తన పౌరులను అప్రమత్తం చేసింది. "వెంటనే వీడటం వీలుకాకపోతే.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి" అంటూ అడ్వైజరీ జారీ అయింది. అయితే నెటిజన్లు కొందరు ఇది కొత్త అడ్వైజరీ కాదంటూ పోస్టులు పెడుతున్నారు. ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొంటున్న ఇరాన్.. స్వదేశంలో జరిగిన భారీ నిరసనల నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేదు. అడ్వైజరీకి ముందు ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ మరోసారి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. "ఖమేనీ చాలా కలత చెందక తప్పదు" అని పేర్కొన్నారు. దీంతో అమెరికా దాడులు చేస్తుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు దేశాల మధ్య అణు చర్చలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ ప్రకటనలు రావడం గమనార్హం. ఒమన్‌లో జరగనున్న చర్చల్లో కేవలం అణు అంశాల పైనే కాకుండా, ఇతర విషయాల పైనా సమాలోచనలు జరపాలని ఇరాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. విమానంలో ప్రయాణించేటప్పుడు తాను నిద్రపోనని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. "విదేశాలకు వెళ్లేటప్పుడు ఎయిర్‌ఫోర్స్ వన్‌లో నేను నిద్రించను. 20 గంటలు అయినా సరే మేల్కొనే ఉంటా. ఏమైనా ప్రమాదాలు పొంచి ఉన్నాయా..? క్షిపణులొస్తున్నాయా..? అని కిటికీలో నుంచి ఆకాశం వైపు చూస్తుంటా" అని నవ్వుతూ మీడియాతో మాట్లాడారు.

## లిక్కర్ స్కామ్ నిందితుడి ఆస్తుల అటాచ్.. ప్రభుత్వం ఆదేశం




అమరావతి, ఫిబ్రవరి 6: వైసీపీ పాలనలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుడు బాలాజీ యాదవ్ ఆస్తుల అటాచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన తండ్రి కుల్లాయప్ప పేరిట ఉన్న ఆస్తులనూ అటాచ్ చేయాలని సర్కార్ ఆదేశించింది. ఏపీఎస్‌బీసీఎల్‌లో 2019-24 మధ్య కాలంలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఈ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట, మంగళం, సెట్టిపల్లి గ్రామాల పరిధిలో విలువైన భూములను కుల్లాయప్ప పేరిట నిందితులు రిజిస్టర్ చేయించారు. వసుప్రాధ ఎన్‌క్లేవ్ లేఅవుట్‌లో ఉన్న ప్లాట్లనూ కొనుగోలు చేసినట్టు గుర్తించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వైకుంఠపురంలోని ఓ నివాస భవనాన్ని కుల్లాయప్ప పేరిట రిజిస్టర్ చేయించారు నిందితులు. బాలాజీ యాదవ్‌కు గిఫ్ట్ డీడ్‌ల పేరిట రిజిస్టరైన ఆస్తులకూ.. అక్రమ మద్యం ఆదాయం నుంచే సొమ్ములు చెల్లించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా.. తిమ్మాయగుంట, వెంకటాపురం గ్రామాల్లోని ఓపెన్ ప్లాట్‌ను మద్యం అక్రమ నగదుతో కొనుగోలు చేశారని సమాచారం. అలాగే.. గాంధీపురం పంచాయతీ పరిధిలో గల ఓ ఇంటినీ 2021లో అక్రమార్జనతోనే కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. సిట్ దర్యాప్తులో భాగంగా ఆస్తి పత్రాలు, సాక్ష్యాల ఆధారంగా మద్యం కుంభకోణం ద్వారా పొందిన అక్రమ లాభాలతోనే ఈ ఆస్తులను కొనుగోలు చేసినట్టు అధికారులు తేల్చారు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం.. ఈ ఆస్తులన్నింటినీ అటాచ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో చట్ట ప్రకారం.. తదుపరి చర్యలు చేపట్టి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని డీజీపీని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌లు.. ఈ ఆస్తులపై తదుపరి లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## ఆర్థిక లెక్కలపై సీఎం చంద్రబాబు అసహనం

కర్నూలు, ఫిబ్రవరి 6 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని, రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రైతుల్లో హర్షాతిరేకాలను కలిగించింది.

**ప్రభుత్వ స్టాళ్ల పరిశీలన..** గ్రామసభ ప్రాంగణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రైతులు, గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ హక్కులు, భూ రికార్డుల తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఆర్థిక లెక్కలపై అసహనం..** ఈ సందర్భంగా జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి ఆర్థిక లెక్కలపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. 'తలసరి ఆదాయం వివరాలన్నీ ముందుగానే నేను చదువుకొని వచ్చాను' అని పేర్కొంటూ, కాకి లెక్కలు కాకుండా కరెక్ట్ డేటా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిరికి సీఎం చంద్రబాబు స్పష్టంగా సూచించారు. అధికారులు సమగ్ర అవగాహనతో, బాధ్యతగా సమాచారం ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు కూడా ఆర్థిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సరైన డేటా, స్పష్టమైన విశ్లేషణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

**బుడగ జంగాలపై కీలక ప్రకటన..** బుడగ జంగాల అంశంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించానని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ఎస్సీలకు రిజర్వేషన్లు మినహా అందే అన్ని ప్రయోజనాలు బుడగ జంగాలకూ అందేలా నిన్ననే సంతకం చేశానని వెల్లడించారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**రైతులకు భరోసా..** 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని సీఎం చంద్రబాబు తెలిపారు. భూ రికార్డులు స్పష్టంగా ఉంటే రైతులకు భద్రత, ఆర్థిక స్థిరత్వం వస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

చురకలు

## సంపాదకీయం

# రాహుల్ నోరు నొక్కుతున్నారా... ఫ్లాష్ బ్యాక్ ఏమి చెబుతోంది ?

భారత దేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఈ విషయం ఎన్నో సార్లు గొప్పగా అంతా చెప్పుకుంటారు. అలాంటిది ఈ దేశానికి అత్యున్నత చట్ట సభల వేదికల మీద జరుగుతున్నదేమిటి అన్న చర్చ అయితే సాగుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఎందుకు వరసబెట్టి వాయిదా పడుతున్నాయి, ఎందుకు సజావుగా సాగడం లేదు, దానికి కారణాలు ఏమిటి ప్రతిష్టంబనకు గల పరిస్థితులు ఏమిటి ఇది సాగుతున్న చర్చ. పార్లమెంట్ లో చూసుకుంటే బలమైన అధికార పక్షంగా ఎన్డీయే ఉంది. మిత్రులు తటస్థుల మద్దతుతో కలుపుకుని మూడు వందల మంది ఎంపీల బలం ఎన్డీయేకు ఉంది. పైగా గత మూడు దఫాలుగా అధికారంలో ఎన్డీయే ఉంది.


**రాహుల్ అపోజిషన్ :** ఒక విపక్షం వైపు చూస్తే వంద మార్క్ కి చేరువలో కాంగ్రెస్ ఎంపీలు ఉన్నారు రాహుల్ గాంధీ తొలిసారి తన మొత్తం పొలిటికల్ కెరీర్ లో కేబినెట్ ర్యాంక్ హోదాతో అధికార ప్రోటోకాల్ తో ఉన్నారు. 2024 లో ఆయనకు లీడర్ ఆఫ్ అపోజిషన్ దక్కింది. పార్లమెంటరీ సంప్రదాయాలను బట్టి చూస్తే ప్రధాని తరువాత ఎంతో ప్రాధాన్యత లీడర్ ఆఫ్ అపోజిషన్ కి ఉంది. రాహుల్ గాంధీ ఏ ప్రశ్నను అయినా సంధించవచ్చు. అయితే నిబంధనలు విరుద్ధంగా ఉంటే నో చెప్పవచ్చు. కానీ ఆయన మాట్లాడకుండా అడ్డుకోవడం వల్ల ఉపయోగం ఏమిటి అన్నదే చర్చగా ఉంది.

**ఆ పుస్తకంలో ఏముంది :** రాహుల్ గాంధీ సభలో మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే రాసిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకంలోని కొన్ని లైన్లు సభలో చదవాలని ప్రయత్నించారు. అయితే ఆ పుస్తకం ప్రచురణ కాలేదని అందువల్ల ఆ పుస్తకం లోని అంశాల గురించి రూల్స్ ప్రకారం సభలో ప్రస్తావించ వద్దంటూ అధికార పక్షం అడ్డుకుంది. నిజానికి ఈ పుస్తకంలో ఉన్నది ఏమిటి అంటే చైనా దళాలు భారత్ భూభాగం లోకి దాడికి వస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంలో విఫలం అయింది అన్నది రాహుల్ చెప్పదలచుకున్నారు. దాంతో రూల్స్ ప్రస్తావన తేవడంతో రాహుల్ చెప్పాలనుకున్నది సభలో చెప్పలేకపోయారు. అయితే ఇదే సభలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కొన్ని పుస్తకాలను తీసుకుని వచ్చి నెహ్రూ మీద విమర్శలు సంధించారు. మరి ఆ పుస్తకాలకు అనుమతి ఇచ్చినపుడు రాహుల్ గాంధీని ఎందుకు మాట్లాడనివ్వరని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు.

**పంతాలకు పోతున్నారా :** ఇక రాహుల్ గాంధీ తాను ఏ పుస్తకాలను ప్రస్తావించనని భారత్ చైనాల మధ్య ఉన్న ఉద్రిక్తతలు పరిస్థితుల గురించి జాతీయ భద్రత అంశంగా మాట్లాడుతాను అని చెప్పినా కూడా అనుమతించకపోవడం పట్ల చర్చ సాగుతోంది. నిజానికి ప్రతిపక్షం ఏమి చెప్పినా చివరికి మైక్ అధికార పక్షానికి వస్తుంది. విపక్షం చెప్పింది తప్పు అని చెప్పే హక్కు అధికార పక్షానికి ఉంటుంది తమ వాదనా పటిమతో విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా తిప్పి కొట్టే అవకాశం అడ్వాంటేజ్ అధికార పక్షానికి ఎపుడూ ఉంటాయి. కానీ విపక్షాలు ఏమి చెప్పదలచుకున్నారు అన్నది చెప్పనీయక పోతే ఎలా అన్న ప్రశ్ననే ఇండియా కూటమి నుంచి వ్యక్తం అవుతోంది. సభలో ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజం, అధికార పక్షం వాస్తవాలను ఇవిగో అని చెప్పాల్సి ఉంటుంది. కానీ అసలు మాట్లాడనీ యకపోవడమేంటి అన్నదే చర్చగా ఉంది. ఇలా పంతాలకు పట్టింపులకు పోతే సభలో ప్రజా సమస్యలు కానీ కీలక అంశాలు కానీ చర్చకు ఎలా వస్తాయని అంటున్నారు.

**గతంలో అలా :** గతంలో తొలి ప్రధాని నెహ్రూ కేవలం ఒకరిద్దరు సభ్యులు కలిగిన జన సంఘ్ కి అంటే ఇప్పటి బీజేపీ పూర్వ రూపం అయిన పార్టీకి ఎన్నో అవకాశాలు మాట్లాడేందుకు ఇచ్చారు తన ప్రభుత్వం మీద అప్పటి యువ నేత అటల్ బిహారీ వాజ్ పేయి విమర్శలు చేస్తూ ఉంటే నెహ్రూ అనుమతించేవారు. ఆయన విమర్శలకు సరైతే సరిదిద్దుకునే వారు. లేకపోతే వివరణ ఇచ్చేవారు. అది కదా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉండాల్సిన ముఖ్య లక్షణం అన్నది అంతా అంటున్న మాట. విపక్షాలను మాట్లాడనీయవద్దు అనో లేక రూల్స్ చూపించో ఆపితే అంతిమంగా నష్టపోయేది ఎవరు అంటే జవాబు సులువుగానే దొరుకుతుంది. ప్రతిపక్షం అంటే ప్రజల నుంచి వచ్చిన ప్రశ్నలుగానే చూడాలి. జవాబు వాటికి చెప్పగలగాలి. అంతే తప్ప అధికార పక్షం వైపే అంతా అన్నట్లుగా వ్యవహారం సాగితే ఎలా అన్నది మేధావుల నుంచి వస్తున్న మాట. అధికార పక్షం ప్రతిపక్షం స్నేహ పూర్వక వాతావరణంలో చర్చలు జరపాలి. ఎవరూ ఎవరికీ శత్రువులు కారని గ్రహించాలి అని సూచనలు వస్తున్నాయి.

# తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు వేటూరి ప్రభాకర శాస్త్రి - ఫిబ్రవరి 7...వేటూరి ప్రభాకరశాస్త్రి జయంతి



ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని అందులోనే జీవితాన్ని గడిపేవారు సామాన్యులు. కోరుకుని ఎన్నుకున్న రంగంలో నిరంతర కృషి సల్పుతూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునేవారు అసామాన్యులు. కాలానికన్నా అన్ని రంగాల్లో విశేష కృషి చేస్తూ, ఆయా రంగాల్లో పరిపూర్ణతను సాధించి, నిష్ణాతులై, ఒక ప్రత్యేక స్థానాన్ని పొందేవారే మహనీయులు. తెలుగు సాహిత్య లోకంలో చివరి కోవకు చెందిన మహనీయులు, మహామహులు వేటూరి ప్రభాకరశాస్త్రి. తెలుగు సాహిత్యానికి సక్రమమైన రూపం కల్పించి, ప్రజలందరికీ అందించే ప్రయత్నంలో తమ జీవితాలను ధారపోసిన మహనీయుల్లో అగ్రగణ్యులు వేటూరి. చరిత్రలో లభ్యమవుతున్న మొట్ట మొదటిదిగా భావించ బడిన తెలుగు పదము "నాగబు" అని కనుగొన్నది ఆయనే కావడం విశేషం. "భాష అడవి వంటిది- కవిత ఉద్యానవనం వంటిది. ఉద్యానవన పెంపు సొంపులకు అరణ్య పరిశోధన అవసరమైనట్లే సుకవితకి భాషా పరిశోధన అవసరం" అని గట్టిగా నమ్మారు. చిన్నతనంలోనే సంపాదించుకున్న "శతావధాని వేటూరి ప్రభాకరశాస్త్రి" అనే గొప్ప పేరును తృణ ప్రాయంగా త్యజించి, తన జీవితానికి అర్థం పరమార్థం అవధానం కాదని, నిరంతర పరిశోధన అని నిర్ణయించుకుని, పరిశోధనకే అంకితమైన ధన్య జీవి వేటూరి. వేటూరి ప్రభాకరశాస్త్రి (ఫిబ్రవరి 7, 1888 – ఆగష్టు 29, 1950) తెలుగు కవి, భాష పరిశోధకులు, చరిత్రకారులు, రచయిత, విమర్శకులు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితులు. వేటూరి కేవలం మేధావి మాత్రమే కాదు. తెలుగు భాషా, చారిత్రక సాహిత్య నిర్మాణానికి అక్షరాలను పేర్చిన మేస్త్రీ. ఆయన రచయిత మాత్రమే కాదు. విమర్శనా వ్యాస రచనకు ఆద్యులు. పన్నెండో ఏటే పరభాషలో కవిత చేసిన అనన్య సామాన్యులు. పిన్నవయసు శతావధాని. తెలుగు లిపి ప్రాచీనతకు ఆధారంగా దొరుకుతున్న మొట్టమొదటి తెలుగు పదం "నాగబు" గురించి వెలుగు లోనికి తెచ్చిందే వేటూరే కావడం విశేషం. తరువాత కాలంలో అది 'నాగబుధు' అనే పేరులో చివరి అక్షరం మరుగైపోగా 'నాగబు' మాత్రమే శాస్త్రికి దొరికిందని పండితులు తేల్చారు. పదం ఏదయినా మన లిపి ప్రాచీనతను వెదకటానికి అది చాలా తోడ్పడిందనేది కాదన లేని వాస్తవం. ప్రభాకర శాస్త్రి 'నాగబు' తెలుగువారి చరిత్ర గురించిన కొత్త ఆలోచనలకు దోహదపడింది అనేది సత్యం. తొలిసారిగా అన్నమయ్య ఉనికిని లోకానికి చాటి చెప్పింది కూడా ఆయనే. అయిదు శతాబ్దాలకు పైగా మరుగున పడిన పదకవితా పితామహుని గురించి తెలియని పరిస్థితుల్లో అన్నమయ్య జీవితం గురించి, ఆయన రచనల గురించీ ఎన్నో విశేషాలను శాస్త్రి వెలుగులోకి తెచ్చారు. తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన "అన్నమాచార్య చరిత్ర"ను పరిష్కరించి ప్రచురించారు. అన్నమాచార్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన పదాలకు ప్రాచుర్యం కల్పించారు. సి.పి. బ్రౌను గురించి, తొలి తెలుగు కవయిత్రి తిమ్మక్క గురించి ఈ తరానికి తెలియజేసింది ఆయనే. కాలగర్భంలో కలిసి పోతున్న తెలుగు సంస్కృతి చరిత్ర పునరుద్ధరణకోసం కంకణ ధారియై, దీక్షాదక్షులై సిద్ధి పొందిన తాపసి ఆయన. ప్రభాకరశాస్త్రి, కృష్ణా జిల్లా, మోపిదేవి మండలములో కృష్ణా నది తీరమున ఉన్న పెదకళ్ళే పల్లిలో శ్రీవత్స గోత్రజులైన వేటూరి సుందరశాస్త్రి, శేషమ్మలకు 1888, ఫిబ్రవరి 7 న జన్మించారు. ప్రభాకర శాస్త్రి ప్రాథమిక విద్య స్వగ్రామము లోనే నడిచింది. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రములను నేర్చు కొన్నారు. ఉపనయనమైన తర్వాత ప్రభాకరశాస్త్రిని ఆయన తండ్రి శాస్త్రాలు అభ్యసించడానికి చల్లపల్లిలోని అద్దేపల్లి సోమనాథశాస్త్రి వద్ద చేర్పించారు. 16 యేళ్ళ వయసులో, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిసి కొందరు సహాధ్యాయులతో కలిసి అక్కడ చేరారు. తెలుగులో తనకు తెలిసినదంతా చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రితో ముఖతః వినోద గోష్ఠిలో విని నేర్చుకున్నదేనని ప్రభాకర శాస్త్రి చెప్పుకున్నారు. తన 19వ యేట మద్రాసు చేరి వెస్లీ మిషన్ హైస్కూలులో తెలుగు పండితునిగా రెండేళ్ళు పనిచేశారు. ఆ సమయములో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు వెళ్ళి అక్కడి గ్రంథాలను చదువుతుండే వారు. ప్రభాకరశాస్త్రి, తెలుగులో అనేక కావ్యాలు రచించడముతో పాటు అనువాదాలు, వ్యాఖ్యానాలు, విమర్శ గ్రంథాలు రచించారు. ఆయన ప్రాచ్యలిఖిత పుస్తకాలయములో అనేక తెలుగు గ్రంథాలను చారిత్రకాధారాలముతో సవివరముగా పరిష్కరించి ప్రకటించారు. శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజాపూరి ఆంధ్ర రాజుల చరిత్ర, ప్రాచీనాంధ్ర శాసనములు, శతకాలు, ఇక్ష్వాకులు, రెడ్డిరాజులు, చాటుపద్య మణి మంజరి, అన్నమాచార్య కీర్తనలు, తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క, తొలి తెలుగు శాసనము... తదితరాలను ఈరోజు అందుబాటులో ఉంచడానికి వేటూరి కృషియే కారణం. తమిళ, కన్నడ భాషలతో బాగా పరిచయము ఏర్పరచుకొని, ఆండాళ్ రాసిన కొన్ని తమిళ పాశురాలను తెలుగులోకి అనువదించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో విస్తృత పరిశోధనలు చేశారు. అప్పటి వరకూ వెలుగులోకి రాని ఎన్నో తాళపత్రాలు, శాసనాలు, పుస్తకాలను పరిష్కరించారు. తాను ప్రచురించిన ప్రతి గ్రంథానికీ విపుల పీఠికా నిర్మాణం గావించారు. ముప్పయి సంవత్సరాలు మద్రాసులోనే ఉండి సాహితీ సరస్వతికి ఎనలేని సేవ చేశారు. శాస్త్రి సంస్కృత రూపకాలను తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు సాహితీ లోకంలో లబ్ధప్రతిష్ఠులు, పండితులు, పరిశోధకులు, ప్రాచీన వాఙ్మయ ప్రియులు అయిన వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు దేశంలో బాల బాలికలు పాడే పాటలు, పలికే మాటలు, చెప్పుకునే కథలు కొన్నింటిని సేకరించి 'భారతి' (1930) లో 'బాలభాష' అనే పేరుతో ప్రచురించారు. ప్రభాకరశాస్త్రిని కవిగా, చరిత్ర పరిశోధకులుగా, శాసన పరిశోధకులుగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా, సంస్కృత రూపకానువాదకర్తగా, తాళపత్ర గ్రంథ వివరణ రచయితగా, అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకులుగా, అన్నమాచార్య ఉత్సవాల ప్రథమ ప్రారంభకులుగా తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచు కుంటారు. ఆయన తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు, తెలుగువారికి ప్రాతఃస్మరణీయులు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# సమాజంలోని అసమానతలు... డికెన్స్ రచనల ప్రధాన అంశాలు - ఫిబ్రవరి 7...చార్లెస్ డికెన్స్ జయంతి



చార్లెస్ డికెన్స్ (1812–1870) ఒక ప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత, సామాజిక విమర్శకుడు. విక్టోరియా కాలం నాటి బ్రిటిష్ సమాజంలోని పేదరికం, అన్యాయం, దుర్నీతి, సామాజిక అసమానతలను తన రచనల ద్వారా ప్రస్ఫుటంగా వివరించిన మహానుభావుడు. డికెన్స్ రచనలు పాఠకులను ఆలోచింపజేసి, సమాజంలో మార్పు తీసుకురావాలని ఆకాంక్షించేవి. చార్లెస్ డికెన్స్ 1812 ఫిబ్రవరి 7న ఇంగ్లాండ్‌లోని పోర్ట్స్‌మౌత్‌లో జన్మించారు. ఆయన తండ్రి జాన్ డికెన్స్ నేవీ క్లర్క్‌గా పనిచేశారు. కుటుంబం మధ్యతరగతి అయినప్పటికీ, ఆర్థిక సమస్యలు ఎప్పటికప్పుడు వెంటాడాయి. అప్పుల బారి వల్ల డికెన్స్ తండ్రి జైలుకు వెళ్లగా, చిన్నతనంలోనే డికెన్స్ కఠిన జీవితం గడపాల్సి వచ్చింది. 12 ఏళ్ల వయస్సులో డికెన్స్ లండన్‌లోని ఒక బూట్ల ఫ్యాక్టరీలో పనిచేయాల్సి వచ్చింది. చిన్న వయసులోనే వీక్షించిన దుర్భర జీవన పరిస్థితులు, సమాజంలోని అసమానతలు అతని రచనల ప్రధాన అంశాలుగా మారాయి. డికెన్స్ తన రచనా ప్రస్థానాన్ని పాత్రికేయుడిగా ప్రారంభించాడు. అతి త్వరలోనే అతని ప్రతిభ ప్రజల మనసులను గెలుచుకుంది. 1836లో వచ్చిన "ది పిక్విక్ పేపర్స్" అతనికి మొదటి పెద్ద విజయాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత, డికెన్స్ అనేక ప్రసిద్ధ నవలలు రాశాడు, అవి సాహిత్య ప్రపంచాన్ని అలరించాయి.

**ముఖ్య రచనలు...** "ఒలివర్ ట్విస్ట్" (1838) అనాథల దుర్భర జీవనాన్ని సున్నితంగా ప్రతిబింబించిన ఈ నవల పేదరికం మరియు సమాజంలోని దుర్నీతి గురించి ఓ స్పష్టమైన చిత్రాన్ని అందించింది. "ఎ క్రిస్మస్ క్యారోల్" (1843) సంస్కార మార్పును గురించి రాసిన కథ. స్క్రూజ్ అనే కఠిన హృదయుడి మార్పు ద్వారా డికెన్స్ నమ్మకం, కరుణ, మానవతా విలువలను చాటి చెప్పాడు. "డేవిడ్ కాపర్‌ఫీల్డ్" (1850) డికెన్స్ స్వీయ జీవితానుభవాలకు అద్దం పట్టిన నవల. ఇది చదువరుల హృదయాలను గెలుచుకుంది. "ఎ టేల్ ఆఫ్ టూ సిటీస్" (1859) ఫ్రెంచ్ విప్లవం నేపథ్యంగా రాసిన ఈ నవల ప్రేమ, త్యాగం, మరియు విముక్తి గురించి ఆవిష్కరించింది. "బ్లీక్ హౌస్" (1853) ఇంగ్లాండ్ చట్టవ్యవస్థలోని లోపాలను వ్యంగ్యంగా, తీవ్రంగా ఎత్తి చూపింది. డికెన్స్ రచనలు హాస్యం, వ్యంగ్యం, కరుణ, సామాజిక స్పృహలను కలగలిపి ఉంటాయి. అతని పాత్రలు ఎంతో సహజంగా ఉంటాయి. ప్రతీ పాత్రకు ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంటుంది. ఆయన భాష సులభంగా అర్థమయ్యేలా, కానీ భావగంభీరంగా ఉంటుంది. డికెన్స్ తన రచనల ద్వారా పేదల సమస్యలను, అధికారుల అన్యాయాలను చర్చించాడు. రచయితగా మాత్రమే కాకుండా, డికెన్స్ సామాజిక ఉద్యమాలలో కూడా చురుకుగా పాల్గొన్నారు. అనాథ పిల్లల హక్కుల కోసం కృషి చేశారు. పేదల కోసం సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠకులలో మానవతా భావాలను పెంచే ప్రయత్నం చేశారు. డికెన్స్ రచనలు విభిన్న సామాజిక సమస్యలను ప్రస్తావించాయి: పేదలపై పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోగిస్తున్న ఒత్తిడిని అతని రచనలు ప్రతిబింబించాయి. చట్టాలు పేదల కోసం ఉండవన్న స్పష్టమైన సందేశాన్ని ఆయన రచనల ద్వారా చాటి చెప్పాడు. ప్రేమ, కరుణ, న్యాయం, సత్యం వంటి విలువలపై ఆయన గాఢమైన నమ్మకం చూపించారు. డికెన్స్ 1870 జూన్ 9న గడ్‌హిల్ ప్లేస్‌లో మరణించారు. ఆయన మరణం తో ప్రపంచ సాహిత్యం ఓ మహా రచయితను కోల్పోయింది. డికెన్స్ రచనలు కాలాతీతం. ఇవి అనేక భాషల్లో అనువాదమయ్యి, ప్రపంచ వ్యాప్తంగా చదవబడు తున్నాయి. నాటకాలుగా, సినిమాలుగా రూపాంతరం పొందాయి. సమాజంలో మార్పు తేవడానికి ఆయన రచనలు నేటికీ స్ఫూర్తినిచ్చే సాధనంగా ఉన్నాయి. చార్లెస్ డికెన్స్ ఒక రచయితగా మాత్రమే కాకుండా, ఓ మానవతావాది, సామాజిక కార్యకర్తగానూ చరిత్రలో నిలిచిపోయారు. ఆయన రచనలు పాఠకుల హృదయాలను నానాటికి అలరిస్తూనే ఉంటాయి. "డికెన్స్" అనే పేరు, ఆంగ్ల సాహిత్యంలో ఎప్పటికీ వెలుగొందుతూనే ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# భారత జలాంతర్గాములు - ఫిబ్రవరి 7...ఐ.ఎన్.ఎస్. షల్కి నౌకా దళంలో చేరిన రోజు

భారతీయ నౌకా దళం భారత సాయుధ బలగాలలో ఒక శాఖ. దేశ రాష్ట్రపతి దీనికి అధిపతిగా వ్యవహరిస్తారు. 5000 మంది నౌకా వైమానిక దళ సభ్యులు, 2000 మంది నౌకా దళ కమెండోలతోసహా యుద్ధ సన్నద్ధంగా ఉండే 55,000 మంది సభ్యులు గలిగి ప్రపంచంలో 5వ పెద్ద నౌకాదళంగా వుంది. భారత నౌకా దళం 155 నౌకల్ని కలిగి ఉంది. ఆసియాలో జెట్ యుద్ధ విమానాల్ని కలిగి ఉన్న విమాన వాహక నౌకని, నడిపే ఏకైక నావికా దళం. ఐ.ఎన్.ఎస్. షల్కి...1992 ఫిబ్రవరి 7న నౌకా దళంలో చేరిన రోజు, ఈ సందర్భంలో..భారతీయ నౌకా దళంలోని మన జలాంతర్గాములు గురించి... భారత రక్షణ వ్యవస్థలో భాగమయిన భారత నావికా దళం (ఇండియన్ నేవీ) కేవలం దేశరక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. ఇండియన్ నేవీలో 16 సబ్‌మెరైన్‌లు (జలాంతర్గాములు) ఉన్నాయి. ఇందులో ఎక్కువ రష్యా, జర్మనీలనుండి కొనుగోలు చేసినవి. ఇందులో ప్రధాన మయినవి సింధుఘోష్ తరగతికి చెందినవి. ఈ తరగతిలో మొత్తం 10 సబ్‌మెరైన్‌లు ఉన్నాయి. వీటి బరువు 3,000 టన్నులు. ప్రతి సబ్‌మెరైన్‌లో 220 కిమీ దూరంలోపు ఉన్న నౌకల పైన ప్రయోగించ గలిగే మిస్సైళ్ళు ఉన్నాయి. ఈ సబ్‌మెరైన్‌లు సముద్రంలో 300 మీటర్ల లోతువరకు వెళ్లగలగి, 18 నాట్ల వేగంతో 45 రోజుల పాటు సముద్ర ఉపరితలాన్ని చేరుకోకుండా ప్రయాణించ గలవు. 1985 నుండి అణు సబ్‌మెరైన్‌లను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవీ కృషి చేస్తున్నది. 2010 నాటికి 6,000 టన్నులు బరువు కలిగి, పూర్తి అణు సామర్థ్యం కలిగిన సబ్‌మెరైన్‌ను, 2010–2025 నాటికి ఇలాంటివి మరో నాలుగు నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరిగింది. భారత నౌకాదళం లోని అన్ని యుద్ధ నౌకలకు ముందు 'ఇండియన్ నేవల్ షిప్' (ఐ.ఎన్.ఎస్), జలాంతర్గాములకు ముందు 'ఇండియన్ నేవల్ సబ్ మెరైన్ (ఐ.ఎన్.ఎస్.) ' అని చేరుస్తారు. నీటిలో మునిగి ప్రయాణం చెయ్యగల వాహనం. వివిధ దేశాల నావికా రక్షణ దళాల్లో జలాంతర్గామి ఒక ముఖ్య భాగం. జలాంతర్గామిని మొదటగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విస్తృతంగా ఉపయోగించారు. జలాంతర్గాములు అనేక రకాలైన మిషన్లను చేపట్ట గలవు. యాంటీ–సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ– సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఇంటెలిజెన్స్ సేకరణ, మైన్ లేయింగ్, తీర ప్రాంతాల్లో నిఘా తదితర మిషన్లు చేపట్టవచ్చు. భారత నౌకాదళంలో చేరిన కొన్ని జలాంతర్గాములు – వాటి తేదీల వివరాలు



ఇలా ఉన్నాయి... ఐ.ఎన్.ఎస్.సింధుధ్వజ్... 12 జన వరి,1987, ఐ.ఎన్.ఎస్. షల్కి...07 ఫిబ్రవరి 1992, ఐ.ఎన్.ఎస్. సింధుఘోష్...30 ఏప్రిల్ 1986, ఐ.ఎన్.ఎస్. షంకుల్ ....28 మే 1994, ఐ.ఎన్.ఎస్. సింధువీర్...11 జూన్ 1988, ఐ.ఎన్.ఎస్. సింధుశస్త్ర...19 జూలై 2000, ఐ.ఎన్.ఎస్. వగ్లి ....10 ఆగష్టు 1974, ఐ.ఎన్.ఎస్. వేల ....31 ఆగష్టు 1973, ఐ.ఎన్.ఎస్. శాతవాహన... 21 డిసెంబర్1974, ఐ.ఎన్.ఎస్. షిషుమార్...22 సెప్టెంబరు1986, ఐ.ఎన్.ఎస్. సింధురాజ్...20 అక్టోబరు 1987, ఐ.ఎన్.ఎస్. సింధురత్న...19 నవంబరు 1988, ఐ.ఎన్.ఎస్. షంకుష్ ...20 నవంబరు1986, ఐ.ఎన్.ఎస్. సింధుకీర్తి ...09 డిసెంబరు1989, ఐ.ఎన్.ఎస్. సింధు విజయ్...17డిసెంబర్1990, ఐ.ఎన్.ఎస్.సింధు కేసరి... 19డిసెంబర్1988, ఐ.ఎన్.ఎస్.సింధు రక్షక్ ...24 డిసెంబర్1997, ఐ.ఎన్.ఎస్ విరాట్...27 సంవత్సరాల సేవ తరువాత 2016 లో ఈ నౌకను నౌకాదళం నుండి విరమింప జేసారు. 2013 లో ఐ.ఎన్.ఎస్ విక్రమాదిత్య కమిషను కాకముందు, విరాట్‌యే భారత నౌకాదళపు ఫ్లాగ్‌షిప్ నౌక. పని విరమించే ముందు వరకూ ఇది ప్రపంచంలోనే అత్యంత పాత విమాన వాహక నౌక. 1959 లో బ్రిటిషు నౌకాదళంలో హెచ్ ఎం ఎస్ హెర్మెస్‌గా చేరిన ఈ నౌకను 1987లో భారత్ కొని, 1987 మే 12 న ఐ ఎన్ ఎస్ విరాట్‌గా పేరు పెట్టింది. ఐ.ఎన్.ఎస్వి విక్రమాదిత్య...విక్రమాదిత్య భారత్ రష్యా నుండి కొనుగోలు చేసిన విమాన వాహక నౌక. కీయెవ్ తరగతికి చెందిన అడ్మిరల్ గోర్ష్‌కోవ్ విమాన వాహక నౌకను విక్రమాదిత్యగా పునర్నిర్మించారు. ఇది 2013 లో భారతీయ నౌకాదళం లోకి ప్రవేశించింది. ఐ.ఎన్.ఎస్. విక్రాంత్ (2013)...భారత్‌లో నిర్మించిన మొదటి విమాన వాహక నౌక. 2013 లో దీన్ని నిర్మించారు. ఇది తేలిక పాటి విమాన వాహక నౌక. ఐ.ఎన్.ఎస్ చక్ర...అణు జలాంతర్గామి...ఐఎన్ఎస్ అరిహంత్ ...న్యూక్లియర్ సబ్‌మెరైన్. న్యూక్లియర్ మిస్సైల్స్‌ను ప్రయోగించే సబ్‌మెరైన్ల కోసం ఇక్కడ సముద్ర గర్భంలో అధునాతన బెర్తులు రూపుదిద్దు కుంటున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా స్వదేశీ పరిజ్ఞానంతో తొలి న్యూక్లియర్ సబ్‌మెరైన్ అరిహంత్ నిర్మాణం జరిగింది. సముద్రంపైన, భూమిపైన యుద్ధం చేయగల ఐఎన్ఎస్ జలాశ్వతో పాటు అణు ఇంధనంతో పనిచేసే సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ చక్ర ఇక్కడి నుంచే సేవలు అందిస్తోంది. చైనా వద్ద 56 సబ్‌మెరైన్లు ఉండగా మన దగ్గర 14 మాత్రమే వున్నాయి. చైనా ఇప్పటికే ఐదు న్యూక్లియర్ సబ్‌మెరైన్లను సమకూర్చు కోగా మనం తొలి న్యూక్లియర్ జలాంతర్గామి (అరిహంత్) నిర్మాణంలో ఉన్నాయి. ఫ్రెంచ్ నావికాదళ రక్షణ, ఇంధన సంస్థ డీసీఎన్ఎస్ రూపొందించిన జలంతార్గములను భారత నేవీ ఫోర్స్ ప్రాజెక్ట్ 75లో భాగంగా ముంబైలోని మజగాన్ డాక్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మిస్తోంది. ఆరు స్కార్పీన్ క్లాస్ జలాంతర్గాము ల్లోని మొదటిదైన ఐఎన్ఎస్ కల్వరిని 2017 డిసెంబర్‌లో భారత నావికాదళం లోకి ప్రవేశ పెట్టారు. ఇది డీజిల్ ఎలక్ట్రిక్ అటాక్ జలాంతర్గామి. 2017లో ప్రవేశపెట్టిన ఐఎన్ఎస్ ఖండేరి రెండవది కాగా.. మూడోది ఐఎన్ఎస్ కరంజ్ 2018 నేవీ దళంలో చేరింది. ఇక, నాల్గోది ఐఎన్ఎస్ వెలా 2019 నుంచి సేవలందిస్తుంది. శత్రు దేశాల క్షిపణులు, జలాంతర్గాముల కళ్లుగప్పే స్టెల్త్ సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రాజెక్ట్ 75లో భాగంగా రూపొందించిన ఐదో స్కార్పీన్ తరగతి జలాంతర్గామి ఇటీవలే మజగావ్ డాక్ వద్ద అరేబియా సముద్ర జలాల్లో జల ప్రవేశం చేసింది. ప్రస్తుతం సబ్‌మెరైన్ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు చర్యలు జరుగు తున్నాయి. ఇందులో భాగంగా రాబోవు 30 సంవత్సరాలలో 24 సబ్‌మెరైన్‌లు నేవీ అమ్ముల పొదిలో చేరబోతున్నాయి. ప్రస్తుత మార్పులను బట్టి హిందూ మహాసముద్ర ప్రాంతంలోని అన్ని దేశలలో భారత నావికా దళం అత్యంత బలమయినదిగా తయారవుతున్నదని చెప్పవచ్చు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# మనసులను దగ్గర చేసే గులాబీ దినోత్సవం - ఫిబ్రవరి 7... గులాబీ దినోత్సవం



ఫిబ్రవరి 7న జరుపుకునే గులాబీ దినోత్సవం ఆధునిక ప్రపంచంలో ప్రేమ, స్నేహం, గౌరవం, కృతజ్ఞత వంటి మానవీయ భావాల వ్యక్తీకరణకు ప్రతీకగా నిలిచిన ఒక ప్రత్యేక దినంగా మారింది. సాధారణంగా "రోజ్ డే"గా పిలువబడే ఈ రోజు వాలెంటైన్స్ వారానికి ఆరంభ సూచికగా పరిగణించ బడినా, దాని అంతరార్థం కేవలం ప్రేమికుల పరిమిత ప్రపంచంలోనే కాదు; సమాజంలోని అన్ని సంబంధాలకు సున్నితమైన భావాలను తెలియజేసే ఒక సాంస్కృతిక వేదికగా విస్తరించింది. మాటల్లో చెప్పలేని అనుభూతులను ఒక చిన్న పువ్వు ద్వారా వ్యక్తపరచడం అనేది మానవ నాగరికతలో వేల ఏళ్లుగా కొనసాగుతున్న సాంప్రదాయం. ఆ పరంపరకి ఆధునిక రూపమే గులాబీ దినోత్సవం. గులాబీ పువ్వు చరిత్ర మానవ నాగరికత చరిత్రతో సమాంతరంగా సాగింది. ప్రాచీన గ్రీకు, రోమన్ నాగరికతల్లో గులాబీ ప్రేమ, అందం, జీవశక్తి, పవిత్రతకు ప్రతీకగా భావించబడింది. గ్రీకు పురాణాల్లో ప్రేమ దేవత అఫ్రొడైటీతో గులాబీకి ఉన్న అనుబంధం దానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, భావోద్వేగ విలువను తెచ్చిపెట్టింది. రోమన్లు గులాబీని రహస్యాల సంకేతంగా కూడా భావించేవారు; అందుకే "సబ్ రోసా" అనే పదప్రయోగం రహస్య సంభాషణకు సూచికగా నిలిచింది. భారతీయ సంస్కృతిలో గులాబీ ఆతిథ్యం, సౌందర్యం, సానుభూతికి చిహ్నంగా మారింది. ఆలయాల అలంకరణ లోనూ, శుభకార్యాల్లోనూ, సాహిత్యంలోనూ గులాబీ స్థానం ప్రత్యేకం. సంస్కృత, తెలుగు సాహిత్యాల్లో గులాబీ సుగంధం ప్రేమానురాగాలకు రూపకంగా తరచూ వినిపిస్తుంది. విక్టోరియన్ యుగంలో పాశ్చాత్య సమాజంలో పువ్వుల ద్వారా భావాలను తెలియజేసే ఒక ప్రత్యేక సంస్కృతి ఏర్పడింది. దీనిని "ఫ్లోరియోగ్రఫీ" అని పిలిచేవారు. ప్రతి పువ్వుకీ, ప్రతి రంగుకీ ప్రత్యేకమైన అర్థాన్ని కేటాయించి భావ వ్యక్తీకరణకు వినియోగించేవారు. ఈ నేపథ్యం ఆధునిక రోజ్ డే సంస్కృతికి పునాది వేసింది. కాలక్రమేణా ప్రపంచీకరణ ప్రభావంతో ఈ సంస్కృతి ప్రపంచ దేశాలకు వ్యాపించింది. ముఖ్యంగా పట్టణీకరణ, మీడియా ప్రభావం, యువత సంస్కృతిలో వచ్చిన మార్పులతో ఫిబ్రవరి 7 గులాబీ దినోత్సవం ఒక సామాజిక వేడుకగా రూపాంతరం చెందింది. గులాబీ పువ్వుల రంగులకు ఉన్న సంకేతార్థం ఈ దినోత్సవానికి ప్రత్యేకమైన భావ పరిమళాన్ని అందిస్తుంది. ఎరుపు గులాబీ గాఢమైన ప్రేమకు ప్రతీకగా నిలిస్తే, పసుపు గులాబీ స్నేహం, ఆనందం, ఆప్యాయతను సూచిస్తుంది. తెలుపు గులాబీ పవిత్రత, నిష్కపటతకు సంకేతం. పింక్ గులాబీ గౌరవం, కృతజ్ఞతను తెలియజేస్తుంది. నారింజ రంగు గులాబీ ఉత్సాహం, ఆశయాలను సూచిస్తుంది. ఇలా ప్రతి రంగు ఒక భావోద్వేగ భాషగా పనిచేస్తూ మానవ సంబంధాల వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక చిన్న పువ్వు ద్వారా సంక్లిష్టమైన భావాలను వ్యక్తపరచగల సామర్థ్యం ఈ సంస్కృతికి మూల బలం. సామాజిక కోణంలో గులాబీ దినోత్సవం యువతలో భావ వ్యక్తీకరణకు ఒక ముఖ్య వేదికగా మారింది. వేగవంతమైన జీవనశైలిలో మానవ సంబంధాలు యాంత్రికతకు లోనవుతున్న ఈ కాలంలో, ఒక చిన్న గుర్తింపుగా గులాబీ ఇవ్వడం ద్వారా మనసుల మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. కళాశాలలు, కార్యాలయాలు, సామాజిక వేదికల్లో ఈ రోజు పరస్పర గౌరవం, స్నేహాన్ని పంచుకునే సందర్భంగా మారింది. కుటుంబ సభ్యులకు, గురువులకు, సహచరులకు గులాబీ అందించడం ద్వారా కృతజ్ఞతను తెలియజేసే సంస్కృతి కూడా పెరుగుతోంది. ఆర్థిక దృక్పథంలో చూస్తే గులాబీ దినోత్సవం పుష్ప పరిశ్రమకు ఒక కీలక కాలం. ప్రపంచవ్యాప్తంగా వాలెంటైన్స్ వారంలో పుష్పాల విక్రయాలు గణనీయంగా పెరుగుతాయి. భారతదేశంలో కూడా పుష్పోత్పత్తి, సరఫరా, రిటైల్ రంగాలకు ఇది అదనపు ఆదాయాన్ని తెస్తుంది. ఉద్యానవన రంగం, ఈ–కామర్స్ వేదికలు, గిఫ్ట్ పరిశ్రమ ఈ కాలంలో చురుకుదనాన్ని ప్రదర్శిస్తాయి. ఒక సాంస్కృతిక వేడుక ఆర్థిక కార్యకలాపాలను ఎలా ప్రభావితం చేస్తుందో దీనివల్ల స్పష్టమవుతుంది. అయితే ఈ దినోత్సవంపై విమర్శాత్మక దృక్కోణాలు కూడా ఉన్నాయి. కొందరు దీనిని పాశ్చాత్య వాణిజ్య సంస్కృతికి చెందినదిగా భావిస్తూ భావోద్వేగాల వాణిజ్యీకరణగా అభివర్ణిస్తారు. ప్రేమను ఒక నిర్దిష్ట రోజుకు పరిమితం చేయడం అవసరమా అనే ప్రశ్నలు కూడా లేవనెత్త బడుతున్నాయి. కానీ మరో కోణంలో చూస్తే, ఈ రోజు భావాలను గుర్తుచేసే ఒక ప్రతీక మాత్రమే; ప్రేమ, స్నేహం వంటి విలువలు నిత్యజీవితంలో కొనసాగాల్సినవే. గులాబీ దినోత్సవం ఆ విలువలను సంబరంగా గుర్తుచేసే ఒక సందర్భం. సాంస్కృతికంగా గులాబీ దినోత్సవం ఆధునిక భారత సమాజంలో ఒక ఆసక్తికర పరిణామాన్ని సూచిస్తుంది. సంప్రదాయ విలువలు, ఆధునిక భావ వ్యక్తీకరణ మధ్య సమతుల్యతను ఇది ప్రతిబింబిస్తుంది. భారతీయ సంస్కృతిలో పుష్పాలకు ఉన్న ఆధ్యాత్మిక, సాంప్రదాయ ప్రాధాన్యం ఆధునిక ప్రేమ సంస్కృతితో కలిసిపోతూ ఒక కొత్త సామాజిక రూపాన్ని సృష్టించింది. గులాబీ పువ్వు దేవాలయాల్లో పూజా పుష్పంగా ఉంటూనే, వ్యక్తిగత భావాల ప్రతీకగా కూడా నిలుస్తోంది. సాహిత్యం, కళల్లో గులాబీ ప్రతీకాత్మక ప్రాధాన్యం విశేషమైనది. కవులు గులాబీని ప్రేమకు, సౌందర్యానికి, జీవితపు సున్నితత్వానికి రూపకంగా వర్ణించారు. గులాబీ సుగంధం మనసును పరవశింప జేసినట్లే, మంచి భావాలు మన సంబంధాలను పరిమళింప జేస్తాయని కవిత్వం సూచిస్తుంది. ఈ సాహిత్య పరంపర ఆధునిక గులాబీ దినోత్సవానికి భావాత్మక బలం అందిస్తుంది. మనోవిజ్ఞాన దృక్కోణంలో కూడా ఈ రోజు ప్రాముఖ్యత కలిగి ఉంది. భావాలను వ్యక్తపరచడం వ్యక్తిగత మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. కృతజ్ఞత, ప్రేమ, గౌరవం వంటి సానుకూల భావాలను వ్యక్తపరచడం సంబంధాలను బలపరచడమే కాకుండా వ్యక్తిలో సంతృప్తిని పెంచుతుంది. చిన్న గుర్తింపులు పెద్ద భావోద్వేగ అనుబంధాలను నిర్మిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. మొత్తం మీద ఫిబ్రవరి 7 గులాబీ దినోత్సవం ఒక సాధారణ పండుగ దినం కంటే ఎక్కువ. ఇది భావోద్వేగాల సాంస్కృతిక ఉత్సవం, సంబంధాల పునరుద్ధరణకు ఒక గుర్తింపు, ప్రేమను వ్యక్తపరచే ఒక ప్రతీక. ఒక చిన్న గులాబీ పువ్వు మనసులోని మాటను ప్రపంచానికి తెలియజేసే శక్తిని కలిగి ఉందని ఈ రోజు గుర్తుచేస్తుంది. యాంత్రిక జీవనశైలిలో మనుషుల మధ్య అనుబంధాలను సజీవంగా ఉంచేందుకు ఇటువంటి సందర్భాలు అవసరమనే సందేశాన్ని గులాబీ దినోత్సవం అందిస్తుంది. ప్రేమను, స్నేహాన్ని, కృతజ్ఞతను పంచుకునే ప్రతి క్షణం విలువైనదని గుర్తుచేస్తూ, మనసులను దగ్గర చేసే సుగంధ సంస్కృతిగా ఇది నిలుస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# హామీల హవా.. వారెవ్వా..

సంగారెడ్డి: పుర ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ పూర్తికావడం, గుర్తులు కేటాయించడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. పురవీధుల్లో ర్యాలీలు, ఇతర ప్రసార సాధనాల ద్వారా తాము ఓటర్లకు కావాల్సిన అన్ని పనులు చేస్తామని ఊదరగొడుతున్నారు. కొందరైతే ప్రత్యేకంగా మ్యానిఫెస్టోలు విడుదల చేసి, సొంత నిధులతో పనులు చేస్తామని ప్రకటించడం గమనార్హం.

**గెలుపే లక్ష్యంగా..**

వార్డు స్థానాల బరిలో నిలిచిన అభ్యర్థులు ఆడపిల్ల పుడితే రూ.25వేలు, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో ఎవరైనా మరణిస్తే రూ.15వేలు అందిస్తామని ప్రకటిస్తున్నారు. ఇంకొందరైతే గెలిచిన వెంటనే రూ.25లక్షల సొంతనిధులతో సిమెంటు రోట్లు నిర్మిస్తామని పేర్కొంటున్నారు. వీరి హామీలను చూసి ప్రజలు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ వార్డు అభ్యర్థి పురపాలిక వార్షిక బడ్జెట్‌ను మించిన నిధులతో తాను పోటీచేస్తున్న వార్డులో పనులు చేస్తానని మ్యానిఫెస్టో విడుదల చేయడం గమనార్హం. కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులది సైతం ఇదే తీరుగా ప్రజలకు నమ్మశక్యం కాని హామీలు ఇస్తున్నారు.

**ఓటరు కేంద్రంగా..**

పట్టణీకరణ నేపథ్యంలో వార్డుల్లో గ్రామీణ ప్రాంతాలతోపాటు ఇతర పట్టణాలకు చెందిన ప్రజలు నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో



అభ్యర్థులు ఓటరు కేంద్రంగా ప్రచారం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితాలను చేతపట్టుకుని ఇంటింటికి తిరిగి ఓటర్ల చరవాణి నంబర్లు సేకరించే పని మొదలుపెట్టారు. యాభై నుంచి వంద మంది కొకరిని ఇన్‌ఛార్జిగా పెట్టి ప్రచారం నిర్వహించే పనులు మొదలుపెట్టారు. ప్రచారానికి గడువు తక్కువగా ఉండడంతో సాంకేతికతను విరివిగా వినియోగించుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

**బుజ్జగింపులు.. బెదిరింపులు**

ఓటర్లను ఎలాగైనా దారికి తెచ్చుకునేందుకు ప్రధాన పార్టీల నేతలు బుజ్జగింపులతో పాటు బెదిరింపులకు దిగుతున్నారు. ఓ పార్టీ నేత వార్డులోని ముఖ్యనేతలకు ఫోన్‌చేసి మీ ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంది. వ్యతిరేకంగా చేస్తే ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. మీ ఇష్టం అంటూ బెదిరించి ప్రచారం సాగిస్తున్నారు. మరో నేత పట్టణాన్ని సమగ్రాభివృద్ధి చేసుకుందాం ఆశీర్వదించాలంటూ అభ్యర్థిస్తున్నారు.

# మహిళ మేలుకో...

ఖమ్మం : క్యాన్సర్ బారిన పడిన ప్రతి వ్యక్తి అనుభవం, సామాజిక, ఆర్థిక, భావోద్వేగ పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి. అందుకే చికిత్స కూడా వ్యక్తి అవసరాలకు అనుగుణంగా ఉండాలన్నది 'యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్(యూఐసీసీ)' సూచన. నేడు ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం. 'యునైటెడ్ బై యూనిక్' నినాదంతో దీర్ఘకాలిక వ్యాధిని నియంత్రించాలన్నది ఈ ఏడాది యూఎన్‌వో నినాదం. వ్యాధిపై ఐకమత్యంతో పోరాటం, సామాజిక హోదాతో సంబంధం లేకుండా వివక్షలేని వైద్యం, రోగుల నిజజీవిత అనుభవాలను పంచుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నేడు క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఖమ్మం జిల్లాలో 31 పీహెచ్‌సీలు, 7 సీహెచ్‌సీలు, బోధనాసుపత్రి పరిధిలో వైద్యారోగ్య శాఖ తరపున క్యాన్సర్ రోగులను గుర్తించే ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తున్నారు.



జిల్లాలో క్యాన్సర్ బాధితుల్లో 75 శాతం మహిళలే ఉండటం ఆందోళనకరమైన విషయం. చింతకాని పీహెచ్‌సీ పరిధిలో 136, కూసుమంచి-127, బోనకల్లు-100 చొప్పున కేసులు నమోదయ్యాయి. మిగిలిన కేంద్రాల్లో పదుల సంఖ్యలో ఉన్నాయి.

ఖమ్మం వెంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, మధిర పీపీ యూనిట్‌లో కేసులు అత్యల్పంగా ఉన్నాయి.

**మహిళల్లో ఇలా..**

జిల్లాలో క్యాన్సర్ కేసులను చూసినట్టయితే మహిళలు అప్రమత్తం కావల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో తమ కోసం కేటాయించిన వసతుల్ని సద్వినియోగం చేసుకుని ప్రాథమిక దశలోనే లక్షణాలను గుర్తిస్తే ఇబ్బందులుండవు. జిల్లాలో వైద్యారోగ్య శాఖ పర్యవేక్షణలో ఆరోగ్య మహిళ పథకాన్ని అమలు చేస్తున్నారు. భవిష్యత్తులో క్యాన్సర్ రాకుండా అవసరమైన ముందస్తు పరీక్షలు చేస్తున్నారు. సర్వజనాసుపత్రి కేంద్రంగా 2023-26 జనవరి వరకు జరిగిన పరీక్షల తీరును విశ్లేషిస్తే కొన్ని రకాల క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా వెలుగుచూస్తున్నాయి.

**జిల్లాలో ఇలా..** యాక్టివ్ కేసులు: 1883

పురుషులు: 464

మహిళలు: 1418

ఏవి ఎన్ని? నోటి: 58

రొమ్ము క్యాన్సర్: 528

సర్వైకల్: 193

ఇతర రకాలు: 1104

'మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా నమోదవుతున్నాయి. ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ చేయించుకోవాలి. ఆరోగ్యంగా ఉన్న మహిళలో అసాధారణ లక్షణాలుంటే మెరుగైన వైద్యం కోసం ఉన్నత కేంద్రాలకు తరలిస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధికి భయపడాల్సిన అవసరం లేదు. అవగాహన, అప్రమత్తతే ముఖ్యం. ప్రభుత్వ ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలి.' డాక్టర్ ప్రేమలత, ఆరోగ్య మహిళా విభాగం నోడల్ ఆఫీసర్

# చెట్లను కూల్చేస్తూ.. మట్టిని తరలిస్తూ..



జగిత్యాల : జగిత్యాల సమీపంలోని నర్సింగాపూర్ గుట్టకు సంబంధించి 2013లో తీసిన గూగుల్ పటం. అప్పట్లో పచ్చటి చెట్లతో ఆహ్లాదకర వాతావరణం కనిపించేది. పశువులు, జీవాలకు మేత అందుబాటులో ఉండటంతో పాటు అన్ని వర్గాలకు ఆదరువుగా ఉండేది. ఇది ప్రస్తుతం నర్సింగాపూర్ గుట్ట పరిస్థితి. చెట్లు తొలగిస్తూ మట్టి తవ్వుతూ తరలిస్తుండటంతో ఇలా బోసిపోయి కనిపిస్తోంది. నర్సింగాపూర్‌లోని 437, 251 సర్వే నంబర్లలో ఉన్న గుట్ట మొత్తం ఖాళీ అవుతోంది జగిత్యాల పట్టణంలో భవన నిర్మాణాలు పెరుగుతుండటంతో మొరం, మట్టికి డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు నర్సింగాపూర్ గుట్టపై కన్నేశారు. మైనింగ్ శాఖ నుంచి మూడున్నర హెక్టార్లలో మట్టి తరలింపునకు లీజు పొందిన గుత్తేదారు గుట్టను పూర్తిగా ఖాళీ చేశారు. వాస్తవానికి లీజు పొందిన ప్రాంతంలో మట్టిని తీయాల్సి ఉండగా దాదాపు 60 ఎకరాలకు పైగా గుట్టను ఖాళీ చేశారనే ఆరోపణలున్నాయి.

**అక్రమార్కులకు ఆదాయం**

పట్టణానికి సమీపంలోని ఎస్సారెస్పీ వరద కాలువ పక్కన మొరం ఉంది. లీజు పద్ధతిలో దాన్ని విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. గుట్టలకు నష్టం వాటిల్లకుండా చూడవచ్చు. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో అక్రమార్కులు అధిక ధరకు గుట్ట మొరం విక్రయిస్తూ రూ.కోట్లలో ఆర్జించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పరిరక్షణకు కదిలిన గ్రామస్థులు**

నర్సింగాపూర్ గుట్ట నుంచి మట్టి తరలించడంపై ఇటీవల గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి సైతం సీఎంకు లేఖ రాశారు. గుట్ట వద్ద మట్టి తరలించకుండా ముగ్గురు సిబ్బందిని కాపలాగా ఉంచినట్లు మైనింగ్ శాఖ జిల్లా అధికారి జైసింగ్ తెలిపారు. మట్టి తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే పలు వాహనాలు సీజ్ చేశామని చెప్పారు.

**అధికారుల నిర్లక్ష్యంతోనే..-వంశీ, నర్సింగాపూర్ సర్పంచి**

ఒకప్పుడు పచ్చని చెట్లతో కళకళలాడిన గుట్టను పూర్తిగా తవ్వారు. ప్రభుత్వానికి ఆదాయం కూడా రావడం లేదు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి. ప్రస్తుతం గ్రామస్థులమంతా ఒక్కతాటిపై ఉన్నాం. మట్టి తరలించే వాహనాలను పట్టుకుంటాం. మరోసారి కలెక్టర్‌ను కలిసి గుట్టను పరిరక్షించాలని కోరతాం.

# వచ్చింది వచ్చినట్టే.. ఖాళీ కాబట్టే!



గరిడేపల్లి : పొనుగోడుకు చెందిన రైతు యూరియా కోసం పరిశోధించగా పెన్‌పహాడ్ మండలం గాజులమల్కాపురంలో ఉన్నట్లు యాప్‌లో చూపించింది. సంతోషంతో గత నెల 28న నమోదు చేయించుకున్నారు. వెళ్తే సాంకేతిక లోపంతో బిల్లు రావడం లేదని, మర్నాడు రావాలని చెప్పడంతో వెళ్లారు. 24 గంటల తర్వాత రిజెక్ట్ అయినట్లు సమాచారం వచ్చింది. మళ్లీ చేయించుకోవడానికి అవకాశం లేదని యాప్‌లో చూపించడంతో నిరాశకు గురయ్యారు. మళ్లీ ఎక్కడకు వస్తుందోనని ఎదురు చూడాల్సి వస్తోంది.

జిల్లా అంతటా యూరియా సమస్య మళ్లీ రాజుకుంది. యాప్‌లోనే నమోదు చేసుకోవాలని ఆదేశించడంతో రైతులకు అది భారంగా మారుతోంది. యూరియా దొరక్క తీవ్ర ఆందోళన చెందుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు అనేకమని, వాటిని పరిష్కరించకుండానే యాప్ తీసుకురావడం అన్యాయమని పేర్కొంటున్నారు. పైలట్‌గా చేపట్టిన ఐదు జిల్లాల యాప్‌నకు, ఇప్పటి యాప్‌నకు సంబంధం లేదని కొందరు వ్యవసాయ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు.

**అదను దాటిపోతుందని ఆవేదన..**

మొదటిసారి చల్లడానికి యూరియా అందుబాటులో లేదు. ఎక్కడో ఒక చోట వచ్చినా నిమిషాల్లోనే అయిపోతుంది. దాంతో రైతులు అదను దాటిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వేయకపోతే పిలక శాతం తగ్గడంతో పాటు ఎదుగుదల లోపిస్తుంది. ఇప్పటి వరకు మంచు తీవ్రతతో వరి బాగా ఎదగలేదు. ఎండలు వస్తున్న ఈ తరుణంలో యూరియా మొదటి దఫా వేస్తే ఏపుగా పెరుగుతుంది. ఇదే సమయంలో కొరత వచ్చింది. బఫర్ స్టాకు లేకపోయినా ఎప్పటికపుడు ర్యాక్‌లు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. కానీ రైతులకు యాప్ సమయంపై అవగాహన లేకపోవడంతో, బాగా తెలిసిన వారికి యూరియా దొరుకుతోంది.

చేయాల్సిందిదీ: వ్యవసాయాధికారులు ఒకరోజు ముందుగా సమాచారం ఇచ్చి విస్తృత ప్రచారం చేసి ఉదయం 10 గంటలకు యాప్‌లో నమోదు చేయించుకునేలా చూడాలి. ఎక్కడెక్కడ యూరియా మొదటి దఫా అవసరముందో అక్కడకు అదనంగా సరఫరా చేయాలి. యాప్‌లో రిజెక్ట్, మళ్లీ నమోదు సమస్య పరిష్కరించాలి.

ఆందోళన అవసరం లేదు

-జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సూర్యాపేట

బుధవారం 900 మెట్రిక్ టన్నులు డీలర్లు, సహకార సంఘాలకు సరఫరా అవుతుంది. బఫర్ స్టాకు లేదు. చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# దివ్య క్షేత్రం.. పర్యవేక్షణ గగనం



యాదగిరిగుట్ట : చపర్యవేక్షకులున్నా ఆలయ ఈవోనే కలియ తిరుగుతూ పరిశీలించాల్సి వస్తోంది. గతంలో రోజూ సమీక్షించి, సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టేవారు. రాత్రివేళల్లో వివిధ విభాగాల ఉద్యోగుల బృందం క్షేత్ర పరిసరాల్లో పర్యటించి లోపాలను ఈవో దృష్టికి తీసుకువచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా కనుమరుగైంది. చప్రత్యేక ప్రతిపత్తితో ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో పాలనా వ్యవహారాలు కొనసాగే స్థాయికి చేరుకున్న ఈ క్షేత్రంలో ఉద్యోగుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్నవారికి అదనపు విభాగాల బాధ్యతలు అప్పగించడంతో పర్యవేక్షణ నామమాత్రంగానే ఉంటోంది.

చదేవస్థానంలోని ప్రసాదం తయారీ విభాగం నుంచి గత మే నెలలో చింతపండు బస్తాల చోరీ, కొండపైకి వాహనాల ప్రవేశ రుసుము ఖజానాకు చెల్లింపులో చేతివాటం, తాజాగా డాలర్ల విక్రయాల సొత్తు గోల్‌మాల్ వ్యవహారాలు దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వ్యవహారాలు గాడితప్పుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్ర పరిధిలో ఎప్పటికప్పుడు ఏర్పడే లోపాల సవరణ, నిరంతర పర్యవేక్షణలతో కూడిన నిఘా లేకపోవడంతో ప్రసాదం తయారీ, విక్రయం, ప్రచారం, అద్దె గదులు విచారణ, ఉగ్రాణం (స్టోర్) విభాగాల్లో సేవాలోపం తేటతెల్లమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. విధుల పట్ల కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అవకతవకలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రంలో వివిధ విభాగాలపై సంపూర్ణ పర్యవేక్షణ కరవైంది. ఈ కారణంగా గుట్ట పుణ్యక్షేత్రం స్థాయికి తగిన అభివృద్ధికి నోచుకోవడం లేదని... వసతుల కల్పనలకు దూరమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చదేవస్థానంలో పరిపాలన సౌలభ్యానికి అవసరమైన యంత్రాంగం ఉన్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో భక్తులకు మెరుగైన సేవలు అందడం లేదు. సేవలే కాకుండా భక్తులకు సరైన సమాచారం అందక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సరిచేయాల్సిన ఉన్నతాధికారుల చర్యలు అంతంతమాత్రంగానే ఉండటంతో కిందిస్థాయి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు భక్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

చపారదర్శకంగా సేవలందించేందుకు ఉద్యోగులు, పూజారులతో నాలుగు నెలల క్రితం ఏర్పాటైన ప్రత్యేక కమిటీలు పర్యవేక్షణ చేస్తున్న దాఖలాలు లేవు. దైవదర్శనానికి వచ్చే ముఖ్యులు, దాతలతో పరిచయాలు పెంచుకోవడానికే పలువురు సిబ్బంది ఆసక్తి కనబరుస్తున్నారని స్థానికంగా ఆరోపణలున్నాయి.

# దృశ్య పాఠం.. ఫలితాలకు ఊతం

పెద్దశంకరంపేట : పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యాశాఖ అన్ని చర్యలు చేపడుతోంది. మరోవైపు నాణ్యమైన బోధన అందించాలన్న సంకల్పంతో టీశాట్ తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. మార్చి 14 నుంచి విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. వారిని సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు చేపడుతున్నారు. జిల్లాలో 10,659 మంది విద్యార్థులు దీన్ని వినియోగించుకుంటున్నారు.

**భయం తొలగేలా..**

విద్యార్థులు తొలిసారిగా వార్షిక పరీక్షలకు హాజరు అవుతుండటంతో వారిలో ఆందోళన నెలకొంటుంది. గణితం, ఆంగ్లం పాఠ్యాంశాల విషయంలో కాస్త భయపడుతుంటారు. ఈ ఆందోళనను, భయాన్ని దూరం చేసేందుకు, వారిలో ఉన్న సామర్థ్యాలను వెలికితీసేందుకు కౌన్సిలింగ్ తరగతులు సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తోడు ఉ



త్తమ ఫలితాలు సాధనకు అన్ని పాఠశాలల్లో టీశాట్ ద్వారా ప్రత్యేక పాఠ్యాంశాల ప్రసారాలను మంగళవారం నుంచి ప్రారంభించారు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది.

**సందేహాలు నివృత్తి చేసేలా..**

పదో తరగతి విద్యార్థులకు 3 నుంచి 5వ తేదీ వరకు టీ శాట్ ద్వారా పాఠాలు బోధించనున్నారు. నిత్యం నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను దృశ్య రూపకంగా వివరిస్తున్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతులు ప్రసారం కానున్నాయి. విద్యార్థులు క్షుణ్నంగా పాఠాలు వినడమే కాకుండా వాటిపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే బడులకు అందజేసిన ఐఎఫ్‌పీ (డిజిటల్ తెర)ల ద్వారా విద్యార్థులు వీక్షించేలా ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు దీన్ని పర్యవేక్షిస్తున్నారు.

**ప్రసార వివరాలు ఇలా..**

3న: భౌతిక, జీవశాస్త్రం, ఆంగ్లం, హిందీ

4న: గణితం, తెలుగు, సాంఘిక శాస్త్రం, ఉర్దూ

5న: ఉర్దూ మాధ్యమంలో గణిత, భౌతిక, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం

# ముర్రేడు.. ముర్రో.. ముర్రో..!

కొత్తగూడెం : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు టీజీఎండీసీ ద్వారానే ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. దీనిద్వారా సీనరేజ్ రూపంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతుంది. స్థానిక వనరుల నుంచి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందని మైనింగ్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు కాగితాలకు పరిమితమవుతుండటంతో ఇసుక మాఫియా సహజ సంపదను యథేచ్ఛగా కొల్లగొడుతోంది. అధికారుల మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన కుదరటం లేదని చెప్పటానికి కిన్నెరసాని, ముర్రేడు వాగులే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో ఓ ప్రభుత్వరంగ సంస్థ చేపట్టిన భారీ ప్రాజెక్టుకు సైతం స్థానిక వాగుల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోతుంటే అధికారులు కళ్లు మూసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పగలు



పారదర్శకత గురించి మాట్లాడే వ్యవస్థ, రాత్రిపూట సాగుతున్న అక్రమ రవాణాను ఎందుకు అడ్డుకోలేకపోతుందనేది స్థానికంగా చర్చనీయాంశమవుతోంది.

**ప్రభుత్వ ఖజానాకు గండి..**

ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా భూగర్భజలమట్టాలు పడిపోయే ప్రమాదముంది. స్థానిక ఇసుక వనరుల్లో అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతుండటంతో నదీ ప్రవాహాలు దిశను మార్చుకుని తీరాలు కోతకు గురవుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు చేపట్టే భారీ ప్రాజెక్టులకు టీజీఎండీసీ ద్వారా ఇసుక సరఫరా కావాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా స్థానిక వనరుల నుంచి నాణ్యతలేని ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు దక్కాల్సిన రూ.కోట్ల ఆదాయం పక్కదారి పడుతోంది.

ప్రధానంగా ఎక్కడెక్కడి నుంచి..

పాల్వంచ మండలం తోగ్గూడెం, బోజ్యాతండా సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పాల్వంచలోని ఓ ప్రభుత్వ రంగ సంస్థ చేపట్టిన భారీ ప్రాజెక్టుకు ఎక్కువ మొత్తంలో ఇసుక అవసరమవటంతో మాఫియా జేబులు నింపుకొంటోంది. నాసిరకమైన ఇసుక తక్కువ ధరకు వస్తుంటంతో గుత్తేదారులు సైతం స్థానిక వనరుపైనే ఆధారపడుతున్నారు. ఇసుక లారీల వల్ల కలుగుతున్న ఇబ్బందులపై ప్రశ్నిస్తుంటే మాఫియా బెదిరిస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థ పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇసుక బుకింగ్, రవాణా అనుమతులు, చెల్లింపులు, ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో జరిగేలా యంత్రాంగానికి అవగాహన కల్పించాం.

జితేశ్ వి.పాటిల్, కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం

తోగ్గూడెం, బోజ్యాతండా నుంచి ఇసుక అక్రమ రవాణాపై కేసులు నమోదుచేశాం. రాత్రిపూట నిఘాను పటిష్ఠపరుస్తున్నాం. ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేలా పోలీసు, రెవెన్యూ శాఖల సహకారంతో దాడులు నిర్వహిస్తాం. దినేష్‌కుమార్, మైనింగ్ ఏడీ, భద్రాద్రి కొత్తగూడెం

# చుక్కేసి చిక్కితే.. కొలువుకు ఎసరే!

హైదరాబాద్: మద్యం మత్తులో వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కితే .. కేసు.. కౌన్సెలింగ్.. జరిమానా.. ఇంతేగా అనుకుంటున్నారా.. ఈ ఉదాసీనతను వదిలించేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు కొత్త అస్త్రం ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో చిక్కిన వారి వివరాలను వారు పనిచేసే సంస్థల యాజమాన్యానికి పంపాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు కేవలం పోలీసులతో గొడవలు, జైలుశిక్షలు పడిన వారి సమాచారం మాత్రం చేరవేసే వారు. ప్రమాదాల కట్టడే లక్ష్యంతో ఇటీవల 'ఎరైవ్ -ఎలైవ్' కార్యక్రమం చేపట్టారు. ప్రతిరోజూ 15-20 ప్రాంతాల్లో తనిఖీలు,



అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.అతివేగం, మద్యం కారణంగానే అధిక ప్రమాదాలు జరుగుతున్నట్టు అంచనాకు వచ్చారు. ఈ క్రమంలోనే మత్తులో వాహనాలు నడిపితే కొలువుకు ఎసరు తప్పదనే సంకేతం పంపనున్నారు.నగర సీపీ సజ్జనార్ ఆదేశాలతో మార్చి నుంచి అమలుకు ట్రాఫిక్ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. తనిఖీల్లో చిక్కిన సమయంలోనే వారు పనిచేస్తున్న సంస్థ వివరాలు, చిరునామా సేకరించనున్నట్టు తెలిసింది.

**కుటుంబం ఉందని గుర్తుంచుకోవాలి**

చాలామందిలో తాము ఎంతతాగినా వాహనం నడపగలమనే ధీమా ఉంటుంది. కానీ మెదడుపై మద్యం ప్రభావం తీవ్రంగా ఉంటుందని గ్రహించరు. తమపై ఆధారపడి కుటుంబం ఉందనే విషయం మర్చిపోతున్నారు. ఈనేపథ్యంలోనే డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే వారి వివరాలను ఆయా కంపెనీలకు పంపాలని ఆలోచన చేస్తున్నాం. ఉద్యోగం, పరువు పోతాయనే భయంతోనైనా మద్యం తాగి వాహనం నడపకుండా ఉండే అవకాశం ఉంటుంది.జోయల్ డేవిస్, నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ

# తొలిదశలో గుర్తిస్తే కళ్లెం

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తోంది. బాధితుల సంఖ్య వేగంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది. అవగాహనా లోపంతో చాలామంది చివరి దశలోనే ఆసుపత్రులకు చేరుకుంటున్నారు. ముఖ్యంగా రొమ్ము, సర్వైకల్, నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ముందే గుర్తిస్తే నయం చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రజలకు తెలియచెప్పడానికి, పొగతాగటం, మద్యపానం, అపసవ్య జీవనశైలి వల్ల వచ్చే క్యాన్సర్ ప్రమాదాలపై హెచ్చరించేందుకు, బాధితులకు ధైర్యం, మద్దతు ఇవ్వడానికి ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**జిల్లాలోనే ఆలన సేవలు..**

సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో గతేడాది సెప్టెంబరులో, నల్గొండ జీజీహెచ్‌లో మూడేళ్ల క్రితం అనుసంధానంగా జిల్లా క్యాన్సర్ చికిత్స(ఆలన) వార్డులు ప్రారంభమయ్యాయి. వీటిలో పది పడకల చొప్పున ఇన్‌పేషెంట్ విభాగాలున్నాయి. అలాగే అవుట్ పేషెంట్, హోమ్ కేర్, డే కేర్ కీమోథెరపీ సేవలను అందిస్తున్నారు. వీటి ద్వారా రోగులు ప్రతిసారీ హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లకుండా వెసులుబాటు లభిస్తోంది. ఆసుపత్రికి రాలేని వారికి ఆలన వాహనంలో ఇంటికి వెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు ఫిజియోథెరపిస్టులు, నలుగురు స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉన్నారు. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆసుపత్రిలో రోగుల సంఖ్య అధికమై ఇబ్బందులు తలెత్తుతుండటంతో జిల్లా కేంద్రాల్లోని క్యాన్సర్ ఆలన కేంద్రాల్లో రోగులు వైద్యసేవలను పొందుతున్నారు.

**సమతుల ఆహారం తీసుకోవాలి**

-డాక్టర్ సతీష్, వైద్యాధికారి, క్యాన్సర్ చికిత్స వార్డు, సూర్యాపేట

క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలి. ఆరోగ్య కరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి. బరువు పెరగకుండా చూసుకోవాలి. రోజుకు కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయాలి. నిత్యం తాజా కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, శరీరానికి కావల్సినంత విటమిన్ 'సి' తీసుకోవాలి. మాంసం పరిమితంగా తినాలి. మద్యం, ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం మానుకోవాలి.

# తరాలకు గుర్తుగా.. వరాలివ్వాలి..!

నల్గొండ: రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మిర్యాలగూడలోని గూడూరు గ్రామాన్ని సందర్శించనున్నారు. పలు అభివృద్ధి పనులు, అధికారిక కార్యక్రమాల్లో మంత్రులతో కలిసి పాల్గొని బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు కొలిక్కిరావడం, యాదాద్రికి యాదగిరిగుట్ట పేరు యథాతథంగా ఉంచడంతో ఇక్కడి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. మూసీ నది పరివాహక ప్రభావిత గ్రామాల్లో నివసించే వారికి స్వచ్ఛమైన, పరిశుభ్రమైన జీవన స్థితిగతులను తీర్చిదిద్దేలా మూసీ పునరుజ్జీవ పథక కార్యాచరణ ముందుకు సాగుతుంది. రాష్ట్రంలో మిర్యాలగూడ అంటేనే లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మరపెట్టే వందలాది రైస్‌మిల్లులు గుర్తుకు వస్తాయి. ఒకవైపు పట్టణం అభివృద్ధి చెందగా గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో మౌలిక వసతులు కొరతగా ఉన్నాయి. వీటిపై సీఎం స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోరుకుంటున్నారు.

వీటిపై దృష్టి సారించరూ

రూ.200 కోట్లతో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఐటీ టవర్లు ఏర్పాటు చేసినా నైపుణ్యాలు లేవనే సాకుతో కాలయాపన చేస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మిర్యాలగూడలోనూ ఐటీ చేసిన సాంకేతిక పట్టభద్రులు ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరుకు వెళ్తున్నారు. స్థానికంగా వారికి అవకాశాలు కల్పించాలనే డిమాండ్ ఉంది. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బధిరులు మిర్యాలగూడలోని ప్రభుత్వ బధిరుల కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ప్రత్యేకంగా డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో చివరి భూములకు నీరందించేందుకు నెల్లికల్, బొత్తలపాలెం-వాడపల్లి, దున్నపోతుల గండి, వీర్లపాలెం, తోపుచర్ల లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. డివిజన్-3లో కేశవాపురం-కొండ్రపోల్ లిఫ్ట్‌లున్నాయి. ఈ ప్రాజెక్టులో తొమ్మిది పంప్‌హౌస్‌లున్నాయి. ఈ ప్రాజెక్టులో కేవలం నెల్లికల్ ఎత్తిపోతల పథకానికి రూ.131.42 కోట్ల పనులు జరిగిన బిల్లులు మంజూరు కాలేదు. మిర్యాలగూడలో 'డ్రైపోర్టు' ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది.

# మేడ్చల్ జిల్లా.. ఇక రెవెన్యూ, సంక్షేమాలకే





హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ పునర్విభజనలో మల్కాజిగిరి-మేడ్చల్ జిల్లాలోని అధికభాగం విలీనం కావడంతో పరిపాలనపరంగా జిల్లా స్థాయిలో కొన్ని విభాగాలు రద్దవుతున్నాయి. మరికొన్ని జీహెచ్ఎంసీలో విలీనమవుతున్నాయి. ఈనెల 11 నుంచి జీహెచ్ఎంసీలో అధికారుల పరిపాలన ప్రారంభం కానుంది. దీంతో మేడ్చల్ జిల్లాలోని రహదారులు, భవనాలశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు రద్దు కానున్నాయి. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ రద్దు కాగా ఆ శాఖలోని ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. స్వయం సహాయక సంఘాలు జీహెచ్ఎంసీ యూసీడీలో, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా విభాగాలు జలమండలిలో విలీనమవుతున్నాయి. దీంతో మేడ్చల్ జిల్లా ఇక రెవెన్యూ, సంక్షేమాలకే పరిమితం కానుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యానశాఖలు కలెక్టర్ పరిధిలో ఉంటాయి. పౌరసరఫరాలశాఖ ప్రస్తుతం అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుండగా హైదరాబాద్ కేంద్రంగా చీఫ్ రేషనింగ్ అధికారి పరిధిలోకి తీసుకురావాలా? యథావిధిగా కొనసాగించాలా? అనేది తేలలేదు.

**జిల్లా మొత్తానికీ 3 మున్సిపాలిటీలే..**

జిల్లా రెవెన్యూ పరిధిలో అలియాబాద్, ఎల్లంపేట్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలు మినహా మొత్తం జీహెచ్ఎంసీలో విలీనమైంది. ఈ 3 పురపాలక సంఘాలు కొత్తగా ఏర్పాటైనవే. ఓటర్లు 65 వేలలోపే ఉన్నారు. ఈ మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే. భూగర్భ మురుగునీటి వ్యవస్థ సాధ్యమైనంత వేగంగా అందుబాటులోకి తీసుకురావాలి. ఇక వీటి పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలి. జిల్లాలో 1,654 సంఘాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.80.95 లక్షల రుణాలు మంజూరయ్యాయి.

**ధాన్యం సేకరణ.. రేషన్ పర్యవేక్షణ..** జిల్లాలో 10 మండలాల్లో వరి సాగు చేస్తుండటంతో పౌరసరఫరాల సంస్థ వానాకాలం సీజన్‌లో 15 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించింది. ఇక పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 633 చౌకధరల దుకాణాల ద్వారా 21.58 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ధాన్యం సేకరణ పౌరసరఫరాల సంస్థ చేయాలా? వద్దా? అనేది స్పష్టత లేదు.

# జాతర ఆదాయం.. సద్వినియోగం



ధర్మారం : సమ్మక్క-సారలమ్మ జాతరకు ముందు పక్షం రోజుల నుంచి హుండీ ఆదాయం లెక్కించే వరకు క్రియాశీలకంగా కమిటీలు వ్యవహరిస్తాయి. అయితే జాతర ఆదాయం అప్పులు ఇవ్వడమో, ఖర్చు చేయడమో జరుగుతోంది. కానీ ధర్మారం మండలం దొంగతుర్తి, బొట్లవనపర్తిలో మాత్రం వచ్చిన ఆదాయంతో జాతర ప్రదేశాల్లోనే మామిడి తోటలు పెంచారు. ఈ తోటలు ఏపుగా పెరిగి భక్తులకు నీడతోపాటు ఏటా ఫలసాయం ఇస్తున్నాయి. ఈ రెండు గ్రామాల్లో జాతర ఏర్పాట్లకు చందాల కోసం తిరగాల్సిన పని లేకుండా ఫలసాయం ద్వారా వచ్చే రాబడితో జాతర నిర్వహించుకునేలా స్వయం సమృద్ధి సాధించాయి. మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నాయా గ్రామాలు..

**మామిడితోట పెంపకంతో..**

దొంగతుర్తిలో పాతికేళ్ల కిందట సమ్మక్క-సారక్కల గద్దెలు ఏర్పాటు చేసుకున్నారు. మొదట్లో ఖర్చులకు సరిపడా ఆదాయం రాలేదు. 2006లో జాతర ఖర్చులుపోను రూ.60 వేల ఆదాయం మిగిలింది. ఈ మొత్తంతో గద్దెల వద్దనే రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో మామిడి మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు కాపరిని ఏర్పాటు చేసి జాతర ఆదాయంతో వేతనం చెల్లించారు. కంటికిరెప్పలా కాపాడగా పదేళ్లుగా ఫలసాయం వస్తోంది. ఈ సంవత్సరం రూ.లక్షకు కౌలుకు ఇచ్చారు. మామిడితోట సంరక్షణ విషయమై పార్టీలకు అతీతంగా సమష్టిగా వ్యవహరిస్తామని జాతర కమిటీ ఛైర్మన్ రాములు వివరించారు.

**ఎనిమిదేళ్ల కిందట**

బొట్లవనపర్తిలోనూ ఎనిమిదేళ్ల కిందట జాతర నిర్వహణ ఖర్చులుపోను రూ.20 వేలు మిగిలాయి. ఈ మొత్తానికితోడు గ్రామస్థుల సహకారంతో జాతర ప్రదేశంలో పండ్ల తోట పెంచాలని సమష్టిగా నిర్ణయించారు. సుమారు రెండున్నరెకరాలు చదును చేసి మామిడి, ఇతర పండ్ల తోటలు నాటారు. వారి వద్ద ఉన్న ఆదాయానికితోడు ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. అవి ఏపుగా పెరగగా మూడేళ్లుగా ఫలసాయం వస్తోంది.

# యాసంగిలోనూ వరికే జై



జిల్లాలో వివరాలు (ఎకరాల్లో)..

| పంటలు | అంచనా | ప్రస్తుతం |
|---|---|---|
| వరి | 2,72,000 | 2,59,065 |
| మొక్కజొన్న | 30,000 | 29,396 |

కరీంనగర్ : ఈ యాసంగిలో సైతం వరిపంటకే అన్నదాతలు ఆసక్తి కనబర్చారు. మంగళవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 2,59,065 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ నెల 15వ తేదీ వరకు కూడా నాట్లు వేస్తారని, సాగు మరింత పెరిగే అవకాశముందని వ్యవసాయ అధికారులంటున్నారు. ఆరేళ్ల కిందటి వరకు జిల్లాలో యాసంగిలో అధికంగా వాణిజ్య పంటలు వేసేవారు. కానీ నీటి వసతి పుష్కలంగా పెరగడంతో వరి సాగు పెరుగుతూ వచ్చింది.

**ఎందుకంటే..**నాట్ల నుంచి కోతల వరకు పెద్దగా కూలీల అవసరం లేకపోవడం, కోతులు, పక్షుల బెడద ఉండకపోవడం వరి సాగు పెరగడానికి ముఖ్య కారణంగా భావిస్తున్నారు. గత రెండేళ్ల నుంచి జిల్లాలో సన్నవడ్ల సాగు సైతం పెరిగింది. ప్రభుత్వ మద్దతు ధరతోపాటు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించడం కారణం.

మరో వైపు వాణిజ్య పంటల సాగు క్రమేపి తగ్గుతూ వస్తోంది. గతంలో క్వింటా రూ.అయిదారు వేలు పలికిన వేరుశనగ, ప్రస్తుతం మార్కెట్‌లో ఏకంగా రూ.పది వేలు దాటింది. కూరగాయల సాగు ఘననీయంగా తగ్గిపోయి, గతంలో పదుల రూపాయల్లో కిలో ఉన్న ధర ఇప్పుడు రూ.వంద దాటింది. ఈ యాసంగి కాలానికి అన్ని పంటలు కలిపి 3,15,780 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 2,89,017 ఎకరాల్లో సాగు పూర్తయింది.

**చి'వరి'లో నీరు అందేనా?**గతంలో ఎప్పుడు కూడా జనవరి రెండో వారం తర్వాత కాల్వలకు సాగు నీరు వదిలేవారు. కానీ ఈసారి 15 రోజులు ముందుగానే డిసెంబరు 31నే కాల్వ నీళ్లు వదిలారు. మార్చి నెలాఖరు నాటికి నీటి నిల్వలు సరిపోయినా.. ఏప్రిల్‌లో సాగు నీరు అందించడం కష్టంగా మారే అవకాశముంది. బావుల్లో నీరు ఉండి సాగు చేసిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. ఆయకట్టు నీరుపై ఆధారపడి, ఆలస్యంగా నాట్లు వేసిన వారికి మాత్రం కొన్ని ఇబ్బందులు తప్పకపోవచ్చు.

**లక్ష్యం దిశగా..- జె.భాగ్యలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ**

యాసంగిలో ముందస్తు అంచనా ప్రకారమే సాగు అయ్యే అవకాశముంది. మరో పది రోజుల వరకు వరినాట్లకు అవకాశముంది. మొక్కజొన్న, ఇతర వాణిజ్య పంటలు నీటి వసతిని బట్టి మరో నెల రోజుల వరకు సాగు చేసే అవకాశముంది.

# కట్టు దాటొద్దు.. జైలు పాలు కావొద్దు

మెదక్ : మున్సిపల్ ఎన్నికల పోరులో నిలిచిందెవరో తేలిపోయింది. ఇక నేటి నుంచి ప్రచారం హోరెత్తనుంది. జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పట్టణాల పరిధిలో పోటీదారులు తమ అనుచరులతో ప్రచారం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పోలింగ్‌కు సమయం తక్కువగా ఉండటంతో సామాజిక మాధ్యమాలను అస్త్రంగా వాడుకోవడం అవశ్యం. ప్రస్తుతం అందివచ్చిన సాంకేతికతను వినియోగించుకోనున్నారు. అయితే ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. అభ్యంతకర సందేశాలు పోస్టు చేస్తే ఇబ్బంది పడక తప్పదు.

**కాల్స్ ద్వారా..**

ఇప్పటికే పలువురు అభ్యర్థులు దూరంగా ఉన్న వారిని ఫోన్‌లో సంప్రదిస్తూ ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇక మెదక్, నర్సాపూర్‌లో పలువురు ఇందుకు ప్రత్యేకంగా కొందరిని నియమించుకొని మరీ ఫోన్ చేయిస్తున్నారు.



**సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిస్తూ..**

ప్రస్తుతం అందరి చేతుల్లో అధునాతన చరవాణులు ఉన్నాయి. దీంతో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్, యూట్యూబ్ తదితర మాధ్యమాలను అత్యధికులు వినియోగిస్తున్నారు. వీటిని వేదికగా చేసుకొని అభ్యర్థులు ప్రచారానికి తెర తీయనున్నారు. పలువురు ఇప్పటికే వీటి ద్వారా ప్రచారం అదరగొడుతున్నారు. వీడియోలు, ఫొటోలతో సందేశాలు పంపిస్తున్నారు.

**ఘర్షణలకు తావివ్వొద్దు..**


సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే వేళ సంయమనం పాటించాలి. లేదంటే కేసులు ఎదుర్కోక తప్పదని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. అభ్యంతరకరమైన పోస్టులు పెడితే ఇబ్బంది పడతారని, యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు ఆశావహులు, నాయకులు, కార్యకర్తల సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టేలా వాయిస్ మెసేజ్‌లు, ఫొటోల మార్ఫింగ్ చేసినా కటకటాల పాలవడం ఖాయమని స్పష్టంచేస్తున్నారు. హద్దులు దాటకుండా చూసుకోవాల్సిన బాధ్యత అడ్మిన్లదేనని చెబుతున్నారు.

# ఉపసంహారణకు నై... పోరుకు రెబల్స్ సై

సంగారెడ్డి : పుర ఎన్నికల్లో ప్రధాన ఘట్టం నామపత్రాల ఉపసంహరణ అంకం ముగిసింది. ఈ సందర్భంగా ప్రధాన పార్టీల నేతల బుజ్జగింపులు ఫలించలేదు. అన్ని చోట్ల కాంగ్రెస్, భారాసకు రెబల్స్ బెడద తలనొప్పిగా మారింది. నామినేషన్లు ఉపసంహరించుకోవాలని మూడు రోజులుగా ప్రయత్నాలు చేసినా ఆశావహులు వెనక్కి తగ్గలేదు. స్వతంత్రులుగా పోటీకి దిగి సత్తా చాటుతామని సవాల్ విసురుతున్నారు. వీరి వల్ల ఫలితాలు తలకిందులు అవుతాయని ఆయా పార్టీల్లో ఆందోళన నెలకొంది.

**తిరుగుబాటు దారుల బెడద**

జిల్లాలో సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, గడ్డపోతారం, నారాయణఖేడ్, అందోలు- జోగిపేటలో తిరుగుబాటుదారుల బెడద ఎక్కువగా ఉంది. సంగారెడ్డిలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి జోక్యం చేసుకోవడంతో ఆ పార్టీ నుంచి రెబల్స్ వెనక్కి తగ్గారు. భారాసకు మాత్రం నాలుగైదు వార్డుల్లో వీరు పోటీలో ఉన్నారు. 32వ వార్డులో భారాస టికెట్ ఆశించి రాకపోవడంతో ఓ నాయకుడు కాంగ్రెస్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. ఇక్కడ చివరలో కూడా బీఫాంలు ఇవ్వడం ఆందోళనకు దారి తీసింది. జహీరాబాద్‌లో కాంగ్రెస్‌లో 15 మంది, భారాసకు ఆరు చోట్ల రెబల్స్ ఉన్నారు. ముఖ్యంగా 4, 17, 21, 34 వార్డుల్లో ముఖ్యమైన నాయకులు పోటీ చేస్తున్నారు. వీరి వార్డుల్లోనే అసంతృప్తులు రంగంలో ఉన్నారు. నారాయణఖేడ్‌లో కాంగ్రెస్, భారాసలకు ఇద్దరు చొప్పున, భాజపాకు ఒకరు రెబల్స్ బరిలో ఉన్నారు. అందోలు- జోగిపేటలో కాంగ్రెస్ 1, 14 వార్డుల్లో కాంగ్రెస్ అసంతృప్తులు బరిలో నిలిచారు. ఇస్నాపూర్‌లో కాంగ్రెస్‌కు ముగ్గురు, భారాసకు ఇద్దరు అసంతృప్తులు పోటీలో ఉన్నారు. గడ్డపోతారంలో కాంగ్రెస్, భారాసలకు ఒకరిద్దరు రెబల్స్ పోటీ చేస్తున్నారు.



**గెలుపు ఓటములపై ప్రభావం**

తిరుగుబాటు దారులు గెలుపు ఓటములపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అసంతృప్తులు ఎన్ని ఓట్లు చీలుస్తారోనని ఇప్పుడే లెక్కలు వేస్తున్నారు. ఓటర్లు అసంతృప్తుల వైపు మళ్లకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

**లెక్కతేలింది**జిల్లాలోని 11 పురపాలికల్లో 256 వార్డు స్థానాలకు 1,045 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్, భారాస అన్ని వార్డుల్లో పోటీ చేస్తున్నాయి. సంగారెడ్డి-50, జహీరాబాద్-65, సదాశివపేట-38, అందోలు- జోగిపేట-36నారాయణఖేడ్-61, గడ్డపోతారం-35, జిన్నారం-25, ఇస్నాపూర్-37, ఇంద్రేశం-31,గుమ్మడిదల-34, కోహీర్-29, మొత్తం 441 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

# ఆస్తులు.. అప్పులు.. పంచేదెలా?

హైదరాబాద్: జీహెచ్ఎంసీని మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు చేస్తే.. ఆస్తులు, అప్పులను ఆయా సంస్థలకు ఎలా పంచాలనే విషయమై జీహెచ్ఎంసీ కసరత్తు ప్రారంభించింది. నగరంలో జీహెచ్ఎంసీకి చెందిన ఆస్తులు ఎక్కడెక్కడున్నాయి, వాటి పరిస్థితి ఏంటి, బల్దియా నెత్తిపై ఉన్న అప్పులు, వాటికి ప్రతి నెలా చెల్లిస్తోన్న కిస్తీల గురించి ఉన్నతస్థాయిలో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా.. అప్పులు, ఆస్తులను సమానంగా పంచుకోవాల్సిన పరిస్థితే వస్తే.. అతి తక్కువ ఆదాయ వనరులున్న మల్కాజిగిరి మహానగరపాలక సంస్థకు ఏ విధంగా న్యాయం చేస్తారని సంబంధిత అధికారులు ప్రశ్న లేవనెత్తారు. ఆస్తిపన్ను నామమాత్రంగా వచ్చే



ప్రాంతాలతో గ్రేటర్ మల్కాజిగిరిని ఏర్పాటు చేస్తున్నారని.. ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ తతంగాన్ని చూస్తే.. డివిజన్ల పునర్విభజన, సర్కిళ్లు, జోన్ల పునర్వ్యవస్థీకరణ చకచకా పూర్తయినప్పటికీ.. ఆస్తులు, అప్పులు, నిధుల పంపకాలు మాత్రం తేలిగ్గా పూర్తయ్యేట్లు కనిపించడం లేదు.ప్రభుత్వం కలుగజేసుకుని.. ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తేనే సమస్య కొలిక్కి వస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**సిద్ధమవుతున్న జాబితా..**

ఎస్టేట్స్ విభాగం ఆధ్వర్యంలోని మున్సిపల్ మార్కెట్లు, కాంప్లెక్సులను జోన్ల వారీగా విభజించి.. మూడు నగరపాలక సంస్థలకు తగ్గట్టు అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు.విలీన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని ఆస్తిపన్ను వివరాలను జీహెచ్ఎంసీ సమాచారంతో అనుసంధానం చేసి.. జోన్లవారీగా విభజించే ప్రక్రియ పురోగతిలో ఉంది. మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధి నుంచి ఏడాదికి రూ.550 కోట్ల ఆస్తిపన్ను వసూలయ్యే అవకాశం ఉందని అధికారుల అంచనా.

# ధరలు పెంచి.. స్టిక్కర్లు అంటించి

సిరిసిల్ల : రెండేళ్ల కాలపరిమితితో మద్యం దుకాణాల నిర్వహణకు అనుమతులు పొందిన వారికి పంచాయతీ ఎన్నికలతో తొలి అమ్మకాల్లోనే జోరు పెరిగింది. అదే ఊపులో మరో అడుగు ముందుకేశారు. లైసెన్సు పొందిన మద్యం దుకాణదారులు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో కాలనీలను పంచుకున్నారు. ఇలా.. వీరి పరిధిలో మద్యం గొలుసు దుకాణాలకు అక్కడి నుంచే కొనుగోలు చేయాలనే నిబంధన పెట్టారు. దీనికోసం మద్యం సీసాలపై ఆ దుకాణం పేరుతో స్టిక్కర్లు అంటించి.. ధరలు పెంచి గొలుసు దుకాణదారులకు విక్రయిస్తారు. దీనికోసం లైసెన్సు దారులంతా సిండికేటుగా మారారు.

**ముడుపులు ముడితే కన్నెత్తి చూడరు**

కొత్తగా ప్రారంభమైన ప్రతి దుకాణానికి ఎక్సైజ్‌శాఖ ఒక రిజిస్టర్‌ను అందిస్తుంది. రోజువారీగా విక్రయాలు, నిల్వలు నమోదు చేయాలి. ఎక్సైజ్‌శాఖ అధికారులు ఈ రిజిస్టర్‌కు ఒక్కో దుకాణదారుడి నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేశారు. బుక్‌స్టాల్‌లో రూ.50కి వచ్చే రిజిస్టర్‌కు ఇంత భారీగా వసూలు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో పోలీసులు, ఎక్సైజ్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు ఇలా.. అందరి నెలవారీ మామూళ్ల మొత్తం రూ.11 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరిగాయి. దీనికి ఈ సారి గ్రామాల్లో గొలుసు దుకాణాలు పెరగడమూ.. వారి విక్రయాల జోలికి వెళ్లకుండా ఎక్కడికక్కడ సిండికేటు నిర్వాహకులు రెండు శాఖలను ముడుపులతో కళ్లు మూయిస్తున్నారు.

గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో ఈ నెల 6న మద్యం గొలుసు దుకాణం నిర్వహణకు వేలం పాట జరిగింది. పాల్గొన్నవారిలో ఒకరు అత్యధికంగా రూ.3.57 లక్షలతో అవకాశం చేజిక్కించుకున్నారు. జిల్లాలో ఇలాంటివి చాలా జరిగాయి.

ఎల్లారెడ్డిపేట మండలంలో నాలుగు మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 500 గొలుసు దుకాణాలు వెలిశాయి. వీటిలో ఇటీవలే 150 కొత్తగా దుకాణాలు ఏర్పాటవడం గమనార్హం.




ఉమ్మడి జిల్లాలో 2012లో ఇలానే సిండికేటుతో రూ.కోట్ల అవినీతి వ్యవహారం బయటపడింది. అప్పుడు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, మద్యం సిండికేటుదారుల మధ్య సంబంధాలు వెలుగుచూశాయి. అనిశా అధికారులు జిల్లాలో మద్యం సిండికేటు దందాపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో 48 దుకాణాలు, 8 బార్ అండ్ రెస్టారెంట్లలో రోజుకు సగటున రూ.2 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గొలుసు దుకాణాలకు విక్రయించే ఒక్కో మద్యం సీసాపై కంపెనీని బట్టి రూ.10 నుంచి రూ.30కి పెంచారు. దీనికి గొలుసు దుకాణాల దారులు మరో రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నారు. ఇదంతా ఎక్సైజ్, పోలీసుశాఖల కనుసన్నల్లోనే పకడ్బందీగా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

# వ్యాధులపై సమాచారం అందించాల్సిందే



హైదరాబాద్: ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రికి వచ్చే రోగుల సమాచారం ఇక నుంచి తప్పకుండా వైద్యారోగ్యశాఖతో పంచుకోవాల్సిందే. ఓపీ, ఐపీతో పాటు ఐసీయూల్లో ఉన్న రోగుల సంఖ్య, ఇతర వివరాలను తప్పకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అందించాలి. ఏరోజుకారోజు ఈ వివరాలను ఒక ఫార్మట్ రూపంలో పంపాలి. ఈ మేరకు అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నుంచి ఆదేశాలు అందాయి. వాస్తవానికి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి ఈ వివరాలను తప్పకుండా ప్రభుత్వంతో పంచుకోవాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. హృద్రోగం, మలేరియా, డెంగీ, టీబీ, క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక, అంటు వ్యాధుల సమాచారం ప్రభుత్వ దృష్టికి తేవడం ద్వారా ఆ వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక రూపొందించడానికి అవకాశం ఉంటుంది. డెంగీ కేసులు పెరిగినప్పుడు కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వకపోవడంతో ఎన్ని కేసులున్నాయో తెలియడం లేదు. ఏ ప్రాంతం నుంచి కేసులు ఎక్కువ వస్తున్నాయో తెలిస్తే అక్కడ దోమల నియంత్రణకు జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం అలా జరగక పోవడంతో డెంగీ, మలేరియా జ్వరాలు పెరుగుతున్నా సమస్య ఒకచోట.. మందుల మరోచోట అన్న చందంగా తయారైంది.

**గోప్యంగా రోగుల ఆరోగ్య వివరాలు**

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 3,200 అనుమతులు పొందిన చిన్నపాటి క్లినిక్‌ల నుంచి పెద్దాసుపత్రుల వరకు న్నాయి. ఇక నుంచి ప్రతి ఆసుపత్రి తప్పకుండా రోజు వారీ సమాచారం ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.ప్రైవేటు ఆసుపత్రులు అందించిన సమాచారాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుంది. కేవలం రోగాల నియంత్రణ, వైద్య ఆరోగ్యశాఖ తీసుకునే జాగ్రత్తల కోసమే వాడుకుంటుందని హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటి తెలిపారు.సమాచారం పంచుకోని ఆసుపత్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం జరిమానా విధించడం లేదంటే ఆసుపత్రి అనుమతులు సైతం రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

# కరోనాతో నాంది.. నేరాలకు పునాది



హైదరాబాద్: శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు సైన్యంలో చేరాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. నగరానికి వచ్చి కొంతకాలం డ్రైవర్‌గా పనిచేశాడు. కొవిడ్ సమయంలో ఉద్యోగం కోల్పోవటంతో సంపాదనకోసం మిత్రుడి నుంచి గంజాయి కొని అధిక ధరకు అమ్మేవాడు. క్రమంగా ఏవోబీలోని ముఠాలతో పరిచయాలు పెంచుకుని 300 మందికి సరకు చేరవేసేంతగా ఎదిగాడు. ఇటీవల హెచ్‌న్యూ పోలీసులకు చిక్కాడు.బోడుప్పల్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి. కరోనా వేళ కొలువు పోగొట్టుకున్నాడు. లాక్‌డౌన్ ముగిశాక కిరాణం ప్రారంభించాడు. చాలీచాలని సంపాదన నుంచి బయటపడేందుకు మల్టీలెవల్ స్కీమ్‌లో చేరాడు. సభ్యులను చేర్పిస్తూ కమీషన్ తీసుకున్నాడు. రెండేళ్లుగా సైబర్ ముఠాలకు ఖాతాలు సమకూర్చుతూ రూ.లక్షలు సంపాదించాడు. కొద్దిరోజుల క్రితం అరెస్టయి జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనా మహమ్మారి ఎన్నో కుటుంబాలను వీధి పాల్జేసింది. ఎంతోమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దూరం చేసింది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు కారణంగా, కొందరు తప్పటడుగులు వేశారు. డ్రగ్స్, సైబర్‌నేరాలు, మోసాల్లో భాగస్వాములుగా మారి జైలు పాలయ్యారు. బయటకొచ్చాక కొందరే తప్పులు సరిదిద్దుకున్నారు. అధికశాతం నేరాలనే వృత్తిగా మలచుకున్నారు. గతేడాది నగర పోలీసు కమిషనరేట్‌లో దొంగతనాలు, దోపిడీలు, డ్రగ్స్ సరఫరా, సైబర్ నేరాలపై 30,690 కేసులు నమోదయ్యాయి. వీటిలో 90% పాత నేరస్థులే ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించారు. 20%మంది కొవిడ్ వేళలో తొలిసారి నేరాలకు పాల్పడి పోలీసు రికార్డుల్లోకి చేరిన వారే కావటం గమనార్హం. అప్పటి సమస్యలను అధిగమించేందుకు నేరంచేసిన వీరు క్రమంగా ఆ మార్గంలో నడుస్తున్నట్టు అంగీకరించారు. ఇటీవల సంచలనం రేకెత్తించిన సినిమా పైరసీ సూత్రధారి ఇమంది రవి కొవిడ్‌ను అనువుగామలచుకున్నాడు. ఉచితంగా కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్ వీక్షించేందుకు ఐ బొమ్మను వేదికగా చేశాడు. పైరసీమాటున ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ నిర్వాహకులనుంచి వచ్చిన రూ.30 కోట్లలో రూ.21 కోట్లు 2019–21 మధ్య సంపాదించినట్టు పోలీసుల దర్యాప్తులో నిర్ధారించారు.

**మారాలన్నా.. మారకున్నారు**క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయిన కుర్రాడు ఏజెంట్‌గా మారాడు. క్రమంగా బుకీ అవతారమెత్తాడు. కరోనా కష్టాలతో ఇలా మారానంటూ చెప్పాడు. పోలీసుల కౌన్సెలింగ్‌లో మారతానంటూ ప్రమాణం చేసినా పలుమార్లు పట్టుబడుతున్నాడని ఓ పోలీసు అధికారి తెలిపారు. జేబు దొంగతనాలతో మొదలై ముఠాగా ఏర్పడి దోపిడీలు, బెదిరింపులకు పాల్పడుతున్న వారున్నారని తెలిపారు. నేరాలను వృత్తిగా మలచుకున్న వారిని బయట పడేయటం అనుకున్నంత తేలిక కాదని పోలీసు ఉన్నతాధికారి ఆందోళన వెలిబుచ్చారు.

# పేదోడి కల.. మోసగాళ్ల వల



హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామంటూ కొందరు అక్రమార్కులు లబ్ధిదారులను మోసం చేస్తున్నారు. రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో మాట్లాడతామని నమ్మిస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు ముందుగా రూ.5వేలు ఇవ్వాలంటూ దండుకుంటున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టరేట్ల వద్ద కొన్నిరోజులుగా ఈ తంతు కొనసాగుతోంది. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్న వారిలో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. డబ్బు ఇచ్చాక రెండు రోజుల్లో ఓటీపీ వస్తుందని చెబుతున్నారు. బాధితులకు నమ్మకం కలిగేందుకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు పత్రాలను చూపిస్తున్నారు. డబ్బు ఇచ్చినా ఓటీపీ రాకపోవడంతో బాధితుల్లో కొందరు కలెక్టరేట్‌లో వాకబు చేస్తుండడంతో ఈ మోసాలు వెలుగు చూస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామంటూ ఎవరికీ డబ్బులివ్వవద్దని అధికారులు చెబుతున్నారు.

**మంజూరు చేయిస్తాం.. రుణం ఇప్పిస్తాం..**

ఇందిరమ్మ ఇళ్లను వారం, పదిరోజుల్లో మంజూరు చేయిస్తాం. బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామంటూ కలెక్టర్ కార్యాలయాల వద్ద కొందరు వ్యక్తులు కాపుకాస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమం హాలు వెలుపల, క్యాంటిన్ వద్ద వీరుంటున్నారు. దరఖాస్తులు ఇచ్చిన వారితో మాటలు కలిపి తాము ఇక్కడే ఔట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్నామని మాట కలుపుతున్నారు. ఒకట్రెండు నెలల్లో ఇళ్లు మంజూరవుతాయని, తొలి జాబితాలో మీ పేరు ఉండేలా చూస్తామని నమ్మిస్తున్నారు. ఆర్నెల్ల క్రితం యాభైమందికి ఇళ్లు ఇప్పించామని, బ్యాంక్ రుణం కూడా వచ్చిందని కొన్ని ఫొటోలు చూపిస్తున్నారు. వీరి మాటలను నమ్మిన బాధితులు నగదు ఇస్తున్నారు. జీపే చేస్తామంటే.. అధికారులకు డబ్బులే ఇవ్వాలంటూ నగదు తీసుకుంటున్నారు. ఇల్లు మంజూరైనట్టు ఓటీపీ వచ్చాక కలుసుకుందామని చెప్పి వెళ్లిపోతున్నారు.

**వాకబు చేస్తే.. ఫోన్లు స్విచ్ఛాఫ్..**

డబ్బులిచ్చిన వారికి ఓటీపీలు రాకపోవడంతో బాధితులు కలెక్టర్ కార్యాలయాలకు వస్తున్నారు. ప్రజావాణి కేంద్రం వద్ద వారి గురించి వాకబు చేస్తున్నారు. కాగా వారు అసలిక్కడ ఉద్యోగులేకాదు.. అని సిబ్బంది చెబుతున్నారు. బాధితులు వారికి ఫోన్లు చేయగా.. స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. ఈ విషయాన్ని హౌసింగ్ అధికారులకు తెలపగా.. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. మూడు కలెక్టరేట్ల పరిధుల్లో వారానికి 70 నుంచి వంద మంది వరకు మోసపోతున్నారని రెవెన్యూ అధికారుల అంచనా. ఇకపై ప్రజావాణి హాల్ వద్ద ఎవరికీ డబ్బు చెల్లించవద్దంటూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారు.

# అన్నదాతకు ఆదరవు.. అతివకు ఆర్థిక వనరు

రాచర్ల : జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, పొద్దుతిరుగుడు, జొన్న, సజ్జలు, గోధుమ, పప్పు దినుసులు వంటి పంటలు పండుతున్నాయి. ప్రతి సీజన్‌లో సాగు విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. సమృద్ధిగా సాగునీరు లభిస్తుండటంతో సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పంటల దిగుబడులను నిల్వ చేసుకునేందుకు తిప్పలు తప్పడం లేదు. నిల్వ ప్రదేశాలు కరవై ఆరుగాలం శ్రమను తక్కువ ధరలకే అమ్ముకుంటూ నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. గోదాంలు అందుబాటులోకి వస్తే కర్షకుల కష్టాలు తీరనున్నాయి. పంట ఉత్పత్తులేవైనా గోదాంలలో భద్రపరచుకుంటారు. ఆశించిన మంచి ధర పలికినప్పుడే విక్రయాలు జరిపి, లాభాలను ఆర్జిస్తారు. అలాగే మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం భారీగా ఆదాయం సమకూరనుంది.

జిల్లాలో ఉన్నవి అయిదు గోదాంలు

తంగళ్లపల్లి మండలంలో రెండు, ముస్తాబాద్ మండలంలో ఒకటి, కోనరావుపేట మండలంలో ఒకటి, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఒకటి.. ఇలా గతంలో అయిదు ఐకేపీ గోదాంలను నిర్మించారు. వీటి ద్వారా ఏటా పంట సీజన్‌లను బట్టి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు అద్దె వస్తోంది. ఆ డబ్బులను గ్రామైక్య సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ గోదాములు గ్రామైక్య సంఘాలకు ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా పంట ఉత్పత్తుల కొనుగోలు సమయంలో ధాన్యం బస్తాలను నిల్వ చేయడం, గన్నీ సంచులు, టార్పాలిన్‌లు తదితర వాటిని భద్రపరిచేందుకు ఉ



పయోగపడుతున్నాయి. అయినప్పటికీ ఐకేపీ ఆధ్వర్యంలో ఉన్న గోదాంల సంఖ్య తక్కువే. ఇలాంటి గోదాములను ఊరికొకటి చొప్పున మరిన్ని నిర్మిస్తే అన్నదాతకు ఆదరవుగా నిలవడంతోపాటు అతివకు ఆర్థిక వనరుగా మారనున్నాయి.

**తొలుత మండలానికి ఒకటి..**

ఊరూరా గోదాములను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇది కార్యరూపం దాల్చితే పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో వీటిని నిర్మించనున్నారు. వాటిని అద్దెకు ఇవ్వడం వల్ల మహిళా సంఘాలకు ఆదాయం చేకూరనుంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా 444 చదరపు గజాల స్థలంలో వంద టన్నుల నిల్వ సామర్థ్యం ఉండేలా వీటిని నిర్మించాలని సర్కారు నిర్దేశించింది. ఒక్కో దానికి రూ.30 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా వేములవాడ అర్బన్, తంగళ్లపల్లిలో ఒక్కోటి గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ మాసం తర్వాత జిల్లాలోని ప్రతి మండలానికి ఒకటి చొప్పున నిర్మించాలని సంకల్పించారు. మున్ముందు గ్రామానికి ఒకటి చొప్పున ఐకేపీ గోదాములను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# 'ఆమె'కు భద్రత

పెద్దపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో పోలీస్‌శాఖ భరోసా కేంద్రాల తరహాలో పల్లెల్లో అతివలకు జెండర్ రిసోర్స్ సెంటర్లు(జీఆర్‌సీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పర్యవేక్షణలో పోలీస్, మహిళా, శిశుసంక్షేమ, ఇతర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసింది. ప్రయోగాత్మకంగా జిల్లాలో మండలాల ఎంపిక పూర్తయింది.

**వారానికోసారి సమావేశం**

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, వారి పిల్లలకు భవితకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. గ్రామ స్థాయిలో ముగ్గురు, మండల స్థాయిలో అయిదుగురు సభ్యులతో సామాజిక కార్యాచరణ కమిటీ(ఎస్ఏసీ) ఏర్పాటు చేస్తారు. ప్రతీ జీఆర్‌సీ కేంద్రాల్లో ఎస్ఏసీ సభ్యులు గృహహింస, లైంగిక వేధింపులు, మానసిక ఒత్తిడి, వరకట్న వేధింపులపై ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామ స్థాయిలో సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం, చట్టాలపై అవగాహన కలిగిస్తారు. షీటీం, సఖి, బాలిక సాధికారత కేంద్రాల నిర్వాహకులతో చైతన్యం కల్పిస్తారు.



ఆడపిల్లలకు 21 ఏళ్లునిండాకే వివాహం, బాలికలు అందరినీ చదివించడం, కుల మత భేదాలు లేకుండా, అంటరానితనాన్ని నిర్మూలించడం అనే అంశాలపై సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తారు.

బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు అరికట్టడం, తక్షణ పోలీస్ సహాయం అందించడం, లైంగిక దాడి బాధితులకు వైద్యం, న్యాయం, పోలీసు సేవలను ఒకే చోట తీసుకొచ్చారు.

తొలి దశలో ప్రయోగాత్మక మండలాల్లో

ఉమ్మడి జిల్లాలో 49 వేల స్వశక్తి సంఘాల్లో 5 లక్షలకుపైగా సభ్యులు కొనసాగుతున్నారు. తొలి విడతలో ప్రయోగాత్మకంగా పెద్దపల్లి జిల్లాలో కమాన్‌పూర్, సుల్తానాబాద్, జగిత్యాలలో కోరుట్ల, కరీంనగర్‌లో హుజురాబాద్, గన్నేరువరం, ఇల్లందకుంట, కరీంనగర్ రూరల్, రాజన్న సిరిసిల్లలో తంగళ్లపల్లి మండలాలు ఎంపికయ్యాయి.

మండలానికో జీఆర్‌సీ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ముందుగా ఎస్ఏసీ సభ్యులకు శిక్షణ ఇస్తారు. సహచర మహిళలే ఎస్ఏసీ సభ్యులు కావడంతో బాధితులు తమ బాధలను నిర్భయంగా చెప్పుకొని న్యాయం పొందనున్నారు. మహిళలకు సత్వర న్యాయం

– కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి


గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస, లింగ వివక్ష, వేధింపులు, సామాజిక, ఆర్థిక సమస్యలపై తక్షణ సాయం లభించనుంది. తమ సమస్యలను ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్న మహిళలకు భరోసా కలగనుంది.

చురకలు



## సుగ్గిబాటలో 'పది' విద్యార్థి

కర్నూలు : కౌతాళం జడ్పీ ఉన్నత పాఠశాలలో 198 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. మంగళవారం 30 మంది హాజరుకా లేదు. ఒక్కోరోజు వీరి సంఖ్య 60 వరకు ఉంటోంది. పాఠశాలకు చెందిన చాలా మంది విద్యార్థులు తల్లిదండ్రుల వెంట సుగ్గికి వెళ్లారు.. మరికొందరు గ్రామంలోనే ఉంటూ వ్యవసాయ పనులకెళ్తున్నారు. పదో తరగతి పరీక్షలు తరుముకొస్తున్నాయి. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా 'వంద'రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. పర్యవేక్షణకు 361 మందిని ప్రత్యేక అధికారులను నియమించారు. వలస(సుగ్గి) వెళ్తున్న వారి కోసం 78 సీజనల్ వసతి గృహాలు ఏర్పాటు




చేశారు. వీటి నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి వరకు ఖర్చు చేస్తోంది. జిల్లాలోని 361 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 26,266 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. వీరిలో 23,534 మంది నిత్యం పరీక్షలు రాస్తున్నారు. ఇందులో 3,868 మంది సీ, డీ గ్రేడ్లో ఉన్నారు. 2,732 మంది గైర్హాజరవుతున్నారు. రోజువారి పరీక్షలకు గైర్హాజరవుతున్న వారిలో 90 శాతం మంది తల్లిదండ్రుల వెంట వెళ్లినట్లు తెలుస్తోంది. వీరంతా కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు, నందవరం మండలాల్లో ఎక్కువగా ఉన్నారు. కౌతాళం మండలంలో నిత్యం రెండు వందల మంది వరకు పదో తరగతి విద్యార్థులు గైర్హాజరవుతున్నట్లు ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావనకొచ్చింది. వీరిని వెంటనే సుగ్గి నుంచి పిలిపించి సీజనల్ వసతి గృహంలో ఉండేలా చూడాలి.. లేదంటే పరీక్షల్లో గట్టెక్కడం కష్టం.. గతేడాది అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా మంది పరీక్షలు రాయలేకపోయారు.

## కన్నేశారు.. కాజేశారు!

కనిగిరి : కనిగిరి కూతవేటు దూరంలోని ట్రిపుల్ఐటీ నిర్మించే బల్లిపల్లి పరిసర ప్రాంతాల్లో భూములకు రెక్కలొచ్చాయి. ఈ ప్రాంతంలో గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవేతోపాటు నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్, పాలేరు నీటి పరిప్రవాహక ప్రాంతం ఉండడంతో పశువులబీడు, వాగు పోరంబోకు భూములకు రెక్కలొచ్చాయి. ఇక్కడ ట్రిపుల్ఐటీకి నిర్మాణానికి భూములు కేటాయించడంతో కొంతమంది ఆక్రమణ దారుల కళ్లు ఇక్కడ ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై పడింది. దీంతో రెవెన్యూశాఖాధికారులను మచ్చిక చేసుకుని భూములను ఆక్రమించుకుని పెద్ద సైతం వేశారు. కబ్జాల వెనుక రెవెన్యూశాఖలో కొంతమంది అధికారుల హస్తం ఉందని, వారే దగ్గరుండి ఆక్రమణలు ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిగిరి మండలం బల్లిపల్లి వద్ద 250 ఎకరాల ప్రభుత్వ భూమిని ట్రిపుల్ఐటీ నిర్మాణానికి కేటాయించారు. రెవెన్యూశాఖాధికారులు జంగిల్ క్లియరెన్స్ చేసి కొండలు, గుట్టలు చదును చేశారు. ఫలితంగా ఒక్కసారిగా ఇక్కడ భూములకు ధరలు పెరిగాయి. ఇక్కడ గతంలో ఎకరా రూ.20 లక్షలుండగా, ప్రస్తుతం మూడింతలు పెరిగింది. ఇదే అదునుగా కొంతమంది కనిగిరి మండల నాయకులు కన్నేశారు. పూర్వపు తహసీల్దారు ద్వారా పశువుల బీడుకు కొన్ని పట్టాలు పొందగా, దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు నాయకులు నీకింత నాకింత



అన్నట్లుగా కనిగిరి-పామూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న సుమారు రూ.5 కోట్ల విలువైన భూములను ఆక్రమించుకున్నారు. ఇప్పటికే 766-1 సర్వే నంబరులో రెండెకరాలకుపైగా ఆక్రమణలు జరిగాయని స్థానికులు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేయడంతోపాటు సమాచార హక్కు చట్టం ద్వారా వివరణ కోరారు.

**8 ఎకరాలకు పైగా..** ఇక్కడ సుమారు 8 ఎకరాలకు పైగా పశువుల బీడు భూములు ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు ప్రోత్సహిస్తున్న కొందరు రెవెన్యూశాఖ అధికారులపై చర్యలు తీసుకుని పశువుల బీడు భూములను కాపాడాలని కోరుతున్నారు. ఈ విషయమై కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఆర్డీవో జి.కేశవర్ధన్రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్ఐటీకి కేటాయించిన భూముల సమీపంలోని పశువుల బీడు భూముల ఆక్రమణలపై ఫిర్యాదులొచ్చా యన్నారు. వీటిని సమగ్రంగా సర్వే చేసి ఆక్రమణలు తొలగించనున్నట్లు తెలిపారు.

## అక్రమాలు 'సాగు'తున్నాయ్!

సింగరాయకొండ : గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారమే పెట్టుబడిగా కొందరు వైకాపా నేతలు బరితెగించారు. ఎకరాలకు ఎకరాలకు కబ్జా చేసి యథేచ్ఛగా పండ్ల తోటలు సాగు చేసినా అధికార యంత్రాంగంలో స్పందన కరవైంది. మండల కేంద్రం సింగరాయకొండ గ్రామ పరిధిలోని జగనన్న కాలనీ పక్కనే ఈ ఆక్రమణ పర్వం కొనసాగడం గమనార్హం. పాతసింగరాయకొండ పరిధిలో వైకాపా నేతలు చెలరేగిపోతున్నారు. స్థానిక సింగర చెరువు సమీపంలోని



104 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిపై కన్నేసి దశలవారీగా స్వాహా చేశారు. ఇక్కడ మొత్తం 90 ఎకరాలుండగా, అందులో 40 ఎకరాలు జగనన్న కాలనీకి, మరో పదెకరాలు విశ్రాంత సైనికోద్యోగులకు కేటాయించారు. మిగిలిన 40 ఎకరాలను కొందరు వైకాపా నేతలు యథేచ్ఛగా ఆక్రమించి సుమారు 20 అడుగుల లోతున గుంతలు తవ్వి మట్టి తరలించి సొమ్ము చేసుకోవడమే కాకుండా పండ్ల తోటలు సాగు చేశారు. ఈ భూములు వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తూర్పు భాగాన ఉండగా, ఇక్కడ ఎకరా రూ.10 లక్షలకు పైగా పలుకుతోంది. దీని ప్రకారం ఆక్రమిత భూముల విలువ రూ.4 కోట్లపైమాటే. ఈ విషయమై తహసీల్దారు రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించినవారికి ఇప్పటికే నోటీసులిచ్చామని, త్వరలో వారిపై చట్టపమైన చర్యలు తీసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

# మహమ్మారి మాటేసింది



తిరుపతి : జిల్లాను క్యాన్సర్ వణికిస్తోంది. దురలవాట్లు.. పర్యావరణ కాలుష్య కారకాలు.. రసాయనాల వాడకమే ఇందుకు కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆదిలోనే ఈ వ్యాధిని గుర్తించగలిగితే బయటపడొచ్చని అంటున్నారు. జిల్లాలో క్యాన్సర్ పరిస్థితులపై కథనం 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర క్యాన్సర్ కేర్ ప్రాజెక్ట్' (ఏపీసీసీసీ) పేరిట 2024 ఫిబ్రవరి 4వ తేదీన ప్రభుత్వం మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ పర్యవేక్షణలో రెండు పింకు బస్సుల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది.

**బీఐవోతో నాణ్యమైన వైద్యం**

క్యాన్సర్ వైద్య సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ (బీఐవో) ఏర్పాటుకు స్విమ్స్ శ్రీకారం చుట్టింది. ఏడంతస్తుల భవనంతోపాటు బంకర్ బిల్డింగ్ నిర్మిస్తున్నారు. భవన నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. సుమారు రూ.250 కోట్లతో ఈ భవనాలను నిర్మించారు. 2018 – 2024 వరకు స్విమ్స్ ఆధ్వర్యంలో సుమారు 13 వేల మందికి స్క్రీనింగ్ జరిపారు.

**స్విమ్స్, సీకార్లో సేవలు..**

ముందస్తుగా క్యాన్సర్ వ్యాధి గుర్తింపు.. చికిత్స నిమిత్తం స్విమ్స్, సీకార్ ఆస్పత్రులు సేవలందిస్తున్నాయి. స్విమ్స్లో సర్జికల్, మెడికల్, రేడియేషన్ అంకాలజీ ఓపీ సేవలు.. 208 పడకల సామర్థ్యంతో ఐపీ సేవలు అందుతున్నాయి. అందులో నోటి క్యాన్సర్ బాధితులు 50 శాతం ఉండగా.. రొమ్ము క్యాన్సర్ బారిన పడిన వారు 21 శాతం, ముఖద్వారా గర్భాశయ క్యాన్సర్కు గురైన వారు 29 శాతం ఉన్నట్లు బయటపడింది. డీఎంహెచ్ఓ నిర్ణయించిన పీహెచ్సీ, సచివాలయాలకు సంబంధిత తేదీల్లో పింక్ బస్సులను తీసుకెళ్లి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. సుమారు 50 – 100 మంది పరీక్షలు చేసుకునే అర్హత ఉన్నవారు బృందంగా ఏర్పడి స్విమ్స్ సంచాలకులను వినతి సమర్పిస్తే గ్రామాలకే వచ్చి ఉచితంగా పరీక్షలు చేసి వైద్య సలహాలు అందిస్తారు. సీకార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి రోగులను ఎంపిక చేసుకుని అలిపిరి రోడ్డులోని హాస్పిటల్లో చికిత్స అందిస్తారు.

**స్క్రీనింగ్ పరీక్షలు ఇలా..**

ఇప్పటివరకు 730 స్క్రీనింగ్ క్యాంపుల ద్వారా 42,609 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు.

40 ఏళ్ల పైబడిన మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు.

35 ఏళ్ల పైబడిన మహిళలకు ముఖద్వార గర్భాశయ క్యాన్సర్ గుర్తింపు కొరకు పాప్సిమేర్ పరీక్షలు చేశారు.

మహిళలు, పురుషులందరికీ వయసుతో సంబంధం లేకుండా నోటి క్యాన్సర్ లక్షణాలను పరిశీలించారు.

జిల్లాలో స్క్రీనింగ్ పరీక్షల ద్వారా 0.6 శాతం మంది క్యాన్సర్ బారిన పడినట్లు తేలింది.

# అక్కరకు రాని 'అగ్రి ల్యాబ్'



అనకాపల్లి : అన్నదాతలకు అండగా ఉండాల్సిన అగ్రిల్యాబ్లు అలంకారప్రాయంగా మారాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా అందమైన భవంతులు నిర్మించి మరీ వీటిని ఏర్పాటు చేశారు. పరీక్షలకు అవసరమైన పరికరాలు, రసాయనాలు సమకూర్చలేదు. సిబ్బందిని నియమించలేదు. ఫలితంగా ఇవి ఉండీ ఉపయోగం లేకుండా పోయాయి.

జిల్లాలో ఏటా 85,857 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తారు. ఇందులో 54,493 హెక్టార్లలో వరి.. మిగతా గంటి, మినుము, పెసర, వేరుసెనగ నువ్వులు, కంది వంటి పలు పంటలు సాగు చేస్తుంటారు. రైతులు ఇంటిలో నిల్వ ఉంచిన విత్తనాలతోపాటు తోటి రైతుల వద్ద కొనుగోలు చేసిన, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ విక్రయించే విత్తనాలు ఉపయోగిస్తుంటారు. నకిలీ మొక్కజొన్న, పొద్దుతిరుగుడు విత్తనాల వల్ల జిల్లాలోని రైతులు గతంలో నష్టపోయారు. గత ఖరీఫ్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేసిన వరి విత్తనాల్లో 297 శాంపిల్స్ అనకాపల్లిలో పరీక్ష చేయగా.. వాటిలో 11 నాణ్యత బాగోలేవని గుర్తించారు. దీంతో వాటిని రైతులకు పంపిణీ చేయకుండా తిరిగి విత్తనాభివృద్ధి సంస్థకు పంపేశారు. అగ్రి ల్యాబ్లు సక్రమంగా పనిచేస్తే రైతులకు ఇలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉంటాయి.

**నాలుగు బంద్...**

జిల్లాలో మొత్తం ఏడు అగ్రిల్యాబ్లను నిర్మించారు. జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, చోడవరం, నర్సీపట్నంలో వీటిని ఏర్పాటు చేశారు. సబ్బవరంలో జిల్లాస్థాయి ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఒక్కో ల్యాబ్ నిర్మాణానికి రూ. 70 లక్షల వరకు ఖర్చు చేశారు. ఒక్కో కేంద్రంలో ఒక వ్యవసాయాధికారి, ఇరువులు వ్యవసాయ విస్తరణాధికారులు ఉండాలి. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులను ఇన్ఛార్జిలుగా నియమించారు. సిబ్బంది కొరతతో పరీక్షలు పెద్దగా జరగడం లేదు. దీంతో అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల కేంద్రాలను సబ్బవరానికి తరలించాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గతేడాదిలో వీటిలో పరీక్షలు నిలిపివేశారు. దీనిపై అనకాపల్లి ల్యాబ్ ఇన్ఛార్జి కె.ధనలక్ష్మిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెప్టెంబరు 2 నుంచి పరీక్షలు నిలిపివేశామన్నారు.

అనకాపల్లి ల్యాబ్లో గతేడాది చేసిన విత్తన పరీక్షల ఫలితాలు

మొత్తం పరీక్షలు : 467

రైతు సేవా కేంద్రాల ద్వారా వచ్చినవి: 297

రైతులు నేరుగా తెవచ్చినవి: 55

వ్యాపారులు తెచ్చినవి: 115 మొలకశాతం బాగోలేనివి: 29

# నిధులు గంగపాలు.. నీళ్లు రోడ్డుపాలు



ఎలమంచిలి : ఎలమంచిలి పట్టణంలో రోజురోజుకూ లీకేజీల సమస్య పెరుగుతోంది. ప్రధాన పైపులైన్కి తరచూ రంధ్రాలు పడుతుండటంతో లక్షలాది లీటర్ల నీరు వృథా అవుతోంది. కొన్నిసార్లు రోజుల తరబడి సరఫరా నిలిచిపోతున్న సంఘటనలు ఎదురవుతున్నాయి. తరచూ పగిలిపోతున్న కాలం చెల్లిన పైపులైన్లు.. ఎయిర్వాల్వుల వద్ద లీకులు.. మూతలు లేని కుళాయిలు.. ఇలా కారణాలతో విలువైన తాగునీరు నేలపాలవుతోంది. ఎలమంచిలి మండలంలోని 15 పంచాయతీలతోపాటు మున్సిపాలిటీకి ఎస్.రాయవరం మండలం సోమిదేవపల్లి సమీపంలో వరాహా నది నుంచి నీరు సరఫరా అవుతోంది. నదిలో 7 బోర్లు వేసి వాటి నుంచి భూగర్భ రిజర్వాయర్కు నీటిని పంపిస్తారు. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల దూరం భారీ పైపులైన్ ద్వారా పంపిణీ చేస్తారు. మధ్యలో ఉన్న 15 గ్రామ పంచాయతీల ట్యాంకులకు అందిస్తూ, చివరిగా ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రవరం రిజర్వాయర్కి నీరు చేరుతుంది. ఇక్కడి నుంచి నీటిని మళ్లీ పట్టణంలో ఉన్న 7 రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తారు. వాటి నుంచి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు అందుతుంది. వరాహా నదిలో తోడిన నీరు కుళాయిలకు వచ్చేలోగా 240 పైగానే లీకులున్నాయని అంచనా. ఎలమంచిలి పట్టణం, పరిసర గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ 28 ఏళ్ల కిందట గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం అధికారులు వేయించారు. భూగర్భంలో ఉన్న ఈ పైపులైన్ కాలక్రమంలో బాగా దెబ్బతింది. నీటి ఒత్తిడి పెరిగినప్పుడల్లా ఏదో ఒకచోట పగిలిపోయి జలమంతా వృథాగా పోతోంది.

ఈ పైపులైన్ పొలాల్లో మీదుగా రావడంతో కొన్నిచోట్ల రైతులు వేసవిలో తమ పొలాలకు నీటి కోసం గునపంతో పొడిచి రంధ్రం పెడుతున్నారు. ఎయిర్వాల్వులు మార్చకపోవడం వల్ల నీరు ఫౌంటెన్లా పెల్లుబుకుతోంది. ఈ పైపులైన్ మార్చాలని చాలాకాలంగా అధికారులు అనుకుంటున్నా నిధులు లేక పాతదానితోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. ప్రధాన పైపులైన్లు పగిలిపోయినప్పుడల్లా అధికారులు రేయింబవళ్లు కుస్తీపట్టి మరమ్మతులు చేయాల్సి వస్తోంది.

ఎలమంచిలిలో రిజర్వాయర్లు : 7

ప్రతి రోజు సరఫరా అయ్యే తాగునీరు: 35 లక్షల లీటర్లు

రోజుకు వృథా అయ్యే నీరు : 2 లక్షల లీటర్లు

మున్సిపాలిటీలో కుళాయి కనెక్షన్లు 653

త్వరలో కొత్త పథకం నిర్మాణం పనులు: పాత పథకం పాడై లీకులు అవుతున్నాయి. పురప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించడానికి రూ.103 కోట్లతో కొత్త రక్షిత మంచి నీటి పథకం పనులు తొందలో ప్రారంభం అవుతాయి. అప్పుడు పాత రక్షిత మంచినీటి పథకంతో పని ఉండదు. అన్ని కొత్త పైపులైన్లు ఉంటాయి. అందువల్ల లీకుల సమస్య ఉండదు.

ప్రసాదరాజు ఎలమంచిలి కమిషనర్

## ఘనులు తీసిన గుంతలు

బనగానపల్లి : అనుమతులు లేకున్నా నాపరాతి గనులు అక్రమంగా తవ్వకాలు జరుపుతూ.. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి, పగలూ ఖనిజ సంపదను అక్రమార్కులు దోచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, గడివేముల, నందికొట్కూరు, డోన్ మండలాల్లో నాపరాళ్లు, తెల్లరాయి, రోడ్డు మెటల్ గనులు విస్తరించి ఉన్నాయి. ఆర్అండ్బీ, పంచాయతీ రహదారులనూ వదలకుండా కొల్లగొడుతున్నారు. రాయల్టీ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. సదరు సంస్థకు రాయల్టీ తీసుకొనే అధికారమే ఉంటుంది.. తప్పు ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారో పట్టించుకోరు. గనుల శాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో 'ఘనులు' రెచ్చిపోతున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లీజులు తీసుకున్నది కొంతైతే చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ అనధికారికంగా తవ్వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గనుల లీజులు సుమారు 1,150 హెక్టార్లలో ఉన్నాయి. బనగానపల్లి ప్రాంతంలో 950 హెక్టార్లలో గనులుండగా.. 550 మంది వరకు లీజుదారులున్నారు. లీజు తీసుకున్న యజమాని ఒక్కో హెక్టారుకు ఏడాదికి డెట్రెంట్ కింద రూ.2.50లక్షలు వరకు చెల్లించాలి. ఏటా గనుల శాఖకు రూ.300కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. అక్రమ



తవ్వకాలతో ఏటా రూ.5కోట్లకు పైగా ఆదాయానికి గండి పడుతున్నట్లు అంచనా.

**రహదారుల పక్కనే**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్అండ్బీ రోడ్లు, పంచాయతీ రహదారుల సమీపంలో 100 మీటర్లు వదిలి తవ్వకాలు సాగించాలి. అయితే 10 మీటర్లు వదలకుండా రోడ్ల వద్ద తవ్వకాలు సాగిస్తున్నారు. బనగానపల్లి– పలుకూరు మార్గంలో దేవనగర్ వద్ద రహదారి వద్ద 10 మీటర్లు వదలకుండా గనుల తవ్వకాలు సాగిస్తున్నారు. పలుకూరు– రామకృష్ణాపురం రహదారిలో ఇదే పరిస్థితి నెలకొంది.

పాతపాడు– కటికవానికుంట, ఫత్తేనగర్ మార్గాలను పూర్తిగా తవ్వేశారు. కొలిమిగుండ్ల మండలం బెలుం, అంకిరెడ్డి గ్రామాల శివారు ప్రాంతాలు, నంద్యాల, తాడిపత్రి వెళ్లే రహదారిని పూర్తిగా తోడేశారు. "నిబంధనలు అతిక్రమించి చేసే తవ్వకాలపై చాలా వరకు దాడులు చేసి నిలిపేస్తున్నామని, అనధికార ప్రదేశాల్లో తవ్వకాలు సాగించే వారిపై కేసులు నమోదు చేస్తామని" గనులశాఖ ఏడీ రాజగోపాల్ తెలిపారు.

మొత్తం లీజులు: 1150 హెక్టార్లు

ప్రభుత్వ ఆదాయం (ఏడాదికి): రూ.300 కోట్లు

అక్రమ తవ్వకాలు కొనసాగేవి: 200 హెక్టార్లు

ప్రభుత్వానికి నష్టం (ఏటా): రూ.5 కోట్లుకు పైగా

## సూక్ష్మ సేద్యం.. ఇంటి నుంచే చేద్దాం!

ఒంగోలు : సూక్ష్మ సేద్యంలో నూతన విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. పంట పొలాల్లో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఏర్పాటు చేసుకున్న రైతులు ఇకపై అక్కడ రేయింబవళ్లు నిరీక్షించాల్సిన పనిలేదు. వారి మొబైల్ ఫోన్ నుంచే నీటి తడులు పెట్టుకొనే నూతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఉన్న డ్రిప్ పరికరాలతోపాటు, ఇకపై కొత్తగా మంజూరు చేసే సూక్ష్మసేద్యానికి ఈ కొత్త విధానం అమలు చేయనున్నారు. రైతులు ఆమోదం మేరకు రాయితీపై ఆటోమేషన్ పరికరాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ఏపీఎంఐపీ నుంచి ఉత్తర్వులు ఇచ్చారు. ఇటీవల జరిగిన గణతంత్ర వేడుకల్లో ఈ విధానాన్ని ప్రదర్శించగా కలెక్టర్, ప్రజాప్రతినిధులు సందర్శించారు.

**ప్రస్తుత విధానంలో సమస్యలివీ..**

బోరువెల్స్ ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇస్తున్నారు. రాయలసీమ కరవు జిల్లాల్లో ప్రకాశాన్ని కూడా చేర్చడం వల్ల రాయితీలు ఇతోధికంగా పెరిగాయి. పాత విధానంలో రైతులు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. మొక్కలకు డ్రిప్ లైన్ ఏర్పాటు చేశాక పొలం పూర్తిగా తడిసే వరకు నిరీక్షించాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో నీరు అధికంగా భూమిలోకి ఇంకి తడి వల్ల పంటలకు చీడపీడలు ఆశించేవి. అంతేకాక వాల్వుల వద్ద రిపేర్లు రావడం,



విడతల వారీగా పొలాలకు నీరు పెట్టడం, మోటార్ ఆన్ ఆఫ్ సమస్య రైతులకు ఇబ్బందిగా మారేది. వీటి పరిష్కారానికి ఆటోమేషన్ విధానం ప్రవేశపెట్టారు.

**శ్రమ, సమయం ఆదా..**

కొత్త విధానంలో నీటి వృథాను తగ్గించి ప్రతి నీటిబొట్టును సమర్థవంతంగా వినియోగించవచ్చు. సరైన సమయంలో నీరు, ఎరువులు అందించి అధిక దిగుబడి సాధించవచ్చు. నీటి పారుదల వ్యవస్థను రిమోట్తో నియంత్రించడం ద్వారా శ్రమ, సమయం ఆదా అవుతాయి. ఉదాహరణకు రైతు వైజాగ్లో ఉన్నా కూడా తమ మొబైల్ ద్వారా బోర్వెల్ మోటార్ ఆన్ ఆఫ్ చేసుకోవచ్చు. ఈ పరికరం ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 55 శాతం రాయితీ కల్పించారు. ప్రాజెక్టు వ్యయం హెక్టారుకు రూ.40 వేలు కాగా దానిలో గరిష్ఠంగా రూ.22 వేలు రాయితీ లభిస్తుంది. ఇతర రైతులకు గరిష్ఠంగా రూ.18 వేలు సబ్సిడీ ఇస్తారు.

**రైతులు దరఖాస్తు చేసుకోవాలి..** 2002 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 1,09,710 హెక్టార్లలో 92 వేల మంది రైతులకు డ్రిప్ పరికరాలు అందజేశారు. వాటిలో ఆటోమేషన్ పరికరాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నా. దీనిపై అవగాహనకు త్వరలో వర్క్షాపు నిర్వహిస్తాం. అవసరమైన పత్రాలతో రైతులు దరఖాస్తు చేసుకోవాలి. సీహెచ్ శ్రీనివాసులు, ఏపీఎంఐపీ, జిల్లా ప్రాజెక్టు అధికారి

చరకలు



# బాబోయ్.. క్వారీ లారీ!

అనకాపల్లి: జిల్లాలో క్వారీ లారీలు మృత్యుశకటాల్లా తయారయ్యాయి. అతివేగం.. అజాగ్రత్త.. మితిమీరిన లోడు.. ఇలా ప్రతి విషయంలోనూ నిబంధనలు గాల్లో కలిపేస్తూ రహదారులపై పరుగులు తీస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్త అన్న మాటే వీరిదగ్గర వినిపించదు. అడపాదడపా తప్ప అధికారులు వీటి జోలికెళ్లకపోవడంతో నిర్వాహకులదే ఇష్టారాజ్యంగా మారుతోంది. బండరాళ్ల లారీల మూలంగా ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నా రవాణా, మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు కొరడా ఝుళిపించడం లేదు. జిల్లా కేంద్రానికే అధికారులు పరిమితం అవ్వడంతో.. అన్ని ప్రధాన రహదారుల్లో క్వారీ లారీలు వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మునగపాక గ్రామానికి చెందిన కన్నారావు(56) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న భారీ లారీ ఢీకొట్టి.. అతడిపై నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాద దృశ్యం సీసీ కెమెరాలో నమోదవ్వగా.. క్వారీలారీ బీభత్సం అందరినీ భయాందోళనకు గురిచేసింది.

నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన శ్రీనివాసరావు గ్రామ శివారులోని శివాలయానికి భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. కొబ్బరికాయ మరిచిపోవడంతో తిరిగి చెట్టుపల్లి బైక్‌పై వస్తుండగా నర్సీపట్నం నుంచి రోలుగుంట వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

కొన్నాళ్ల క్రితం రాంబిల్లి శివారు ప్రాంతానికి చెందిన ఈరుగుల కృష్ణ అచ్యుతాపురం వైపు వెళ్తున్నాడు. జంగాలపాలెం వద్ద క్వారీ నుంచి బండరాళ్లతో వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయన కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జిల్లాలోని ఎలమంచిలి, అనకాపల్లి, రావికమతం, రోలుగుంట మండలాల్లో రాతి క్వారీలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ నుంచి భారీ బండరాళ్లతో ప్రత్యామ్నాయ నావికా స్థావరానికి (ఎన్ఏఓబీ) వెళుతుంటాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా అచ్యుతాపురం, రాంబిల్లి మీదుగా అధిక వేగంతో రాకపోకలు సాగిస్తున్నాయి. ఆయా మార్గాలు సింగిల్ లైన్ కావడం.. క్వారీ లారీలు అధికవేగంతో రయ్‌రయ్‌మంటూ



దూసుకెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 30 టన్నుల బరువుగల వాహనాలు తిరిగేందుకు వీలుగా రోడ్లు వేశారు. వాస్తవానికి టిప్పర్ 25 టన్నుల బండరాళ్లను మాత్రమే తీసుకెళ్లాలి. కానీ 40 నుంచి 50 టన్నుల లోడుతో ఇరుకు రోడ్లు, గ్రామాల మధ్య నుంచి భారీ లారీలు వెళుతుండటంతో రహదారులు దారుణంగా తయారవుతున్నాయి. లారీ డ్రైవర్లు గుంతల దగ్గర కూడా వేగం తగ్గించక పోవడంతో.. బండరాళ్లు జారి పడుతున్నాయి. వెనుక వెళ్లే వాహనదారులు త్రుటిలో ప్రమాదాలు తప్పించుకున్న సందర్భాలు కోకొల్లలు.

భారీ వాహనాలతో దుర్ఘటనలిలా
ప్రమాదాలు: 140 మృతులు: 62
క్షతగాత్రులు: 124
క్వారీ వాహనాలపై కట్టిన కేసులు: 910
విధించిన అపరాధరుసుం: రూ. 4.03 కోట్లు
ఇప్పటివరకు వసూలైంది: రూ. 2.5 కోట్లు
కట్టాల్సింది: రూ. 1.8 కోట్లు

# కాల్వలో మన్ను.. మాఫియా కన్ను

నంద్యాల : జిల్లా కేంద్రం నంద్యాల నడిబొడ్డున ఉన్న చామ కాల్వలో మట్టి మాఫియా దూరిపోయింది. పట్టపగలే భారీ యంత్రాలు పెట్టి తోడేస్తున్నారు. ఓ భవన నిర్మాణం కోసం పెద్ద ఎత్తున ఇసుక అవసరం ఉండటంతో అక్రమార్కుల కన్ను చామకాల్వపై పడింది. ఇరిగేషన్ సిబ్బందిని మచ్చిక చేసుకొని తీసుకెళ్తున్నారు. గత మూడు రోజులుగా నిత్యం పది నుంచి పదిహేను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

**పట్టపగలే తోడేస్తున్నారు**

నల్లమల అటవీ ప్రాంతంలో వరద పాలేరు వాగు ద్వారా కలిసి వివిధ గ్రామాల మీదుగా వచ్చి పట్టణ శివార్లలోని ఎస్బీఐ కాలనీలోని చామ కాల్వలో కలుస్తాయి. అక్కడి నుంచి సుమారు 4 కి.మీలు ప్రయాణించి చామకాల్వ వై.జంక్షన్ సమీపంలోని కుందూలో చేరుతాయి.

గత రెండేళ్లుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో చామ కాల్వలో



పెద్ద ఎత్తున ఇసుకతో కూడిన మట్టి మేట వేసింది. నంద్యాల పట్టణంలో సలీంనగర్–హనీఫ్‌నగర్ మధ్యన రెండు కాలనీలను కలుపుతూ నిర్మించిన వంతెన సమీపంలో తవ్వేస్తున్నారు.

**పూడిక తీత పేరుతో**

ప్రస్తుతం పాలేరు వాగు నుంచి వరద రాక ఆగింది..దీంతో అక్రమార్కులు చామకాల్వలో యంత్రాలను దించారు. కాల్వలో ఉన్న ముళ్లపొదలను, కంప చెట్లను తొలగించారు. పేరుకుపోయిన ఇసుక మట్టిని తవ్వి ఒడ్డున నిల్వ చేస్తున్నారు. ట్రాక్టర్లలో పట్టణానికి తరలిస్తున్నారు. చామ కాల్వలో జరుగుతున్న తవ్వకాలకు కేసీ కెనాల్ నుంచి ఎటువంటి అనుమతులు లేవు. కానీ చామ కాల్వలో పూడిక తీత పేరుతో యంత్రాలు లోపలికి దిగాయి. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉందని చెబుతూ ప్రస్తుతం తవ్వకాలు చేస్తున్నారు.

ఇక్కడ దొరికే ఇసుక మట్టి భవన నిర్మాణాల్లో పునాది నింపడానికి వినియోగిస్తున్నారు. కొందరితో ఒప్పందం చేసుకొని తోడేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై సలీంనగర్, హనీఫ్‌నగర్ వాసులు కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు.

# కొండపై పర్యాటకం



పెనుకొండ : పెనుకొండ కొండపై అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.2కోట్లతో పర్యాటకులను ఆకట్టుకునేలా నగరవనం నిర్మిస్తున్నారు. ఇప్పటికే 80శాతం పనులు పూర్తయ్యాయి. వనంలోకి అడవి జంతువులు చొరబడకుండా చుట్టూ కంచె నిర్మించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ముఖద్వార నిర్మాణం చేస్తున్నారు. కొండమీదకు వచ్చే పర్యాటకులు ఆకలి, దప్పులు తీర్చుకోవడానికి నిర్మించిన ఫుడ్‌కోర్ట్ కోసం ఆకర్షించేలా అద్దాల భవంతిని నిర్మించారు. పర్యాటకులు, చిన్నారులు ఆహ్లాదంగా గడపడానికి వనంలో ఆకర్షణీయమై జారుడు బల్ల, ఉయ్యాలలు, ఇతర ఆట పరికరాలను అమర్చారు. వీటితో పాటు వివిధ రకాల పక్షుల పెంపకం కోసం షెడ్లు నిర్మించారు. వీటితో పాటు అతిథి గృహం నిర్మించారు.

**సౌర వెలుగులు..**

పట్టణంలోని మారుతీనగర్ కూడలి నుంచి కొండమీద వరకు 6కిలోమీటర్లు మేర రెండు వరసల ఘాట్‌రోడ్డు నిర్మించారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం లేకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారింది. రెండేళ్లుగా కొండమీద ఇస్కాన్ పనులు జరుగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న నగరవనాకి విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో అటవీశాఖ సౌర ఫలకలు ఏర్పాటు చేశారు. వనంలో రాత్రులు సౌరవెలుగులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

**పనులు పూర్తవ్వగానే ప్రారంభిస్తాం**

కొండ మీద నగరవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొండ కింది భాగంలో చెక్‌పోస్టు నిర్మాణం జరుగుతోంది. కొండ మీదకు వెళ్లే వాహనాలకు, కొండపై నగరవనంలోకి పర్యాటకులకు ప్రవేశ రుసుం వసూలు చేసే విధంగా చర్యలు చేపడతున్నాం. త్వరలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తాం.

ఈ.జె.శ్రీనివాసులురెడ్డి, ఎఫ్ఆర్వో, పెనుకొండ

# శిథిల నీడలు వీడాలి.. ఆధునిక హంగులు రావాలి..



అనంతపురం : ప్రజా రవాణాశాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని ప్రయాణ ప్రాంగణాల్లో సౌకర్యాలకు పెద్దపీట వేస్తున్నారు. వైకాపా హయాంలో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆర్టీసీ అధికారులు నివేదించినా అవన్నీ బుట్టదాఖలు అయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రాంగణాలను తీర్చిదిద్దుతున్నారు.

**గుత్తి, రాయదుర్గంలో కొత్తగా..**గుత్తిలో కొత్తగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి జనవరి 31న శంకుస్థాపన చేశారు. రూ.6 కోట్లు వెచ్చించి 15 ప్లాట్‌ఫాంలను నిర్మించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. రాయదుర్గంలో బస్టాండ్‌ను మరింత విస్తరించడానికి రూ.50 లక్షల నిధులతో పనులు సాగుతున్నాయి.

**3 దశాబ్దాల తర్వాత..**

అనంతపురంలో రీజినల్ మేనేజరు కార్యాలయం 1994లో ఏర్పాటయింది. అప్పటి నుంచి సొంత భవనం లేదు. ఉమ్మడి జిల్లాకు ఈ కార్యాలయమే పెద్ద దిక్కు. కొన్నేళ్లపాటు అద్దె భవనంలో ఉండేది. ఆ తర్వాత పాత ఆర్టీసీ బస్టాండ్‌ను మరమ్మతులు చేసి ఆర్ఎం కార్యాలయంగా వాడుకుంటున్నారు. ఇది శిథిలమై సన్‌సైడ్ పడి సిమెంటు పలకలు కిటికీల నుంచి కార్యాలయంలోకి గతంలో పడ్డాయి. రాత్రి వేళ కావడంతో ప్రమాదం తప్పింది. కార్యాలయం పెచ్చులూడి కడ్డీలు తేలాయి. ఉద్యోగులు ఎప్పుడు కూలుతుందో అని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ నాగరాజు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.1.60 కోట్లతో టెండర్లు పూర్తి అయ్యాయి. అనంతపురం ప్రయాణ ప్రాంగణం పైభాగాన కార్యాలయం నిర్మించనున్నారు.

# ఆ ట్రాక్టర్లు ఎక్కడున్నాయ్..!



పలమనేరు :పలమనేరు డీసీసీ బ్యాంకు ఆవరణలో రైతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్ ఉండేది. ఇప్పుడు ఆ ట్రాక్టర్ కనిపించకపోగా.. చెట్ల పొదల్లో ఇనుప గొర్రు మాత్రం దర్శనమిస్తోంది. ట్రాక్టర్ ఎక్కడని అధికారులను ప్రశ్నించినా సమాధానం చెప్పేవారు కరవయ్యారు. రైతుల సౌకర్యార్థం... జిల్లాలోని ప్రతి సింగిల్ విండో పరిధిలో ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. వాహనం అవసరం ఉన్న రైతులు డీజిల్ పోసుకుని వినియోగించుకునేవారు. పనులు పూర్తయిన తర్వాత ట్రాక్టర్‌ను సింగిల్ విండో కార్యాలయంలో ఉంచేవారు. నేడు ఆ ట్రాక్టర్లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి.

**అడ్డదిడ్డంగా నడిపి**

ట్రాక్టరు తీసుకెళ్లిన వారు అడ్డదిడ్డంగా నడపడంతో వాహనాలు చాలా చోట్ల మరమ్మతుకు గురయ్యాయి. ఒకటి రెండు సంవత్సరాల కాలంలోనే అవి పాడవడం ప్రారంభమయ్యాయి. అలా కొంత కాలం గడిచిన తర్వాత ఏమైందో ఏమో వాహనాలు కనిపించకుండా పోయాయి. ఇప్పుడు దాని గురించి అడిగినా అధికారులు చెప్పడం లేదు.

**మూలకు చేర్చి.. మాయం చేసి**

2018లో తెదేపా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ప్రతి సింగిల్ విండో కార్యాలయానికి ఉచితంగా ఒక ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. ఒక్కోటి రూ.10 లక్షలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసింది. దాన్ని విండో కార్యాలయం వద్ద ఉంచుకుని అందులో సభ్యులుగా ఉన్న రైతులు వినియోగించుకునేవారు. విండో అధ్యక్షులు వాహనాన్ని తమ ఇంటి వద్ద ఉంచుకుని అవసరమైన వారికి పంపేవారు. ఇలా కొంతకాలం సాగిన తర్వాత చిన్న చిన్న మరమ్మతులు రావడంతో బాగు చేయడానికి సొమ్ములు ఏ ఖాతా నుంచి ఖర్చు చేయాలనే సందేహంతో అలా మూలకు చేర్చారు. మరికొన్ని చోట్ల పొలం దున్నే మడకలు మాత్రం కనిపిస్తున్నాయి..

# సంస్కరణల బాట.. సమస్యలకు టాటా


చిత్తూరు : కూటమి ప్రభుత్వం ఏపీఎస్పీడీఎల్‌లో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యుత్తు వినియోగదారులకు సత్వర సేవలందించడమే లక్ష్యంగా సీఎండీ శివశంకర్ 'కరెంటోళ్ల జనబాట', 'డయల్ యువర్ సీఎండీ', 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికారులు, ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది పల్లెబాట పట్టారు. విద్యుత్తు సమస్యలకు సత్వర పరిష్కారం లభించడంతో పాటు విద్యుత్తు లైన్ల పర్యవేక్షణతో నియంత్రికల దగ్ధం, సరఫరాలో అంతరాయాలు తగ్గాయి.

**490 నియంత్రికలే దగ్ధం**

వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం మరింతగా పెరిగింది. గత ఏడాది డిసెంబరులో ఎన్నడూ లేనంతగా 700 నియంత్రికలు దగ్ధం కాగా.. జనవరిలో ఈ సంఖ్య 490కే పరిమితమైంది. చిత్తూరు నియంత్రికల మరమ్మతు కేంద్రం పరిధిలో 280, కార్వేటినగరం పరిధిలో 90, పలమనేరు పరిధిలో 120 నియంత్రికలు దగ్ధమయ్యాయి.

**దృష్టి సారించడంతోనే..**

ఐదేళ్ల వైకాపా పాలనలో ఏపీఎస్పీడీసీఎల్‌ను నాటి పాలకుల నుంచి అధికారుల వరకు ఇష్టానుసారంగా దోచుకోవడమే తప్ప.. సంస్థ బాగోగులు, వినియోగదారుల నుంచి పట్టించుకోకపోవడంతో..ప్రజలకు సేవలందకపోగా సంస్థ ఆర్థికంగా నష్టపోయింది. కూటమి పలు సంస్కరణలు తీసుకురావడం, సీఎండీ, ఉ



న్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపడం వల్ల సత్ఫలితాలు లభిస్తున్నాయి. అధిక లోడు క్రమబద్ధీకరించడం, నియంత్రికలు, లైన్లు నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.

**తక్షణమే అందజేస్తున్నాం**

దగ్ధమైన నియంత్రికలు కేంద్రానికి రాగానే తక్షణమే వినియోగదారులకు అందజేస్తున్నాం. ప్రస్తుతం మరమ్మతు కేంద్రాల్లో 450 నియంత్రికలు అందుబాటులో ఉన్నాయి. నియంత్రికల దగ్ధాన్ని మరింత తగ్గిస్తాం.

ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ, జిల్లా విద్యుత్తు శాఖ

జిల్లాలో విద్యుత్తు సర్వీసులు (లక్షల్లో)
మొత్తం : 7.54
గృహాలు : 4.98
వ్యవసాయం : 1.98

# కష్టాల ప్రయాణం

నందికొట్కూరు : మహాశివరాత్రి వచ్చేస్తోంది.. శ్రీశైల మల్లన్న క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది.. శివస్వాములు, సామాన్య భక్తజనం భారీగా తరలిరానున్నారు.. ఈసారి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 402 బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా బస్సులన్నీ నందికొట్కూరు, ఆత్మకూరు, సున్నిపెంట మీదుగా శ్రీశైలం వెళ్తాయి. బస్టాండ్లలో విపరీతమైన రద్దీ ఉంటుంది. ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది.

**సున్నిపెంటలా మారింది**

శ్రీశైలానికి వచ్చే ప్రతి ఆర్టీసీ బస్సు సున్నిపెంటకు వచ్చి వెళ్లాలి. ఆర్టీసీ బస్టాండ్‌లో స్వీపర్ లేకపోవడంతో ప్రాంగణం దారుణంగా ఉంది. మంచినీటి సౌకర్యం లేదు. ఆటోలు, జీపులు అడ్డంగా పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ కెమెరాలు లేవు. శ్రీశైలానికి నిత్యం దాదాపు 4 వేల మంది వెళ్తుంటారు. విజయవాడ నుంచి 44, కర్నూలు 25, ప్రకాశం 40, ఇతర ప్రాంతాలకు 10 బస్సులు, తెలంగాణ బస్సులు 70 వరకు వస్తుంటాయి. ప్రాంగణంలో శుభ్రం చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



**సరిపడా కుర్చీలు లేక**

నందికొట్కూరు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికులు కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేవు. తాగేందుకు మంచి నీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఫ్యాన్లు ఉన్నా వినియోగించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

**రద్దీతోపాటు ఇబ్బందులూ ఎక్కువే**

కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి శ్రీశైలం వెళ్లే ప్రతి బస్సూ ఆత్మకూరు బస్టాండు మీదుగా వెళ్లాల్సిందే. ఇక్కడ ప్రయాణికులకు తాగునీరు, శౌచాలయాలకు ఇబ్బందులు తప్పేలా లేవు. పాత మూత్రశాలను మూసివేయడంతో స్వచ్ఛభారత్ మూత్రశాలను ఆశ్రయిస్తున్నారు.

ప్రయాణ ప్రాంగణంలో సీసీ కెమెరాలు లేవు. బస్టాండులో ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. దీంతో బస్సులు వెనక్కి తిప్పడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఆత్మకూరు డిపో నుంచి శివరాత్రి సందర్భంగా 50 బస్సులు కేటాయించారు. స్త్రీశక్తి బస్సు పథకం వల్ల ఈ బస్సులు సరిపోయే అవకాశం లేదు.

**శ్రీశైలంలో ఇరుకుగా..**

శ్రీశైలం బస్టాండు నుంచి రోజూ సుమారు 200 బస్సులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాయి. బ్రహ్మోత్సవాల సమయంలో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. కానీ ఇక్కడి బస్టాండులో కేవలం 7 ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండటంతో బస్సులు నిలపడానికి తరచూ డ్రైవర్లు గొడవపడుతుంటారు.

ఇక్కడ నేరస్థులు, దొంగల తాకిడి ఎక్కువ. 2 సీసీ కెమెరాలు మాత్రమే ఉన్నాయి. అవీ మసకబారాయి.

దుకాణాల్లో తినుబండారాలు, నీళ్ల సీసాల ధరలను ప్రదర్శించడం లేదు. ఆర్టీసీ అధికారులు తనిఖీ చేసి అధిక ధరలను అదుపు చేయాల్సి ఉండగా, పట్టించుకోవడం లేదు.

బస్టాండ్ చిన్నది కావడంతో ప్రయాణికులు వేచి ఉండటానికి పూర్తి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

# మోగనున్న గుడి గంటలు

కర్నూలు : గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికత.. భక్తిభావం పెంపొందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) నిత్యం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా శ్రీవాణి భజన మండపం పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నూతన ఆలయాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో స్థలం కేటాయిస్తే ఆలయానికి అవసరమైన నిధులను తితిదే మంజూరు చేస్తుంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకారుల కాలనీల్లో నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తారు. స్థల విస్తీర్ణానికి అనుగుణంగా శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.10–20 లక్షల వరకు నిధులు విడుదలవుతాయి.

**24 ప్రాంతాల్లో నిర్మించేలా..**

కర్నూలు జిల్లాలో 10 ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందులో పత్తికొండ మండలం హోసూరు, ఆస్పరి మండలం కారుమంచి, ములుగుందం, గోనెగండ్ల మండలం ఎర్రబాడు, కోసిగి మండలం అగసనూరు, సాతనూరు, పెద్దకడబూరు మండలం కంబాలదిన్నె, పీకలబెట్ట, కౌతాళం మండలం ఉంగలదిన్నె, మంత్రాలయం మండలం రాంపురం గ్రామాలున్నాయి. నంద్యాల జిల్లాలో 14 ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాలకుగాను ప్రతిపాదించారు.

**ఒకే నమూనాలో..**గ్రామంలో ఆలయ నిర్మాణానికి స్థలం ఉన్నట్లు రెవెన్యూ అధికారి ధ్రువీకరించిన పత్రం ఉండాలి. నూతన ఆలయానికి ఏర్పాటుచేసు



కున్న కమిటీ తీర్మానం అవసరం ఉంటుంది. కమిటీ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతా తెరవాలి.రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలన్నింటినీ ఒకే నమూనాలో నిర్మించనున్నారు. కేటాయించిన స్థలంలో గర్భాలయం, విమాన గోపురం, మండప నిర్మాణం చేపడతారు. గర్భగుడిలో మూలవిరాట్టు ఏర్పాటు, ప్రహరీ, ఇతర నిర్మాణాలకు అవసరమైన నిధులు మరో విడతలో కేటాయించనున్నారు. మంజూరు చేసిన నిధులు తక్కువైతే అదనంగా విడుదల చేసే అవకాశముంటుంది.

**స్థలాలిచ్చేందుకు ముందుకు రావాలి**

– సుధాకర్‌రెడ్డి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్

శ్రీవాణి భజన మండపం పథకం కింద ఆలయాన్ని నిర్మించే స్థలాన్ని ఇరువురు ఏఈలతోపాటు దేవాదాయశాఖ ఉద్యోగి పరిశీలిస్తారు. అన్ని సరిగా ఉన్నాయని ధ్రువీకరించిన తర్వాత ప్రభుత్వానికి పంపుతాం. కర్నూలు జిల్లాలో 21 గ్రామాల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి.. అందులో 10 గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించాం. గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆలయాల నిర్మాణాలకు స్థలం ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలి.

# మట్టిని తినేస్తున్నారు



తాడిపత్రి : తాడిపత్రి నియోజకవర్గంలో మట్టి బకాసురులు చెలరేగిపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాత్రింబవళు సాగిన దందాతో కొండలు, గుట్టలు కనుమరుగయ్యాయి. కూటమి ప్రభుత్వంలోనూ వారి ఆగడాలు సాగుతూనే ఉన్నాయి. రాత్రివేళలో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తరలించి సొమ్ము చేసుకొని జేబులు నింపుకొంటున్నారు. పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామంలో సర్వే నంబరు 1281లో ఉన్న ప్రభుత్వ భూమిలోని కొండను తవ్వేసి నల్ల, ఎర్రమట్టిని అనుమతి లేకుండా తరలించారు. ఈక్రమంలో కొండ పైనున్న పచ్చని చెట్లను పెకిలించి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

**ట్రాక్టర్లతో డంప్.. టిప్పర్లకు లోడ్**

గ్రామంలోని కొండపైకి వెళ్లేందుకు దారి ఇరుగ్గా ఉండడంతో పొక్లెయిన్లు వినియోగించి, ట్రాక్టర్లతో మట్టిని తరలించి ఓ ప్రాంతంలో మట్టిని డంప్ చేశారు. అనంతరం టిప్పర్లలో మట్టిని నింపి తరలించి విక్రయిస్తున్నారు. ఎవరైనా అడిగితే కొందరు రైతుల పేర్లు అడ్డుపెట్టుకొని దోచేస్తున్నారు. తవ్విన ఎర్ర, నల్లమట్టిని తాడిపత్రి, యాడికి ప్రాంతాల్లోని ప్రైవేటు లేఅవుట్ల అభివృద్ధికి వినియోగిస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.9వేల నుంచి రూ.10వేలు పలుకుతోంది. రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టి వెళుతోంది. చిన్నయక్కలూరు, శింగనగుంటపల్లి సమీపంలోనూ మట్టి దందా కొనసాగుతోంది.

**కఠినచర్యలు తీసుకుంటాం** –బాలాజీరాజు, తహసీల్దారు, పెద్దపప్పూరు

అనుమతులు లేకుండా ఎర్ర, నల్లమట్టిని తరలిస్తే కఠినచర్యలు తప్పవు. ఎక్కడైతే మట్టిని తవ్వేస్తున్నారో ఆ ప్రాంతాలను గుర్తించి సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచుతాం. దందా నియంత్రణకు శాయశక్తులా కృషి చేస్తాం. అనమతులు లేకుండా మట్టి తరలిస్తూ వాహనాలు పట్టుబడితే క్రిమినల్ కేసులు పెడతాం.

## మంత్రి ఆదేశించినా..! ఆక్రమణలు మామూలే

రాజమహేంద్రవరం : పుష్కరాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రహదారులు, కాలువలను విస్తరించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోడ్ల విస్తరణంలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాలి. ఇందుకుగాను నగరంలో రద్దీగా ఉన్న రహదారులు, వాటి పరిధిలోని ఆక్రమణలు గుర్తించారు. తొలుత మూలగొయ్యి, జాంపేట, ఆజాద్ చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో తొలగించిన చోట మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. ఏకంగా నడకదారుల పై దుకాణాలు, రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ



40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల కూడా కనిపించకపోవడం గమనార్హం. దుకాణాలు రోడ్డుపైకి వస్తే, కొనుగోళ్ల కోసం వచ్చిన వాహనదారుల వాహనాలు రోడ్డు సగం ఆక్రమించేస్తున్నాయి. దీంతో ఉన్న సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, కోరుకొండ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ రోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జాంపేట వద్ద బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలను నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం చూసిచూడనట్టు వదిలేసినట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే మామూళ్లు పిండేస్తున్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

## స్వర్ణ నారావారిపల్లె సాకారమే లక్ష్యంగా

తిరుపతి: చంద్రగిరి మండలంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె ఉన్న కందులవారిపల్లె పంచాయతీతో పాటు ఎ.రంగంపేట, చిన్న రామాపురం పంచాయతీల సమగ్రాభివృద్ధికి అడుగులు పడ్డాయి. గతేడాది జులై నాటికే అన్ని గృహాలకు సౌర విద్యుత్తు కనెక్షన్లు అమర్చగా.. ఇప్పుడు ఈ మూడు పంచాయతీల్లోని 2,161 గృహాల్లోను గ్యాస్, కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. గతేడాది సంక్రాంతికి సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా సొంతూరికి వచ్చినప్పుడు 'స్వర్ణ నారావారిపల్లె' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించి ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది.

**పాడిరైతులకు రూ.4.6 కోట్ల లబ్ధి..**

2024 జూన్ నాటికి మూడు పంచాయతీల్లో ప్రతిరోజూ 4,246 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుండగా.. ప్రస్తుతం అది 6,236 లీటర్లకు



పెరిగింది. గ్రామాల్లో 100 శాతం చెత్త సేకరణ, వ్యర్థాల విభజన చేస్తున్నారు. 1,420 టన్నుల వారసత్వ వ్యర్థాల శుద్ధితో పాటు వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు ఇస్తున్నారు. ఇళ్లలో వినియోగించగా సౌర విద్యుత్తు పోను గ్రిడ్‌కు ప్రతినెలా సగటున 2,54,956 యూనిట్లు సరఫరా చేస్తున్నారు. ఈ-ఆటోలు, ట్యాక్సీల పంపిణీ, టైలరింగ్, కులవృత్తుల ప్రోత్సాహించడం ద్వారా 312 మందికి ఉపాధి కల్పించారు.

**నీటి ఎద్దడి తీరేలా..**

మరోవైపు నేడు సీఎం చంద్రబాబు తిరుపతి నగరం, తిరుమలలో 5 లక్షల మంది తాగునీటి ఎద్దడి తీర్చే పనులకు రూ.126 కోట్లతో శంకుస్థాపన చేయనున్నారు. తద్వారా నారావారిపల్లె సమీప మూలపల్లె చెరువుతో పాటు మరో నాలుగు చెరువులు నిండనున్నాయి. 1,150 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

## కొత్తవలస కొండపై హిల్‌రిసార్ట్స్

భీమిలి : భీమిలి మండలం కొత్తవలస కొండపై 15 ఎకరాల స్థలాన్ని హిల్ రిసార్ట్స్ అభివృద్ధి కోసం పర్యాటక శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.54.45 కోట్ల విలువైన ఈ ప్రభుత్వ స్థలాన్ని పర్యాటక శాఖకు ఉచితంగా అప్పగిస్తున్నట్లు పేర్కొంది. భీమిలిని ఆనుకుని కొత్తవలస కొండపై సర్వే నంబరు 102–2లో 7.70 ఎకరాలు, 103లో 7.30 ఎకరాలు కేటాయించింది. సముద్రానికి అభిముఖంగా ఉన్న ఈ కొండపై రిసార్ట్స్ నిర్మాణంతో పాటు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసేలా పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించింది. గత ప్రభుత్వం ఈ భూమిని పెందుర్తి సమీప చినముషిడివాడ కేంద్రంగా ఉన్న శారదాపీఠానికి కారుచౌకగా అప్పగించింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ స్వామిభక్తిని చాటుకుంటూ వీఎంఆర్‌డీఏ నిధులతో కొండపైకి రహదారులు ఏర్పాటు చేయడం విమర్శలకు దారితీసింది. కొన్ని ధార్మిక సంస్థలు, కొందరు పీఠాధిపతులు, సామాజిక ఉద్యమకారులు నాటి కేటా యింపులను తప్పుపట్టారు. శారదా పీఠానికి అడ్డగోలుగా చేసిన కేటాయింపులను కొన్ని నెలల కిందట కూటమి ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే.

## రంగరంగా.. రక్షించుకోవా!



గుత్తి : ఉమ్మడి జిల్లాలో గుత్తి మండలం తొండపాడు గ్రామంలోని బొలికొండ రంగనాథస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ వందలాది సంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయి. ఏటా జరిగే స్వామి ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. ఇదే అక్రమార్కుల పాలిట వరంగా మారింది. దేవుడి సొమ్మును బొక్కేస్తున్నారు. ఉత్సవాలతో పాటు వివాహాల ద్వారా వచ్చే సొమ్ము దేవుడి ఖాతాలో చేరడంలేదు.

మౌలిక వసతుల కల్పన పేరిట..

ఉత్సవాల్లో వీధిదీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనుల పేరిట పంచాయతీ ఖాతాల్లోని సొమ్మును ప్రజాప్రతినిధులు డ్రా చేస్తుంటారు. గతేడాది ఈ మొత్తంతో చేపట్టే పనులు తామే చేయాలంటే నాయకులు పోటీపడ్డారు. చివరికి పోలీసులు జోక్యం చేసుకుని పంచాయితీ చేశారు. పంచాయతీ పాలకులు రూ.3లక్షల విలువైన, మిగిలిన నాయకులు రూ.2లక్షల విలువైన పనులను చేసుకునేలా తీర్మానం జరిగింది. మరోవైపు ఆలయంలో 30 గదులున్నాయి. వివాహ కార్యక్రమాలకు పెద్ద హాలు ఉంది. పెళ్లి తరఫు వారి నుంచి ఓ నాయకుడు రూ.8వేలు దండుకుంటుండగా, ఒక్కో గదికి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ సొమ్మూ దేవాదాయ శాఖకు చేరడం లేదు. లక్షలాది రూపాయల ఆదాయం అటు పంచాయతీ ఇటు దేవాదాయ శాఖకు అందకపోగా. నాయకుల పెత్తనం, ఆధిపత్య పోరు అ'ధనం'.

**జమ కొంతే.. దిగమింగుడే ఎక్కువ**


స్వామి ఉత్సవాలు ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరుగుతాయి. సుమారు 600 దుకాణాలు ఏర్పాటవుతాయి. మరోవైపు వ్యాపారులు ఊయలలు, రంగులరాట్నాలు అమర్చుతారు. ఒక్క ఊయల వ్యాపారులే రూ.10లక్షల వరకు పాలకులకు ఇస్తారు. పంచాయతీకి నామమాత్ర సొమ్ము దక్కుతోంది. ఒక్కో దుకాణం ఏర్పాటు చేసే స్థలానికి పంచాయతీ అధికారులు గజం చొప్పున నిర్ణీత మొత్తం వసూలు చేస్తారు. ఇందులోనూ నాయకులు వాటాలు పంచకుంటున్నారు. 2023లో రూ.3.90లక్షలు, 2024లో రూ.5లక్షలు, 2025లో రూ.5.10లక్షలు వసూలైనట్లు లెక్కల్లో చూపారు. పంచాయతీ ఖాతాకు కొంత మొత్తమే జమచేసి మిగిలింది జేబులో వేసుకుంటున్నారు. గతేడాది దుకాణాల నిర్వహణకు 5శాతం రుసుం పెంచిన విషయం తెలిసిందే. ఏటా ఉత్సవాల్లో పెద్దఎత్తున సొమ్ము స్వాహా అవుతున్నా పట్టించుకునే నాథులు ఒక్కరూ కనిపించడం లేదు.

**అక్రమాల గురించి తెలియదు**

–నరసింహారెడ్డి, ఈవోఆర్డీ, గుత్తి

ఉత్సవాల సందర్భంగా దుకాణాల ఏర్పాటు దారులతో ఎంత సొమ్ము వసూలు చేస్తున్నారో నాకు తెలియదు. కార్యదర్శులతో మాట్లాడతాను. అక్రమాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటాం.

## కొండల్ని కొల్లగొట్టి.. కాసులు కూడబెట్టి



పుట్టపర్తి : భారీగా తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో ఏడీ మైనింగ్‌శాఖకు లేఖ రాశాం. మరోసారి మాట్లాడి సంయుక్తంగా తనిఖీలు చేస్తామని నల్లమాడ తహసీల్దార్ మనోజ్‌కుమార్ తెలిపారు. కొత్తచెరువు మండలం పెనుకొండ రోడ్డులో నల్లకొండ, పుట్టపర్తి రోడ్డులో పొలిమేరగుండు వద్ద కొండ పోరంబోకు భూముల్లో, ధర్మవరం రోడ్డులో మైలేపల్లి చెరువులో, నాగిరెడ్డిపల్లి సమీపంలో దాసరిపాముగుట్టపై అనుమతి లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు రెండు మూడ్రోజులు హడావుడి చేసి వదిలేశారు.

ముదిగుబ్బలోని బైపాస్ సమీపంలో గత వైకాపా ప్రభుత్వంలో గుట్టలను చదునుచేసి ఆక్రమించిన భూముల్లో ఇప్పుడు మట్టితోలి చదును చేసి ప్లాట్లుగా మార్చారు. కొండ గుట్టల్లో తవ్విన మట్టిని స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి బైపాస్ చివరి వరకు రోడ్డుకిరువైపులా గుట్టలు తవ్వేశారు. చదునుగా ఏర్పడిన ప్రాంతాల్లో ప్లాట్లు వేసుకున్నారు. వీటిపై పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. ల్లాలో సహజసిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయి. ప్రకృతి వనరులను కొందరు కొల్లగొడుతున్నా.. అడ్డుకట్ట పడటం లేదు. పైగా అడ్డుకోవాల్సినవారే అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రాత్రీ పగలు తోడేస్తున్నా..**

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనుల కోసం పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడలో సర్వే నంబరు 1,368లో ఉన్న కొండపై ఒక హెక్టారులో 25 వేల మెట్రిక్ టన్నుల వరకు తవ్వుకోడానికి సదరు గుత్తేదారు సంస్థకు రెవెన్యూ, గనులశాఖ అధికారులు తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. గుత్తేదారు సంస్థ రికార్డుల కోసం అన్నట్లు రాయల్టీ కింద కొంత సొమ్ము చెల్లించింది. హెక్టారు స్థానంలో దాదాపు 50 హెక్టార్లకుపైగా తవ్వకాలు చేశారు. దీనిపై 'అనుమతి గోరంత.. దోపిడీ కొండంత' శీర్షికన గత డిసెంబరు 5న 'కథనం ప్రచురితమైంది. జనసేన నాయకులు రెవెన్యూ, గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఏడీ మైనింగ్‌శాఖను ఆదేశించినా చర్యలు శూన్యం.

## వేమన యదార్థవాదం.. సమాజ జాగృతం

కదిరి : ప్రజాకవి, యోగివేమన యదార్థవాదం.. ప్రజల ఆరాధ్యునిగా పూజింపజేస్తోంది. భోగాలను వదిలి సమాజ రుగ్మతులపై సామాన్యులకు సైతం అర్థమయ్యే పరిభాషలో పద్యాలతో కత్తికట్టారు. తన పాండిత్యంతో పామర జనంలో చెరగని ముద్ర వేసుకున్నారు. దేశాటనతో మూఢనమ్మకాలను ఎత్తిచూపుతూ కదిరి ప్రాంతానికి వచ్చారు. ఈ ప్రాంతంలోనే ఎక్కువ రోజులు ఉండిపోయి కటారుపల్లిలో జీవసమాధి అయ్యారు. వేమన చెప్పిన యదార్థ సత్యాలను హృదయాల్లో ముద్ర వేసుకున్న జనం ఆయన్ను ఆరాధ్యుడిగా పూజిస్తున్నారు. అందుకే ఈ ప్రాంతంలో వేమన పేరు కలిగిన వారు ఎక్కువగా కనిపిస్తారు. యోగివేమన జయంతిని రాష్ట్ర పండగలా జరిపేందుకు ప్రభుత్వం ఈనెల 19న నిర్ణయించటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పద్యాలతో సామాన్యుల్లో చైతన్యంసామాజిక రుగ్మతలు, మూఢనమ్మకాలను ఎండగట్టిన వేమన తన పద్యాలతో సమాజాన్ని జాగృతం చేశారు. అంతరాలు చూపే కులవ్యవస్థ, గుడ్డిగా నమ్మే ఆచార వ్యవహారాలను ఆయన తప్పుబట్టారు. దురాచారాల అడ్డుకట్టకు కటారుపల్లిలోని సమాధి వద్ద వేమన విహారంలో గోడలపై చెక్కిన పద్యాలు అద్దం పడుతున్నాయి.

## దేవుడి మాగాణి.. 'గుత్తా'ధిపత్యం

ఆలూరు : ఆలయ భూములు అక్రమార్కులకు ఆదాయ మార్గాలుగా మారాయి. మాన్యం భూములను స్థానిక నాయకులు గుప్పిట్లో పెట్టుకొని జేబులు నింపుకొంటున్నారు. వారే ఇతరులకు కౌలు(గుత్త)కిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాల పరిధిలో దాదాపు 64.5 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. దేవాదాయ శాఖ అధికారులు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో స్థానిక నాయకులు పెత్తనం చేస్తున్నారు.

**పచ్చని పొలాలపై కన్ను**

హొళగుంద మండలం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయం మండల కేంద్రానికి రెండు కి.మీ. దూరంలో ఉంటుంది. పచ్చని పొలాల మధ్య కోవెల కొలువుదీరి ఉంది. 667(ఏ), 667(బీ) సర్వేనంబర్లలో 33.31 ఎకరాల మాగాణి ఉంది. ఇందులో రెండెకరాల విస్తీర్ణంలో ఆలయం, మండపం ఉంది. మిగిలిన పొలం హొళగుందకు చెందిన కొందరు నేతల చేతుల్లో ఉంది. వారు ఇతరులకు కౌలుకు ఇస్తున్నారు. కౌలుకు తీసుకొన్న వారు పక్కనే ఉన్న తుంగభద్ర దిగువ కాల్వ నుంచి నీటిని తీసుకొంటున్నారు. 90 శాతం మంది వరి సాగు చేస్తున్నారు. నేల సారవంతంగా ఉండటంతో ఎకరాకు 30 నుంచి 40 సంచుల ధాన్యం దిగుబడి వస్తోంది. ఎకరానికి 10 నుంచి 14



సంచుల వడ్లు సదరు నేతకు ఇస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులే ఆయా పొలాలపై అజమాయిషీ చేస్తున్నారు. అగ్రహారం ఆంజనేయస్వామికి చెందిన 33.31 ఎకరాల మాన్యం నుంచి వచ్చే ఆదాయం దేవాదాయశాఖకు చేరడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డబ్బంతా నాయకుల జేబులోకి వెళ్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. చేసేది లేక కొందరు యువకులు విరాళాలు సేకరించి ఆలయ నిర్వహణ చేపడుతున్నారు. పట్టించుకోని దేవాదాయశాఖ

దేవాదాయ శాఖ చట్టం ప్రకారం ఆలయ భూముల కౌలు వేలం పాటలు ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించాలి. ముందస్తుగా సంబంధిత గ్రామాల్లో దండోరా వేయించాలి. పత్రికల్లో ప్రకటనలు, మాన్యం వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలి.. కానీ ఇవేవీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా వేలం నిర్వహిస్తూ గతంలోని కౌలు కన్నా రూ.వందల్లో ఎక్కువ చూపించి పాత వారికే తిరిగి కట్టబెడుతున్నారు. జిల్లా పరిధిలోని 1,856 దేవాలయాల పరిధిలో 43,455 ఎకరాలు ఉండగా అర్చకులు, భజంత్రీ, పల్లకీ సేవకుల పరిధిలో 33,300 ఎకరాలున్నాయి. మిగిలిన భూములు సర్వీస్ ఇనాంగా ఉన్నాయి. 7,600 ఎకరాలకు ఏటా రూ.1.92 కోట్లు కౌలు రూపంలో వస్తుంది.

**ఇక్కడ వారి పరిధిలోనే..**

హొళగుంద మండలంలో మరో మూడు ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో మరో 64.50 ఎకరాల పొలం ఉంది. ఇవన్నీ తుంగభద్ర దిగువ కాల్వ చెంతనే ఉంటాయి. కాల్వ నుంచి పైపుల ద్వారా నీటిని మళ్లించుకొని వరి సాగు చేస్తుంటారు. ఏటా రెండు పంటలు సాగవుతాయి. ఎవరికి వారు ఆయా భూములు తమవే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వందల ఎకరాల భూమి ఉన్నా దేవాదాయ శాఖకు చెందిన అధికారులెవరూ ఇటు వైపు రావడం లేదు. "ఆలయాల భూములు ఎవరుపడితే వారు తమ ఆధీనంలో ఉంచుకొని వాటిని అనుభవిస్తున్నారు. ఇనాం భూములపై వస్తున్న ఆదాయం వారే ఆరగిం చేస్తున్నారు. ఇలాంటి వారిపై దేవాదాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని" రైతు వెంకటేశ్ వాపోయారు.

## ఉచితానికి చెల్లుచీటీ

ఆదోని : ఆదోని పట్టణంలో కొందరు ఉచిత ఇసుకు తూట్లు పొడుస్తున్నారు. పట్టణ శివారులో నిల్వ చేసి విక్రయిస్తున్నారు. ఏకంగా కార్యాలయం తెరిచారు.. వినియోగదారులకు రసీదులు ఇస్తున్నారు. లెక్కల పంపకాల్లో తేడా రాకుండా బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. రీచ్‌ల వద్ద టన్ను ఇసుక రూ.40కి తెచ్చి ఇక్కడ రూ.1200లకు అమ్ముతున్నారు. నిత్యం 40–50 ట్రాక్టర్లు, 5–8 టిప్పర్ల ఇసుక బేరం జరుగుతోంది. నిత్యం రూ.2.50 లక్షల వరకు సొమ్ము చేసుకొంటున్నారు.

తక్కువకు తెచ్చి.. ఎక్కువకు విక్రయం

తుంగభద్ర నదిలో సి.బెళగల్ మండల పరిధిలో ఐదు చోట్ల రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇసుక తీసుకెళు న్నారు. కౌతాళం మండలంలోని గుడికంబాలి, నదిచాగి, మరళి రీచ్‌లకు పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకపోవడంతో తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు. రీచ్‌ల వద్దకు వెళ్లి రూ.40 చెల్లిస్తే టన్ను ఇసుక వస్తుంది. ఒక టిప్పర్‌లో 20 టన్నుల మేర పడుతుంది. అంటే ఒక టిప్పర్ ఇసుక ధర రూ.800, రవాణా కింద మరో రూ.6–7 వేలు చెల్లిస్తే సరిపోతుంది. పట్టణానికి చెందిన ఎవరు కూడా నేరుగా రీచ్‌ల నుంచి తెచ్చుకోవడానికి వీల్లేదు. అందరూ పట్టణంలోని ప్రైవేటు నిల్వ కేంద్రానికి వెళ్లాల్సిందే.

గత నాలుగు నెలల కింద ప్రైవేటు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక ట్రాక్టరు ఇసుకను రూ.3,600కి విక్రయిస్తున్నారు. ఒక దాంట్లో మూడు టన్నులు పడుతుంది.

**నేరుగా తెచ్చుకొంటే బెదిరింపులు**

ప్రస్తుతం పట్టణంలో నిర్మాణాల వేగం పెరిగింది. వినియోగదారులు నేరుగా రీచ్‌ల వద్ద తెచ్చుకొనే పరిస్థితి లేదు. తెచ్చు'కొంటే' అక్రమార్కులు బెదిరింపులకు దిగుతున్నారు. ఆదోని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల రీచ్ వద్ద టిప్పర్ ఇసుక తెచ్చుకొన్నారు. సదరు డ్రైవర్‌ను పోలీసులతో అరెస్టు చెయించారు. నిబంధనల పేరుతో రవాణాశాఖాధికారులతో దాడులు చేయించి ఇబ్బంది పెట్టారు.

పొలాలు, వంకలు, వాగులు తదితర ప్రాంతాల్లో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని ప్రభుత్వ ఆదేశాలున్నా.. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల కార్మికులు వాటి జోలికి వెళ్లకుండా తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారు. ఎవరైనా సాహసం చేసి ఇసుకను తెస్తే ఆ వాహనాన్ని ఏదో ఒక సాకుతో నేరుగా పోలీసు స్టేషన్లో పెట్టిస్తున్నారు.

చురకలు



## ఇదే సందు.. దోచెయ్ ముందు!

అమరావతి :సంక్రాంతి ప్రయాణమంటే ప్రయాణికులకు వెన్నులో వణుకు పుడుతోంది.. సొంతూళ్లకు వచ్చేందుకు ప్రైవేటు ట్రావెల్స్ దెబ్బకు జేబులు ఖాళీ కాగా తిరుగు ప్రయాణంలోనూ దోపిడీ తప్పేలాలేదు. ఆర్టీసీ నుంచి అరకొర సర్వీసులు ఉండడం, పర్యవేక్షణ విషయంలో అధికారులు కాడి వదిలేయడంతో ఈ దుస్థితి కనిపిస్తోంది.

**అందిన కాడికి బాదెయ్...**

విజయవాడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి సూర్య హైదరాబాద్ నుంచి పండగ కోసం భార్యతో కలిసి రూ.3,500 ఖర్చు చేసి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఇంటికి వచ్చారు. మళ్లీ 18న తిరుగు ప్రయాణానికి ఆన్‌లైన్‌లో చూస్తే ఒక్కో టిక్కెట్ రూ.1,888 చూపించింది. అదీ నాన్ ఏసీ బస్సులో సీటు. ఇద్దరికీ కలిపి రూ.3,776. తప్పక బుక్ చేసినట్లు వాపోయారు. జనవరి14 నుంచి పండగ మొదలుకానున్న వేళ ఇప్పటికీ సొంతూళ్లకు వచ్చే వారి సంఖ్య భారీగానే ఉంది. ఓవైపు వారి జేబులు ఖాళీ చేస్తూనే 16, 17, 18 వరకు తిరుగు ప్రయాణాల్లోనూ దోపిడీకి తెరదీశారు. ఈ మూడు రోజులకు కలిపి విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు సాధారణ సర్వీసులతో కలిపి 120 మాత్రమే ఉన్నాయి. దీంతో వేలాదిగా వచ్చిన ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ వైపు చూస్తున్నారు. ఆన్‌లైన్ ధరలు చూస్తే బెదిరిపోవాల్సిందే.



అధిక ధరల వసూలుకు అనువుగా నాన్ ఏసీ బస్సులు ఒకటీ అర పెట్టి అన్ని ఏసీ స్లీపర్లే చూపిస్తున్నారు. ఆర్టీసీలో ఒక్కో టికెట్ రూ.436 ఉంది. ప్రైవేటు ట్రావెల్స్‌లో నాన్ ఏసీ సీటు రూ.1,200-1800 ఉంది. ఏసీ స్లీపర్లు, సెమీ స్లీపర్లకు రూ.1500-2,000పైగా సమర్పించాల్సిందే. ఈ బాదుడు భరించలేక వందల మంది యువకులు.. నేరుగా ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో దోపిడీ బహిరంగ రహస్యమైనా అధికారులేమో ఫిర్యాదులొస్తే కదులుదాం అన్నట్లు ఉన్నారు. క్షేత్రంలో తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న, అధిక వసూళు చేస్తున్న బస్సుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేదు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ దందా మరింత హద్దు మీరుతోంది.

## మామూళ్లకు.. బరి గీసి కూర్చొన్నారు..

ఏలూరు : అది ఏలూరుకు సమీపంగా ఉండే మండలం. ఓ ప్రజాప్రతినిధికి ఆ మండలంలో అన్నీ తానై వ్యవహరించే ఓ నాయకుడు ఏకంగా ప్రభుత్వ భూమిలోనే బరి ఏర్పాటు చేశా రు. అధికారులు దాన్ని ధ్వంసం చేయకుండా రూ.లక్షలు తీసుకుని మౌనంగా ఉండిపోయారు. మెట్ట ప్రాంతంలో ఓ స్టేషన్ పరిధిలో ఎన్నారైలు 2-3 గ్రామాల్లో ఎక్కువగా ఉన్నారు. వారంతా గ్రామాలకు వచ్చిన విషయం తెలుసుకుని పందేల వద్ద వారు పట్టుబడితే కేసు నమోదు చేసి పాస్‌పోర్టు సీజ్ చేస్తామని హెచ్చరించి బరుల నిర్వాహకుల నుంచి అడిగింది తీసుకున్నారు.

అది రెండు నియోజకవర్గాలకు సరిహద్దు పోలీస్‌స్టేషన్. అక్కడ నాలుగు పెద్ద బరులు, 20 వరకు చిన్నవి ఏర్పాటు చేశారు. పండగ మూడు రోజులకు కలిపి పెద్ద బరుల నుంచి ఒక్కో దానికి రూ.5-6 లక్షలు, చిన్న వాటి నుంచి ఒక్కో దానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు తీసుకున్నారు. ఆ స్టేషన్ అధికారిపై అక్కడి ప్రజాప్రతినిధికి సదాభిప్రాయం లేక ఆ మధ్య బదిలీ చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. సంక్రాంతి మామూళ్లపై కన్నేసిన ఆ అధికారి బదిలీ కాకుండా ఆపుకొన్నారు.

ఉమ్మడి జిల్లాలో కోడి పందేలు, జూదాలు పోలీసులకు కాసులు కురిపిస్తున్నాయి. గతంలో కన్నా ఈసారి మామూళ్లు బాగా ప్రెంచేశారు. బరుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని భయపెట్టి పలు




స్టేషన్ల అధికారులు రూ.లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారు.

**ఉంచమనేది అందుకే..** సంక్రాంతికి జూద శిబిరాల నిర్వాహకుల నుంచి భారీగా మామూళ్లు వస్తాయి. వాటిపై కన్నేసి కొందరు పోలీసు అధికారులు లాబీయింగ్ చేసుకుని బదిలీ వచ్చినా ఆపుకొంటారని వినికిడి. వీఆర్, లూప్‌లైన్‌లో ఉన్నోళ్లు ఇదే సమయంలో పోస్టింగ్ కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారని సమాచారం.

గొలుసు దుకాణాల నుంచి అధనం.. ఆ బరులు, జూద శిబిరాల వద్ద మద్యం గొలుసు దుకాణాలు, పాన్ మసాలాలు విక్రయించేవారు సైతం తక్కువలో తక్కువ రూ.10 వేల నుంచి రూ.20 వేల దాకా ముట్టజెబుతారు. ఇవి అధనం. ఇదిలా ఉండగా రూ.20-30 లక్షల నుంచి రూ.అరకోటికి పైగా స్టేషన్ మామూళ్లు వచ్చిపడతాయి. పలు స్టేషన్ల పరిధిలో పెద్దవి, చిన్నవి కలిపి 20కు తగ్గకుండా శిబిరాలు ఉన్నాయి.

**పశ్చిమలోనూ..**గతంలో పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లోనే పెద్దబరులు ఉండేవి. ఈ సారి ఆచంటలోనూ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో రెండు సిద్ధం చేస్తున్నారు. ఇవి కాక చిన్నాచితక గ్రామాల్లోనూ వెలిశాయి. ఇవి ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వెళ్తాయనేది జాబితాలు సిద్ధం చేసుకున్నారు. వీటి దగ్గర గతేడాది వచ్చిన లాభాలను దృష్టిలో ఉంచుకుని కొందరు వాటాలు నిర్ణయించుకున్నారు. గుండాట, పేకాట బోర్డులు పంచుకున్నారు. మద్యం, తాగునీటి సీసాలు, ఆహారానికి సంబంధించిన దుకాణాలను మద్యం సిండికేట్లకు అప్పగించారని చెబుతున్నారు.

# పడకేసిన గ్రామీణ వైద్యం



పుత్తూరు : పలమనేరు ప్రాంతీయ ఆసుపత్రిలోని నూతన భవనంలో అన్ని వసతులున్నా లిఫ్ట్ లేదు. దాంతో గర్భిణులు, బాలింతలకు ఇబ్బందిగా ఉంది. పుత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉంది. గతంలో నగరి ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ఒకరిని డిప్యుటేషన్‌పై నియమించినా గడువు ముగియడంతో ఆమె వెనక్కు వెళ్లారు. చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు నుంచి ఇద్దరిని మూడు రోజుల చొప్పున డిప్యుటేషన్‌పై పంపినా వారు సక్రమంగా విధులకు రావడం లేదు. దీంతో ప్రతినెలా 50- 60 డెలివరీలు జరిగే ఆసుపత్రిలో 15 కావడం లేదు. వి.కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు వైద్యులను నియమించాలి. అనస్తీషియా ఒకరు, మరో ఇద్దరు వైద్యులు అందుబాటులో లేరు. శస్త్రచికిత్సల కోసం రోగులను కుప్పం ప్రాంతీయ ఆసుపత్రికి పంపుతున్నారు.

శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. మరొకరిని డిప్యుటేషన్‌పై గుడుపల్లెకు పంపించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ వ్యాధి వచ్చినా ముందుగా ఆశ్రయించేది పీహెచ్‌సీలనే. ప్రతి వైద్యశాలలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరూ పనిచేస్తున్నవి వేళ్ల మీదే లెక్కించవచ్చు. జిల్లా, మండల కేంద్రాలు, జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న చోట మాత్రమే నిబంధనలకు అనుగుణంగా వైద్యులున్నారు. మిగతాచోట్ల ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. వీరైనా సకాలంలో వస్తారా? అంటే అదీ లేదు. బయట విజిట్‌కు వెళ్లినట్లు సిబ్బందితో సమాధానం చెప్పిస్తున్నారు. మధ్యాహ్నం వరకు ఓపీ చూడాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. రాత్రి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సమీపంలోనే నివాసం ఉండాలనే అంశం అమలు కావడంలేదు. పాలసముద్రం, పెద్దపంజాణి, ఐరాల, విజయపురం, వరదయ్యపాళెం, నాగలాపురం, ఏర్పేడు తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయి.

**గైనకాలజిస్టు, అనస్తీషియా, జనరల్ మెడిసన్‌లో..**

మరోవైపు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో గైనకాలజిస్టు, జనరల్ మెడిసన్, అనస్తీషియా విభాగంలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు 24 వరకు పోస్టులను భర్తీ చేయాలి. గైనకాలజిస్టులను డిప్యుటేషన్‌పై నియమించినా వారు తూతూమంత్రంగానే విధులు వస్తున్నారు. దాంతో ఎక్కువ మంది చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, పలమనేరుకు వెళ్తుతున్నారు. మత్తు వైద్య నిపుణుడు అందుబాటులో లేక శస్త్రచికిత్సలకు సమీపంలో ఉన్న వైద్యశాలలకు పంపుతున్నారు. వైద్యుడి సూచనల మేరకు ఫార్మసిస్టు మందులు అందించాల్సి ఉన్నా ఈ విభాగంలోనూ సిబ్బంది కొరత ఉంది. రెండు జిల్లాల్లో 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**పీహెచ్‌సీల్లో బి కాంప్లెక్స్ మాత్రలు లేవు**

ఈ నెల 2న గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేశారు. ఇద్దరు వైద్యులకు ఒకరు సెలవులో ఉండగా మరొకరు విధులకు రాలేదని గుర్తించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గ్రామీణ ప్రజలు ఎక్కువగా వచ్చే పీహెచ్‌సీలలో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. స్టాఫ్‌నర్సులే రోగులకు చికిత్స అందించడం రివాజుగా మారింది.

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం, తొట్టంబేడు పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## పండగలో సడేమియా.. నిర్మాణంలో మహా మాయ!!



విశాఖపట్నం : సంక్రాంతి పండగ వేళ అధికారులతో కుమ్మక్కై కొందరు పెద్ద ప్రణాళికే వేశారు. అనుమతులు పొందిన ప్లాన్‌ను మించి అదనపు అంతస్తులు రాత్రికిరాత్రే నిర్మించేస్తున్నారు. అవి బయటకు కనిపించకుండా చుట్టూ పరదాలు కట్టేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో ఇలాంటి భవన నిర్మాణాలు వందల సంఖ్యలో సాగుతున్నాయి. మధురవాడ జోన్-2 పరిధిలోని 5,6,7,8 వార్డుల పరిధిలో చిన్నా పెద్ద 40 వరకు నిర్మాణాలు చాలా వేగంగా నిర్మిస్తున్నారు. ఇది సీతంపేట పరిధిలోనిది. నిబంధనలు ఉల్లంఘించి కడుతున్నారు. ఎలాంటి సెట్‌బ్యాక్‌లు వదలకుండా సెల్లార్, జీప్లస్2 నిర్మాణం చేపట్టారు. దీనిపై ప్రజా పరిష్కార వేదికలో రెండు, మూడుసార్లు ఫిర్యాదు చేయగా అక్రమ నిర్మాణం అని కొంత పడగొట్టి అధికారులు నోటీసు ఇచ్చారు. అయితే మళ్లీ నిర్మాణ పనులు యథవిధిగా సాగుతున్నాయి.

ఈ భవనం పీఎం పాలెం ప్రధాన రహదారిలోనిది. జీప్లస్2 భవన నిర్మాణానికి ప్లాన్ అనుమతి పొంది నిబంధనలకు విరుద్ధంగా భూగర్భంలో సెల్లార్ నిర్మాణం చేశారు. సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో అనుమతుల్లేకుండా అదనపు అంతస్తు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది బయటకు కనిపించకుండా గ్రీన్ షేడ్ నెట్ చుట్టూ కట్టారు. రహదారి విస్తరణ పరిధి దాటి... ముందుకు వచ్చి నిర్మాణం చేపట్టారు. సెట్‌బ్యాక్ నిబంధనలు విస్మరించారు. ఈ అక్రమ నిర్మాణాన్ని బీపీఎస్‌లో పెట్టి సక్రమం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ భవనం తారకరామానగర్‌లోని ఓ కార్ల షోరూం సమీపంలో ఉంది. జీప్లస్2 అనుమతి తీసుకున్నారు. మరో రెండు అదనపు అంతస్తుల కోసం 15 రోజుల క్రితం టీడీఆర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పరిశీలనలో ఉండగానే ఆ రెండంతస్తులు నిర్మాణం పూర్తి చేశారు. అనుమతి పొందిన తర్వాతే నిర్మాణం ప్రారంభించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. పట్టణ ప్రణాళిక అధికారులు సైతం ఇటు దృష్టిసారించలేదు. మరో వైపు టీడీఆర్‌లకు దరఖాస్తు చేసుకోకుండానే చాలా నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ఒకవేళ దరఖాస్తు అనుమతి రద్దయితే నిర్మాణం పూర్తిచేసిన వారిపై ఏం చేస్తారో చూడాలి.మధురవాడ పోర్టు కాలనీలో జీప్లస్2 నిర్మాణానికి అనుమతి పొందారు. ఏకంగా బఫర్ జోన్ నిబంధనలు పక్కనపెట్టి గెడ్డను ఆనుకుని ఈ నిర్మాణం చేపట్టారు. అంతేకాదు ఎలాంటి అనుమతుల్లేకుండా మరో అదనపు అంతస్తు దాదాపు పూర్తి కావస్తోంది. తుదిదశలో ఉన్న అదనపు అంతస్తును పండగ తర్వాత బీపీఎస్‌లో పెట్టి క్రమబద్ధీకరించేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. వాస్తవానికి బీపీఎస్ గతేడాది ఆగస్టు 31లోపు నిర్మించిన భవనాలకే వర్తిస్తుంది.

## తీరంలో.. ఇసుక దొంగలు!



అనకాపల్లి: ఇసుక దొరకడమే తరువాయి.. వాగైనా, వంకైనా, చివరకు సముద్రపు తీరమైనా దోచుకోవడమే అన్నట్లు జిల్లాలో తవ్వకాల మాఫియా తయారైంది. రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల పరిధిలోని సముద్రతీరంలో ఇసుక తవ్వి.. నది ఇసుకలో కలిపి అమ్మేస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూ, మైనింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినా కనీసం పట్టించుకోవడంలేదు.

జిల్లాలో నిర్మాణరంగం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. ఇదే అవకాశంగా చేసుకుని అక్రమార్కులు తీర ప్రాంతాల్లో తవ్వకాలు ప్రారంభించారు. సముద్రపు ఇసుక నిర్మాణాలకు వినియోగిస్తే గోడలు బీటలు వారుతాయి. భవనాల జీవన కాలం తగ్గిపోతుంది. కానీ ఇవేవీ అక్రమార్కులకు పట్టడంలేదు. దీనికితోడు ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీరానికి రక్షణగా ఉండే దిబ్బలు కాస్తా కరిగిపోతున్నాయి. తీరం వెంట భారీ గుంతలతో రాత్రివేళల్లో వేటకు వెళుతున్నప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నామని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

నక్కపల్లి మండలం డి.ఎల్.పురం, అమలాపురం గ్రామాల పరిధిలో తవ్వకాల గురించి మత్స్యకారులు స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పాయకరావుపేట మండలం రాజానగరం, స్నానాలరేవు, రత్నాయంపేటలో తీరం వద్ద వేసిన జీడి మొక్కలను తొలగించి ఇసుక తిన్నెలను తరలించేస్తున్నారు.

రాంబిల్లి మండలంలోని వాడపాలెం, వాడ నర్సాపురం, కొత్తపట్నం, సీతపాలెం గ్రామాల వద్ద తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

తీరంలో తవ్వితే చర్యలు : శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారి

అనుమతులు లేకుండా సముద్రపు ఇసుకను తవ్వడం నేరం. దీనిని నిర్మాణాలకు వినియోగిస్తే.. భవనాలు స్వల్పకాలంలోనే కూలిపోయే ప్రమాదం ఉంది. నది ఇసుకలో.. సముద్రపు ఇసుక కలిపి అమ్మడం నేరం. ఇలాంటి అక్రమాల్లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు. సముద్ర తీర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో నిఘా ఉంచుతాం.

## కట్టడి లేదు.. కత్తి దూసుడే!

మచిలీపట్నం : ఉమ్మడి కృష్ణాలో పందెం ఆటగాళ్లు కోడి పందేలకు కాలు దువ్వుతున్నారు. పుంజులు సమరానికి సై అంటున్నాయి. దాదాపు అన్ని చోట్లా బరులు సిద్ధమయ్యాయి. బారికేడ్లు.. వీఐపీ గ్యాలరీలు, ఫ్లడ్‌లైట్లు.. మైక్ అనౌన్స్‌మెంట్లు.. స్టేజీలు.. భారీ ఎల్ఈడీ తెరలు.. మందు.. విందు.. చిందు.. వంటి అన్ని వసతులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. శీతల గదులు.. కార్డ్స్ ఆడేందుకు ప్రత్యేక తెరలు పెడుతున్నారు. ఫంక్షన్ హాళ్లు.. హోటళ్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో తిరువూరు, విస్సన్నపేట, కేసరపల్లి, గుడివాడ, ఈడుపుగల్లు, ఉప్పులూరు, లక్ష్మీపురం, పులిగడ్డ, అంబాపురం, పి.నైనవరం, రామవరప్పాడు తదితర ప్రాంతాల్లో హైటెక్ బరులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో రూ.కోట్లలో పందేలు ఉండనున్నాయి. నేతలు, పోలీసుల అనుమతులు.. నోట్ల కట్టలు చేతులు మారే ఒప్పందాలు దాదాపు పూర్తయ్యాయి.

**డబ్బులెట్టు.. స్టాల్ పెట్టు..**

ఒక్కో శిబిరం నిర్వహించేందుకు రూ.10లక్షల నుంచి రూ.కోటికి పైగా నిర్వాహకులు పెట్టుబడి పెడుతున్నారు. అంతకు నాలుగైదు రెట్లు తిరిగి రాబట్టేందుకు పందెం రాయుళ్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నాపెద్ద బరుల వద్ద మద్యం బెల్టు స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు విపరీత డిమాండ్‌తో నిర్వాహకులకు కాసుల వర్షం కురుస్తోంది. వీటికి స్థానిక నేతలు.. ఎక్సైజ్‌శాఖ,



పోలీసుల వద్ద లోపాయికారి ఒప్పందాలు జరిగాయి. బరుల వద్ద బహిరంగంగానే మద్యం అమ్మకాలు ఉండనున్నాయి.

బిరియానీ, ఫాస్ట్‌ఫుడ్ వివిధ రకాల ఆహారపు స్టాల్స్.. కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్, పాన్ మసాలాలు.. సిగరెట్లు తదితర కౌంటర్లు పెట్టుకునేందుకు పలు పార్టీల చోటామోటా నేతలు పోటీ పడుతున్నారు.

**వీరికి ఎక్కువ డిమాండ్**

పందెం పుంజులకు కత్తులు కట్టేవారికి డిమాండ్ పెరిగింది. ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల నుంచి కత్తులు కట్టేవారిని ముందే బుక్ చేసుకున్నారు. గోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున రప్పిస్తున్నారు.

**బౌన్సర్లు.. సెక్యూరిటీలు.. పార్కింగ్ రుసుం వసూళ్లు ఉండనున్నాయి.**

కోడి పందేలతో పాటు కార్డ్స్, కాయ్‌రాజాకాయ్, గుండాట తదితర జూద క్రీడలు నిర్వహించేందుకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కార్డ్స్ ఆడేందుకు ప్రత్యేకంగా ప్రవేశ రుసుం రూ.5వేల వరకు పెడుతున్నారు.గుడివాడ, కేసరపల్లి, ఉప్పులూరు, ఈడుపుగల్లు, విజయవాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ఒక్కో పందెం రూ.లక్షల్లో ఉంటుందని ప్రచారాలు చేస్తున్నారు.

## జగన్మాత సేవలో.. కొత్త శకం!

అమరావతి : 'దుర్గగుడిలో దర్శనాలు, ఇతర సేవల టికెట్ల చెల్లింపుల్లో 'సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌ల' శకం ఆరంభం కానుంది. ఇకపై అన్నీ పూర్తిగా డిజిటల్ పేమెంట్లలోకి మార్చేయనున్నారు. కియోస్క్ యంత్రాల ద్వారా టికెట్లన్నీ అత్యంత తేలికగా తీసుకునే సౌలభ్యం రాబోతోంది. కరూర్ వైశ్యా బ్యాంకు ఆధ్వర్యంలో తొలిదశలో నాలుగు యంత్రాలను ఏర్పాటు చేయనుండగా.. ఇవి ఆలయానికి వచ్చేశాయి. దుర్గగుడి ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్, లిఫ్ట్ ప్రాంతాల్లో భక్తుల రద్దీ ఉండేచోట వీటిని పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదించగా.. సంక్రాంతి తర్వాత కియోస్క్‌లను బిగించనున్నారు.'

**సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి...**

దుర్గగుడిలో అన్ని సేవల వివరాలు, ధరలతో సహా టికెట్లను కియోస్క్‌లలో నిక్షిప్తం చేస్తారు. వాటిలో క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి.. అన్నిరకాల ఆన్‌లైన్ పేమెంట్లను చేసి.. తేలికగా టికెట్లను పొందేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ బాధ్యతను ప్రస్తుతం టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సేవలందిస్తున్న డిజిసాఫ్ట్ ఇన్‌సైట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కే అప్పగించారు.

**తిరుపతి తరహాలో మార్పు...**

తిరుపతిలో ఇప్పటికే ఈ కియోస్క్‌ల ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. అక్కడ దాతల నుంచి విరాళాల సేకరణకూ వీటిని వాడుతున్నారు. తొలిగా నాలుగు యంత్రాలను పెట్టి.. దశల వారీగా పూర్తిగా డిజిటల్ పేమెంట్లు చేసేలా మార్చనున్నారు. అందుకే.. ప్రస్తుతానికి డబ్బులు చెల్లించి టిక్కెట్లు కొనేందుకు పరిమితంగా ఒకటి రెండు మాత్రమే



సింగిల్ విండో కౌంటర్లు ఉంచుతారు.

**అందరికీ అనువుగా..**

సెల్‌ఫోన్‌ను భక్తులు కౌంటర్లలో భద్రపరచడానికి ముందే టికెట్లను తీసుకునే ప్రాంతాల్లోనే ఈ కియోస్క్‌లను పెట్టనున్నారు. ఇందుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని దేవాదాయశాఖ ఆదేశించింది. భక్తులు సులభంగా చేరుకునేలా, అందరికీ స్పష్టంగా కనిపించేలా రద్దీ ప్రాంతాల్లో వీటిని పెట్టనున్నారు.

**విస్తృత ప్రచారం..** సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌లు, డిజిటల్ చెల్లింపుల గురించి ఇకనుంచి భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా నిరంతరం ఆలయ పరిసరాల్లో ప్రచారం చేస్తారు. కియోస్క్‌ల వద్ద వాలంటీర్లను నియమించి.. భక్తులకు మార్గనిర్దేశం చేయనున్నారు.

## చీరకట్టులో దివి అందాలు చూడతరమా?

ఒకవైపు సినిమాలలో అవకాశాలు అందుకుంటూనే.. మరొకవైపు సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో ఫాన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారిలో దివి కూడా ఒకరు. 2019లో వచ్చిన మహేష్ బాబు 'మహర్షి' సినిమా ద్వారా సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. ఇక ఈ సినిమాలో నటిగా పెద్దగా గుర్తింపు రాకపోయినా.. బిగ్ బాస్ తెలుగు సీజన్ 4 లో కంటెస్టెంట్ గా పాల్గొని ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది. 2020లో హైదరాబాద్ టైమ్స్ టీవీ పరిశ్రమకు చెందిన మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ గా అవార్డు కూడా అందుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ మధ్యకాలంలో నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఒలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న దివి తాజాగా మరోసారి చీరకట్టులో గ్లామర్ డోస్ పెంచేసింది. నడుము అందాలను చూపిస్తూ తన గ్లామర్ తో హైలెట్గా నిలిచింది .చక్కగా జుట్టును ముడి వేసుకొని.. స్టోన్ తో డిజైన్ చేసిన చెవి దుద్దులు పెట్టుకున్న ఈమె.. మెడను సింపుల్ చైన్ తో ఫుల్ ఫీల్ చేసింది. ఇక ఎర్రటి గాజులు ధరించి మరింత అందంగా ముస్తాబయింది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికైతే చూడ చక్కని బొమ్మలా అందరి దృష్టిని ఆకర్షించింది దివి అంటూ ఆమె అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఏదేమైనా చాలా రోజుల తర్వాత ఇలా సింపుల్ లుక్ లో చీర కట్టులో కూడా



అందరి హృదయాలు దోచుకుంది దివి. ఇదిలా ఉండగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న దివి4 తన కెరియర్ లో జరిగిన పలు విషయాలను అభిమానులతో పంచుకుంది. అలాగే ఒక ఇంటర్వ్యూలో పాల్గొని వ్యక్తిగత స్వేచ్ఛ , సమాజంలో మహిళల పట్ల అవగాహన గురించి లోతైన చర్చను ప్రారంభించింది . అందులో భాగంగానే ఒక పబ్ ఈవెంట్ కి అతిథిగా వెళ్ళినప్పుడు ఎదురైన సంఘటన గురించి చెప్పుకొచ్చింది. దివి మాట్లాడుతూ.." ఇటీవల ఒక పబ్ ఈవెంట్ కి అతిథిగా వెళ్లాను. చుట్టూ బాడీగార్డ్లు ఉన్నప్పటికీ కూడా ఒక వ్యక్తి నా నడుముకి గిల్లాడు. ఆ సంఘటన జరిగిన వెంటనే వెనక్కి తిరిగి ఆ వ్యక్తిని కొట్టి అక్కడి నుంచి వెళ్ళిపోయాను. అయితే ఈ చర్య పట్ల నాకు ఏమాత్రం పశ్చాతాపం లేదు. ఒకవేళ నేను అలా స్పందించకపోతే భవిష్యత్తులో బాధపడేదాన్నేమో.. నా చుట్టూ భద్రత ఉన్నప్పటికీ ఈ సంఘటన జరిగింది.. అయితే ఇది నా దుస్తుల వల్ల జరగలేదు" అంటూ నొక్కి మరీ చెప్పింది దివి.. సౌకర్యవంతమైన టీ షర్టు ధరించినప్పటికీ ఒక ఆకతాయి ఇలా చేయడం నాకు ఏమాత్రం నచ్చలేదు. అందుకే చర్యకు ప్రతిచర్య జరిగింది అంటూ చెప్పుకొచ్చింది..ప్రస్తుతం దివి చేసిన ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఏది ఏమైనా మహిళల వస్త్రధారణ పై కామెంట్లు వస్తున్న నేపథ్యంలో తాను సభ్యతగా ఉన్నప్పటికీ ఇతరుల వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఇన్ డైరెక్ట్ గా చెప్పుకొచ్చింది.

## మెగా 158: చిరంజీవి కూతురుగా ధురంధర్ బ్యూటీ!

ఈ ఏడాది అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా చేసి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు మెగాస్టార్ చిరంజీవి. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో వెంకటేష్ , నయనతార కీలక పాత్రలు పోషించారు. రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి ఇండస్ట్రీ హిట్ గా నిలవడంతో.. చిరంజీవి తదుపరి చిత్రంపై అందరి అంచనాలు నెలకొన్నాయి ఇప్పటికే 'వాల్తేరు వీరయ్య' సినిమా చేసి మంచి విజయం అందించిన డైరెక్టర్ బాబి కొల్లితో మళ్లీ జతకట్టారు చిరంజీవి. మెగా 158 అనే వర్కింగ్ టైటిల్ తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా ఈ సినిమా నుంచీ ఒక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. ఇటీవలే ధురంధర్ సినిమాతో సంచలనం సృష్టించిన చైల్డ్ ఆర్టిస్ట్ సారా అర్జున్ ఇందులో చిరంజీవికి కూతురు పాత్ర చేయనున్నట్లు సమాచారం. అయితే



దీనిపై అధికారిక ప్రకటన వెలువడకపోయినా.. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఇదిలా ఉండగా ఇప్పటికే ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి కూతురిగా శ్రీ లీల, అనస్వర రాజన్ వంటి వారి పేర్లు కూడా వినిపించాయి.దీనికి తోడు కృతి శెట్టి పేరు కూడా తెరపైకి రాగా.. ఇప్పుడు ఈ రేసులో సారా అర్జున్ పేరు గట్టిగా వినిపిస్తూ ఉండడం గమనార్హం. అయితే దీని గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ~శ్రీంశీ సారా అర్జున్ విషయానికి వస్తే.. ఒకప్పుడు విక్రమ్ హీరోగా నటించిన నాన్న సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరియర్ మొదలుపెట్టిన ఈమె.. ఆ తర్వాత పదుల సంఖ్యలో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది. ఇక దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియన్ సెల్వన్ సినిమాలో ఐశ్వర్యరాయ్ చిన్నప్పటి పాత్ర పోషించి అందరూ దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఇప్పుడు బాలీవుడ్ స్పై థ్రిల్లర్ ధురంధర్ సినిమాలో రణవీర్ సింగ్ సరసన నటించి మరింత క్రేజ్ సొంతం చేసుకుంది ..ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా వసూలు రాబట్టడంతో ఈమె గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగిపోయిందని చెప్పవచ్చు. ఇక మరోవైపు గుణశేఖర్ దర్శకత్వంలో 'యుఫోరియా' సినిమాతో ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిరంజీవి - బాబీ సినిమా విషయాలకొస్తే.. ఇందులో మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ కీలక పాత్ర పోషిస్తున్నారు . అలాగే ప్రముఖ సీనియర్ హీరోయిన్ ప్రియమణి కూడా భాగమయ్యింది. అలాగే ఆస్కార్ గ్రహీత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కూడా ఇందులో నటిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా భారీ అంచనాల మధ్య భారీ తారాగణం , అగ్రశ్రేణి సాంకేతిక నిపుణుల కలయికతో వస్తున్న ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.




## వారణాసి నెక్ట్స్ స్టాప్ ఎక్కడో తెలుసా?



రాజమౌళి సినిమా అంటేనే లోకల్ నుంచి గ్లోబల్ వరకు ఒక రేంజ్ క్రేజ్ ఉంటుంది. ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' మూవీ విషయంలో కూడా జక్కన్న అదే పంథా అనుసరిస్తున్నారు. సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి షూటింగ్ ఎక్కడ జరుగుతోంది? మహేష్ బాబు లుక్ ఎలా ఉండబోతోంది? అనే విషయాలపై సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంది. ఇండియన్ స్క్రీన్ పై మునుపెన్నడూ చూడని విజువల్స్ చూపించడమే టార్గెట్ గా టీమ్ వర్క్ చేస్తోంది. సినిమాలో టైమ్ ట్రావెల్ ఉంటుందని ఇదివరకే క్లారిటీ ఇచ్చారు. రామాయణ కాలానికి వెళ్లేలా కూడా ఒక ఎపిసోడ్ హైలెట్ కానుంది.

ఇక ఈ భారీ ఫాంటసీ అడ్వెంచర్ డ్రామా కోసం ఇప్పటికే హైదరాబాద్ లోని పలు కీలక ప్రాంతాల్లో షూటింగ్ కంప్లీట్ చేశారు. మహేష్ బాబు తన పాత్ర కోసం ఫిజికల్ గా చాలా మేకోవర్ అయ్యారు. ఫ్యాన్స్ ఈ సినిమా అప్డేట్స్ కోసం ఆసక్తిగా వెయిట్ చేస్తున్న తరుణంలో షూటింగ్ లొకేషన్ల గురించి ఒక ఇంట్రెస్టింగ్ మ్యాటర్ బయటకు వచ్చింది. కేవలం మన దేశంలోనే కాకుండా విదేశాల్లోని అత్యంత కఠినమైన వాతావరణంలో కూడా షూట్ చేయడానికి ప్లాన్ రెడీ అయ్యింది.ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. వారణాసి సినిమాకు సంబంధించిన కోకాపేట షెడ్యూల్ దాదాపు పూర్తి కావచ్చింది. దీని తర్వాత అల్యూమినియం ఫ్యాక్టరీలో జరిగే చిన్న షెడ్యూల్ ని ఫినిష్ చేయగానే టీమ్ అంతా విదేశాలకు వెళ్లనుంది. తర్వాతి షెడ్యూల్స్ కోసం జార్జియా తో పాటు ఏకంగా అంటార్కిటికా వెళ్తున్నట్లు సమాచారం. అంటార్కిటికా మంచు కొండల్లో మహేష్ బాబుపై కొన్ని కీలకమైన సీన్లు షూట్ చేయాలని రాజమౌళి ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది.?ఒక ఇండియన్ సినిమాను అంటార్కిటికా వంటి ప్రదేశాల్లో షూట్ చేయడం అంటే అది మామూలు విషయం కాదు. అక్కడి వాతావరణాన్ని తట్టుకుని షూటింగ్ చేయడం ఒక పెద్ద ఛాలెంజ్. కానీ రాజమౌళి విజన్ కి తగ్గట్టుగా అవుట్ పుట్ రావాలంటే అలాంటి లొకేషన్లు తప్పవని టీమ్ భావిస్తోంది. మహేష్ బాబు కూడా ఈ సాహసోపేతమైన షెడ్యూల్ కోసం తనను తాను సిద్ధం చేసుకుంటున్నారట. గ్లోబల్ ఆడియన్స్ ని ఆకట్టుకోవాలంటే ఇలాంటి లొకేషన్లు సినిమాకు పెద్ద ఎసెట్ అవుతాయి. ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ కోసం ఇప్పటికే హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. కేవలం మంచు కొండలు మాత్రమే కాకుండా ఆఫ్రికా అడవుల్లో కూడా కొన్ని సీన్లు ఉంటాయని టాక్. అంటే ప్రేక్షకులు థియేటర్లలో కూర్చుని ప్రపంచాన్ని చుట్టి వచ్చేలా జక్కన్న ప్లాన్ చేశారు. మహేష్ బాబు కెరీర్ లోనే ఇది ఒక బిగ్గెస్ట్ ఎక్స్ పీరియన్స్ కాబోతోంది. షూటింగ్ నాన్ స్టాప్ గా జరిపి అనుకున్న టైమ్ కి సినిమాను ఆడియన్స్ ముందుకు తీసుకురావాలని టీమ్ పట్టుదలగా ఉంది. వారణాసి షూటింగ్ స్పీడ్ చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు ఖాయమనిపిస్తోంది. ఇక 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కాబోతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్ ఇంకెన్ని వింతలు చూపిస్తుందో చూడాలి.

## సౌత్ హీరోయిన్స్ పై దృష్టి పెడుతున్న బాలీవుడ్.. అసలు ఏమైందంటే?





సాధారణంగా ఒక సినిమాను తెరకెక్కించేటప్పుడు అందులో లీడింగ్ యాక్టర్స్ ను తీసుకోవడానికి చిత్ర బృందం ప్రయత్నిస్తుంది..ముఖ్యంగా ఒక భాషలో సినిమా చేస్తున్నప్పుడు ఆయా భాషలలో భారీ పాపులారిటీ సంపాదించుకున్న హీరో హీరోయిన్స్ కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఉంటారు. అయితే ఏమైందో తెలియదు కానీ గత కొంతకాలంగా బాలీవుడ్ సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్లుగా చలామణి అవుతున్న హీరోయిన్స్ ఈమధ్య కాలంలో బాక్సాఫీస్ వద్ద తమ నటనతో మెప్పించలేకపోతూ ఉండడం గమనార్హం . ఈ నేపథ్యంలోని ఇప్పుడు బాలీవుడ్ దృష్టి మొత్తం సౌత్ హీరోయిన్లపై పడటం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సౌత్ హీరోయిన్స్ పై కన్నేసిన బాలీవుడ్.. ముఖ్యంగా బాలీవుడ్ సినీ పరిశ్రమలో భారీ ప్రాజెక్టుల కోసం సౌత్ హీరోయిన్స్ ని ఎంపిక చేసుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఉదాహరణకు ఇండియన్ బాక్సాఫీస్ చరిత్రలోనే సుమారుగా 4000 వేల కోట్ల బడ్జెట్తో తెరకెక్కుతున్న హిందీ 'రామాయణం' సినిమాలో సౌత్ హీరోయిన్ అయిన లేడీ పవర్ స్టార్ సాయి పల్లవిని సీత పాత్ర కోసం ఎంపిక చేసుకున్నారు. దీనికి తోడు ఇటీవల స్పై థ్రిల్లర్ మూవీ 'ధురంధర్' లో కూడా సౌత్ బ్యూటీ సారా అర్జున్ ను హీరోయిన్గా ఎంపిక చేసుకున్నారు. ఈ సినిమా 1300 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేయడమే కాకుండా ఇండియన్ బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది.దీనికి తోడు ఇప్పటికే బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ కురిపించిన ఛావా, యానిమల్ వంటి చిత్రాలలో కూడా సౌత్ హీరోయిన్ రష్మిక మందన్న నటించడం గమనార్హం. అయితే ఇప్పుడు మరోసారి బాలీవుడ్ స్టార్ హీరో సినిమాలో సౌత్ హీరోయిన్లను పరిశీలిస్తూ ఉండడం సంచలనంగా మారింది. విషయంలోకి వెళ్తే.. గత ఏడాది డిసెంబర్ 5న ధురంధర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న రణవీర్ సింగ్ ఇప్పుడు తన తదుపరి ప్రాజెక్టు 'ప్రలే' కోసం సిద్ధమవుతున్నారు. ఇది కూడా భారీ బడ్జెట్ తో లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కబోతోంది ముఖ్యంగా ఈ సినిమాలో మహిళా ప్రధాన పాత్ర చిత్రానికే హైలైట్ గా నిలవనుందని సమాచారం. అయితే ఇప్పుడు తాజాగా బాలీవుడ్ పరిశ్రమ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం..ఈ ప్రలే సినిమా కోసం కూడా ఇప్పుడు సౌత్ హీరోయిన్స్ ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కాంతార చాప్టర్ 1 సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న రుక్మిణి వసంత్ తో పాటు భాగ్యశ్రీ బోర్సే పేర్లను పరిశీలిస్తున్నారట. ముఖ్యంగా ఈ ఇద్దరిలో ఎవరో ఒకరిని ఫైనల్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ సినిమాతో పాటూ కన్నడ హీరో యష్ నటిస్తున్న టాక్సిక్ సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది.. అలా ఈమె వరుస సినిమాలతో బిజీగా ఉన్న నేపథ్యంలో తన డేట్స్ ను ప్రలే కోసం ఉపయోగిస్తుందా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. మరోవైపు భాగ్యశ్రీ బోర్సే చివరిగా ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాతో ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు ఆమె ఖాతాలు మరో పెద్ద ప్రాజెక్టు అయితే ఏదీ కనిపించడం లేదు. అయితే మరి ఇద్దరిలో ఎవరిని ఎంపిక చేసుకుంటారు అన్నది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

## పెళ్లి కోసం షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చేసిందిగా?

టాలీవుడ్ క్రేజీ లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మికమందన్న ఈ ఇద్దరు త్వరలో వివాహం చేసుకోబోతున్నారని వార్తలు షికారు చేస్తున్నవిషయం తెలిసిందే. అక్టోబర్‌లో వీరి నిశ్చితార్థం జరిగింది. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొనగా ఓ ప్రైవేట్ ఫంక్షన్‌లా ఈ కార్యక్రమంలా దీన్ని నిర్వహించినట్టు అప్పట్లో వార్తలు వినిపించాయి. అయితే దీనిపై అటు విజయ్ దేవరకొండ కానీ, ఇటు రష్మిక మందన్న కానీ స్పందించలేదు. మీడియా అడిగినా సమయం వచ్చినప్పుడు మాత్రమే పెళ్లి గురించి వెల్లడిస్తానని రష్మిక చెప్పిందే కానీ విజయ్ దేవరకొండని వివాహం చేసుకుంటున్నానని మాత్రం స్పష్టం చేయలేదు. దీంతో సినీ అభిమానుల్లో చాలా కన్‌ఫ్యూజన్ నెలకొంది. ఇంతకీ వీరిద్దరి వివాహం జరుగుతుందా? అది ప్రచారమేనా? అని అభిమానులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా విజయ్ దేవరకొండ, రష్మికల వివాహం ఫిబ్రవరిలో జరుగుతుందంటూ ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో అత్యంత అట్టహాసంగా భారీ డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుందని తెలుస్తోంది. దీనిపై ఇంత వరకు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల టీమ్ నుంచి క్లారిటీ లేదు. అలా అని దీన్ని వారు ఖండించనూ లేదు. దీంతో విజయ్ దేవరకొండ, రష్మికల వివాహం ఉదయ్‌పూర్‌లోని ప్యాలెస్‌లో అత్యంత భారీ స్థాయిలో జరగనుందనే సంకేతాలు మొదలయ్యాయి. దాన్ని నిజం చేస్తూ రష్మిక మందన్న తన సినిమాల షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చేసిందని తెలుస్తోంది. రష్మిక మందన్న ప్రస్తుతం మైసా, కాక్‌టేయిల్ 2తో పాటు బన్నీ నటిస్తున్న భారీ పాన్ వరల్డ్ మూవీలోనూ నటిస్తోంది. -పుష్ప-తో అదరిగొట్టిన



ఈ జోడీ మరోసారి అట్లీ మూవీ కోసం జోడీ కడుతున్నారు. అధికారికంగా ప్రకటించకపోయినా రష్మిక ఇందులో నటిస్తున్నట్టుగా తెలుస్తోంది. దీపికా పదుకునే, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్‌లు కూడా ఇందులో హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. అయితే దీపికని మాత్రమే ఇంత వరకు టీమ్ అఫీషియల్‌గా ప్రకటించింది. కానీ రష్మిక మందన్న కూడా ఇందులో బన్నీకి సమానమైన క్యారెక్టర్‌లో కనిపించి తనతో పాటు యాక్షన్ ఘట్టాల్లో ఫైట్‌లు కూడా చేస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. దాదాపు నెల రోజుల పాటు ఇండోర్‌లో జరగనున్న ఈ షూటింగ్‌లో అల్లు అర్జున్, రష్మిక, జాన్వీకపూర్, జిమ్ సర్బ్ పాల్గొననున్నారని, వీరిపై పలు కీలక యాక్షన్ ఘట్టాలని దర్శకుడు అట్లీ చిత్రీకరించనున్నాడని వార్తలు షికారు చేస్తున్నాయి. ~శ్రీంశీ =ఘుస - స్టేజ్ పైనే కన్నీళ్లు పెట్టుకున్న భూమిక.. అసలేం జరిగిందంటే? #AA22xA6 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ మూవీ తాజా షెడ్యూల్ ఫిబ్రవరి 15 వరకు సాగుతుందట. అయితే ఫిబ్రవరి 26న విజయ్ దేవరకొండతో వివాహం జరగనున్న నేపథ్యంలో రష్మిక బన్నీ, అట్లీల మూవీకి బ్రేక్ ఇవ్వనుందని తెలుస్తోంది. బన్నీ మూవీతో పాటు మిగతా షూటింగ్‌లకు కూడా రష్మిక బ్రేక్ ఇవ్వబోతోందని ప్రచారం జరుగుతుండంతో పెళ్లి కోసం రష్మిక రెడీ అవుతోందని సంకేతాల్ని అందిస్తోందని ఆమె ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఫిబ్రవరి 26న జరగబోయే వివాహం కోసం అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి పెళ్లి రోజైనా ఆ విషయాన్ని విజయ్ దేవరకొండ, రష్మిక అధికారికంగా వెల్లడిస్తారో..లేక ప్రైవేట్ ఈవెంట్ అని పెళ్లిని కూడా సీక్రెట్‌గా దాచేస్తారో వేచి చూడాల్సిందే.

## ఆ ఆఫర్ కోసం ప్రార్థించమంటున్న మృణాల్

ఆడియన్స్‌కే కాదు, నటీనటులకు కూడా ఫలానా వారితో వర్క్ చేయాలి, ఫలానా కాంబినేషన్ లో సినిమా చేయాలనుంటుంది. ఆ కాంబినేషన్ లో నటించే ఛాన్స్ ఎప్పుడెప్పుడొస్తుందా అని వాళ్లు కూడా వెయిట్ చేస్తుంటారు. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా అలాంటి ఓ కాంబినేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. టెలివిజన్ నటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మృణాల్ తర్వాత హీరోయిన్ గా మారిన విషయం తెలిసిందే. సీతారామంతో మంచి గుర్తింపు సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన మృణాల్ ఆ సినిమాలో సీతగా నటించి అందరి మనసుల్లోనూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. సీతారామం తర్వాత మృణాల్ కు వరుస అవకాశాలు వచ్చినప్పటికీ ఆమె మాత్రం చాలా సెలెక్టివ్ గా సినిమాలను ఎంచుకుంటూ కెరీర్లో సక్సెస్‌ఫుల్ హీరోయిన్ గా రాణిస్తున్నారు. డెకాయిట్ లో విభిన్న పాత్ర సీతారామం తర్వాత హాయ్ నాన్న తో మరో హిట్ ను అందుకున్న మృణాల్, ఓ వైపు తెలుగులో సినిమాలు చేస్తూనే మరోవైపు బాలీవుడ్ లోనూ అవకాశాలను



అందుకుంటున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో అడివి శేష్ సరసన డెకాయిట్ అనే సినిమాలో నటిస్తున్నారు మృణాల్. ఈ సినిమాలో మృణాల్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతున్నట్టు ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్, టీజర్ చూస్తే అర్థమవుతుంది.

**అల్లు అర్జున్ మూవీలో మృణాల్ :** ఇక అసలు విషయానికొస్తే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. దీపికా పదుకొణె హీరోయిన్ గా నటించనున్న ఈ సినిమాలో మరో ఇద్దరు హీరోయిన్లకు కూడా స్కోప్ ఉందని, ఆ ఇద్దరిలో ఒకరిగా మృణాల్ ఎంపికయ్యారని ఎప్పట్నుంచో వార్తలొస్తున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో భాగంగా మృణాల్ ను అల్లు అర్జున్ తో చేయబోయే సినిమా గురించి హోస్ట్ అడిగారు. ఆ ప్రశ్నకు ఆశ్చర్యపోయిన మృణాల్, నేను అల్లు అర్జున్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్నానా? అది నిజంగా జరగాలని ప్రార్థించమని, అనుకున్నట్టు జరిగితే దాన్ని సెలబ్రేట్ చేసుకోవడంతో పాటూ మళ్లీ మరో ఇంటర్వ్యూ ఇస్తానని మృణాల్ చెప్పడంతో అల్లు అర్జున్- అట్లీ మూవీలో మృణాల్ నటించడం లేదనే విషయంలో అందరికీ క్లారిటీ వచ్చింది. ఇక అల్లు అర్జున్- అట్లీ సినిమా గురించి చెప్పాలంటే ఈ మూవీ AA22 వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతోంది. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామాగా ఈ మూవీ రూపొందుతుంది. పుష్ప2 తర్వాత బన్నీ నుంచి వస్తున్న సినిమా కావడంతో అందరికీ దీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ మూవీలో హీరో క్యారెక్టర్ మూడు విభిన్న కోణాల్లో ఉంటుందని సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో భారీ వీఎఫ్ఎక్స్ ఉండనున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536